శనివారం 15-4-2023



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 210

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





విజయలక్ష్మి



తన చిత్రాలతో విజయలక్ష్మి

సంకల్పానికి చిత్రరూపం

ఆమె చిత్రలేఖనంలో మనకు కనిపించేది ఒక రూపం కాదు... అనేకం. బుద్ధుడి బొమ్మలో కేవలం బుద్ధుడు మాత్రమే కాదు... బ్రష్ పట్టుకుని... తదేక దీక్షతో బుద్ధుడి బొమ్మ వేస్తున్న ఓ టీనేజ్ అమ్మాయి కూడా ఉంటుంది. రవివర్మ కుంచెకు అందిన అందం... విజయలక్ష్మి చిత్రాల్లో ద్యోతకమవుతుంది.



తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా, శామీర్ పేట మండలంలో ఉంది తుర్కపల్లి. ఆ ఊరిలో అత్యంత సాధారణ కుటుంబంలో పుట్టిన అమ్మాయి చిత్రలేఖనంతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంది. కళారత్న, అబ్దుల్ కలామ్ అవార్డులతోపాటు లెక్కలేనన్ని పురస్కారాలు, ప్రశంసలు ఆమె సొంతమయ్యాయి. తన రంగుల ప్రస్థానాన్ని, ఒక చిత్రంలో లెక్కకు మించిన వివరాలను పొందుపరచడంలో తన అభిరుచిని, బొమ్మల పట్ల తన ఇష్టాన్ని సాక్షితో పంచుకున్నారు విజయలక్ష్మి.

అసాధారణమైన ప్రతిభ

''నా జీవితంలో బొమ్మలు ఎప్పుడు ప్రవేశించాయో స్పష్టంగా చెప్పలేను. ఎందుకంటే నా దృష్టిని ఆకర్షించిన దృశ్యాలకు చిత్రరూపం ఇవ్వడం నా బాల్యంలోనే మొదలైంది. నన్ను స్కూల్‌కి మా అన్న తీసుకువెళ్లి, తీసుకువచ్చేవాడు. నాకు చదువంటే చాలా ఇష్టం. ఇంటికి వచ్చిన తర్వాత కూడా పుస్తకాలే నా లోకం. అందులోని బొమ్మలే నా స్నేహితులు. అందరి పిల్లల్లా ఆడుకోవడం నాకు కుదరదు కదా. అందుకే చదువుకుంటూ, బొమ్మలేసుకుంటూ పెరిగాను. టెన్త్‌క్లాస్ తర్వాత కాలేజ్‌కెళ్లడం కష్టమైంది. కొన్నేళ్ల విరామంలో సైకాలజీ, ప్రముఖుల బయోగ్రఫీలు, భగవద్గీత... అదీ ఇదీ అనే తేడా లేకుండా నాకు దొరికిన ప్రతి పుస్తకాన్నీ చదివాను. ఆ తర్వాత డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ చేశాను. చదివేకొద్దీ నా ఆలోచన పరిధి విస్తృతం కాసాగింది. నా గురించి నేను ఆలోచించడమూ ఎక్కువైంది. ఒక వ్యక్తి అసాధారణమైన నైపుణ్యాలను సాధించినప్పుడు ఆ వ్యక్తిని ఆ ప్రత్యేకతలతోనే గుర్తిస్తారు. ఇతర లోపాలున్నా సరే అవి తొలుత గుర్తుకురావు. నాకు ఎడమ చెయ్యి మాత్రమే మామూలుగా పని చేస్తుంది. రెండు కాళ్లు, కుడి చెయ్యి చిన్నప్పుడే పోలియో భూతం బారిన పడ్డాయి. నా పేరు విన్న వెంటనే కాన్వాస్ మీద అద్భుతాలు సృష్టించగలిగిన ఒక చిత్రకారిణి గుర్తుకురావాలి. సమాజం ఒక సాధారణ వ్యక్తిని సాధారణంగానే గుర్తిస్తుంది. ఒక నైపుణ్యమో, వైకల్యమో ఉన్నప్పుడు వ్యక్తిగా గుర్తించడానికంటే ముందు నైపుణ్యం, వైకల్యాలతోనే పరిగణనలోకి తీసుకుంటుంది. పోలియో బాధితురాలిగా ఐడెంటిఫై కావడం కంటే విజయలక్ష్మి అంటే చిత్రలేఖనం గుర్తుకు వచ్చేటంతగా రాణించాలనుకున్నాను. అందుకోసమే అహర్నిశలూ శ్రమించాను. నేను చూసిన దృశ్యాల నుంచి నా బొమ్మల పరిధిని విస్తరించాను. నేను చదివిన పుస్తకాల నుంచి ఇతివృత్తాలను రూపుదిద్దుకున్నాను.





అన్నింటికీ మించి రాజా రవివర్మ నుంచి స్ఫూర్తి పొందాను.


రవీంద్రభారతిలో పురస్కారాలు

చిత్రకారిణిగా గుర్తింపు రావడమే కాదు, పురస్కారాలను రవీంద్రభారతిలో అందుకోగలిగాను. రవీంద్రభారతిలో అందుకోవడం కూడా ఒక పురస్కారంగానే భావిస్తాను. 2019లో నా చిత్రాలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించే అవకాశం వచ్చింది. అలాగే హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ, సాలార్‌జంగ్ మ్యూజియంతోపాటు ఢిల్లీలోనూ ప్రదర్శితమయ్యాయి. మనలో ఆత్మవిశ్వాసం, అకుంఠిత దీక్ష, సంకల్పబలం ఉంటే భగవంతుడు అవకాశం ఇచ్చి తీరుతాడని నమ్ముతాను. ఓ సంస్థ నా అవసరాన్ని గుర్తించి డెబ్బై వేల విలువ చేసే ఎలక్ట్రానిక్ వీల్‌చైర్ విరాళంగా ఇచ్చింది. అది కూడా భగవంతుడు పంపినట్లే.

స్ఫూర్తిప్రదాతగా...

నేను రాజా రవివర్మ నుంచి స్ఫూర్తి పొందితే, నన్ను స్ఫూర్తిగా తీసుకుంటున్న కొత్తతరం ఉండడం నాకు సంతోషంగా ఉంది. నేను చదువుకున్న స్కూల్లో నా బొమ్మలను ప్రదర్శించినప్పుడు నాకా సంగతి తెలిసింది. జీవితాన్ని నిస్సారంగా గడిపేయకూడదు, స్ఫూర్తిమంతంగా ఉండాలని కోరుకుంటాను. సోషల్ మీడియాను నూటికి నూరు శాతం వినియోగించుకున్నాననే చెప్పాలి. సోషల్ మీడియా వేదికగానే ఇన్‌ఫ్లూయెన్సర్‌ని కాగలిగాను. తలసేమియా వ్యాధిగ్రస్థులకు రక్తం కోసం ఏడాదికి మూడుసార్లు బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నాను. మా ఊరి కుర్రాళ్లు 'ఏం చేయాలో చెప్పక్కా, మేము చేసి పెడతాం' అని ఉత్సాహంగా సహాయం చేస్తున్నారు. 'వీల్‌చైర్ నుంచి నేను ఇన్ని చేస్తుంటే హాయిగా నడవగలిగిన వాళ్లు ఎందుకు చేయలేరు. స్థిర చిత్తం ఉంటే ఏదైనా సాధ్యమే'నని వీడియోల్లో చెబుతుంటాను'' అని సంతోషంగా తన బొమ్మలలోకొన్ని వివరించింది విజయలక్ష్మి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



బుద్ధుడి వెనుక యువతి

విజయలక్ష్మి చిత్రలేఖనంలో ఉన్న అమ్మాయి అచ్చమైన తెలుగుదనంతో ఒత్తైన జడ వేసుకుని ఉంటుంది. ఆ జడను అలంకరించి పూలు కూడా అచ్చం పూలను పోలినట్లే తెల్లటి పువ్వులో పసుపువర్ణంలో పువ్వు మధ్య భాగం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఆ అమ్మాయి చెవి జూంకీలకున్న నగిషీలు కూడా. అలాగే మరో చిత్రలేఖనం ఇంకా అద్భుతం... మన దృష్టి అభయ ముద్రలో ఉన్న బుద్ధుడి మీద కేంద్రీకృతమవుతుంది. బుద్ధుని పాదాల వద్దనున్న కమలం మీద, బుద్ధుడి శిఖ, శిఖ వెనుకనున్న కాంతివలయాన్ని కూడా చూస్తాం. ఆ తర్వాత మన దృష్టికి వస్తుందో అద్భుతం. ఆ బుద్ధుడి బొమ్మ ఉన్నది కేవలం కాన్వాస్ మీద కాదు. ఒక యువతి వీపు మీద. అటువైపు తిరిగి కూర్చుని ఉన్న యువతిని చిత్రీకరించిన తర్వాత ఆమె వీపు మీద చూపరులకు అభిముఖంగా ఉన్న బుద్ధుడిని చిత్రించింది విజయలక్ష్మి.



మటన్ సుఖా

రంజాన్ స్పెషల్ రెసిపీ



కావలసినవి:
మటన్ – అర కేజీ; **నీళ్లు** – 750 ఎమ్ఎల్; **ఉల్లిపాయలు** – 2 (తరగాలి); **పచ్చి మిర్చి**– 1 (పొడవుగా చీరాలి); **టొమాటో** – 1 (తరగాలి); **మినప్పప్పు**– అర టీ స్పూన్; **దాల్చిన చెక్క** – అంగుళం ముక్క; **లవంగాలు** – 4; **యాలకులు** – 5; **నక్షత్ర లవంగం** – 1; **కరివేపాకు తరుగు** – గుప్పెడు; **మిరప్పొడి** – 2 టేబుల్ స్పూన్‌లు; **ధనియాల పొడి**– అర టేబుల్ స్పూన్; **జీలకర్ర పొడి**– అర టీ స్పూన్; **గరం మసాలా పొడి** – టీ స్పూన్; **పసుపు** – అర టీ స్పూన్; **ఉప్పు** – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **నెయ్యి** – 2 టేబుల్ స్పూన్‌లు; **మిరియాల పొడి**– చిటికెడు.
మారినేషన్ కోసం: వెల్లుల్లి రేకలు – 5 (పొట్టు వలిచినవి); **ఉల్లిపాయలు** – 100 గ్రాములు; **అల్లం**– 2 అంగుళాల ముక్క; **పచ్చి మిర్చి**– 2; **సోంపు** – టీ స్పూన్; **నీరు** – అర కప్పు.

తయారీ:
- మటన్‌ను శుభ్రం (నీటితో కడిగిన తర్వాత పసుపు, ఉప్పు వేసి పది నిమిషాల తర్వాత మళ్లీ కడగాలి) చేయాలి.
- మారినేషన్ కోసం తీసుకున్న పదార్థాలన్నింటినీ కలిపి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని మటన్ ముక్కలకు పట్టించి గంట నుంచి ఒకటిన్నర గంట సేపు నాననివ్వాలి.
- మందపాటి పాత్రలో నీటిని వేడి చేసి అందులో మారినేట్ చేసిన మటన్ ముక్కలను వేసి ఉడికించాలి. ముక్కలు ఒక మోస్తరుగా ఉడికిన తరవాత మిరప్పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా పొడి, ఉప్పు వేసి కలపాలి. పూర్తిగా ఉడికిన తర్వాత (ముక్క మెత్తబడేటప్పటికి నీరు కూడా ఆవిరై పోతుంది. నీరు తగ్గిపోయినప్పటికీ ముక్క ఉడకకపోతే మరి కొంత నీటిని పోసి ఉడికించాలి) స్టవ్ మీద నుంచి దించి పక్కన పెట్టాలి.
- మందపాటి పెనంలో నెయ్యి వేడి చేసి మినప్పప్పు వేసి సన్న మంట మీద బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి. అవి వేగిన తర్వాత దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, నక్షత్ర లవంగం వేయాలి. అవి వేగిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి ఎర్రగా వేగిన తరవాత పచ్చిమిర్చి, టొమాటో ముక్కలు, కరివేపాకు తరుగు వేసి రెండు నిమిషాల పాటు మగ్గనివ్వాలి. ఇప్పుడు ఉడికించి పక్కన ఉంచిన మటన్ వేసి ముక్కలకు మసాలా పట్టేలా కలిపి మీడియం మంట మీద ఉడికించాలి. ఒకసారి రుచి చూసుకుని ఘాటుగా కావాలంటే మరికొంత, మిరియాల పొడి కలుపుకోవచ్చు. ఐదు నిమిషాల్లో కర్రీలో నీరు తగ్గుతూ నూనె పైకి తేలుతుంది. స్టవ్ ఆపేసి రుచి అమరేవరకు (రెండు నిమిషాలు) స్టవ్ మీద ఉంచాలి. ఇది రోటీలోకి అన్నంలోకి కూడా రుచిగా ఉంటుంది.

ఇంటిప్



తేనె కొంతకాలం వాడకుండా ఉంచేస్తే సీసా అడుగున గడ్డకట్టుకుపోతుంటుంది. అలాంటప్పుడు తేనెను కరిగించడానికి ఓ అరగంట పాటు తేనె సీసాను ఎండలో ఉంచాలి. తేనెను ఎప్పుడూ నేరుగా వేడి చేయరాదు. ఎండ లేకుండా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఒక పాత్రలో నీటిని వేడి చేసి అందులో తేనె సీసాను ఉంచాలి. నీటి వేడితో ఐదు – పది నిమిషాల్లో తేనె కరుగుతుంది.

● ఇన్‌స్పిరేషన్

మెక్‌డొనాల్డ్, కెఎఫ్‌సి వాటి గొప్ప వాటిదే కావచ్చు. కాని మన వడ పావ్‌కు ఏం తక్కువ అనుకున్నాడు ధీరజ్ గుప్తా. వడ పావ్‌ను బ్రాండ్‌గా చేసి ముంబైలో అతడు మొదలెట్టిన వ్యాపారం దేశీయ వంటల అధునిక రూపం సంపాదించే కోట్లకు సాక్ష్యంగా నిలిచింది.

ఇంచుమించు దానికి సరిసాటి



మన దగ్గర పునుగులు కామన్. కాని వాటిని ఒక బ్రాండ్ చేసి, రుచిని ఖాయం చేసి, శుచిగా మంచి ఔట్‌లెట్స్ ద్వారా అందించాలన్న ఆలోచన ఎవరికైనా వచ్చిందా?

మహరాష్ట్రలో వడ పావ్ కామన్. ప్రతి పది ఫర్లాంగుల దూరంలో ఎవరో ఒకరు వడ పావ్ అమ్ముతుంటారు. కాని ఆ వడ పావ్‌ను బ్రాండ్ కిందకు తెచ్చి, మంచి రుచితో అంటే మారని రుచితో చేసి, చాలా శుచిగా, ఆకర్షణీయమైన దుకాణాల ద్వారా అమ్మితే ఎలా ఉంటుందన్న ఆలోచన ధీరజ్ గుప్తాకు వచ్చింది. ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుందంటారు. అదే జరిగింది.

చేదు జ్ఞాపకాల నుంచి

ముంబైకి చెందిన ధీరజ్ గుప్తా 1998లో ఎంబిఏ చేశాడు. అప్పటికి రెండేళ్ల ముందు మెక్‌డొనాల్డ్, డోమినోస్ మన దేశంలోకి వచ్చి పిజ్జాలు, బర్గర్‌లు తెగ అమ్మడం మొదలెట్టాయి. అయితే వాటి సంగతి మనకు తెలియదు కదా అని స్వీట్ల వ్యాపారం మొదలెట్టాడు ధీరజ్ గుప్తా. మూడు నాలుగేళ్లలో 50 లక్షల నష్టం వచ్చింది. మొత్తం చేదు జ్ఞాపకాలే. కాని ఎలా బతకాలి? ఎలా ఎదగాలి? మరోసారి పిజ్జాలు, బర్గర్‌లు గుర్తొచ్చాయి. అందరూ తెగ తింటున్నారు. అలాగే ముంబైలో రోజుకు 20 లక్షల ప్లేట్ల వడ పావ్‌లు అమ్ముడుపోతాయి. కాని అవన్నీ అంత శుభ్రమైన వాతావరణంలో అమ్మరు. వడ పావ్‌ను అలా బ్రాండ్ చేసి ఎందుకు అమ్మకూడదు అనుకున్నాడు ధీరజ్. సరైన రుచితో, శుచిగా చేస్తే రేటు ఎక్కువైనా 20 లక్షల ప్లేట్లలో పది శాతమైనా తన దగ్గర పోవా అని ఆలోచించాడు. తండ్రి దగ్గర 2 లక్షలు అప్పు తీసుకున్నాడు. ముంబైలోని మలాడ్ రైల్వేస్టేషన్ ఎదురుగా 200 చదరపు అడుగుల దుకాణం తీసుకున్నాడు. 2001లో అతని ప్రయాణం మొదలెట్టాడు.

జంబోకింగ్

జంబో కింగ్ పేరుతో 2001 ఆగస్టులో అతడు దుకాణం తెరిచి మామూలుగా అమ్మే సైజు కంటే 20 శాతం సైజు పెంచి వడపావ్ అమ్మితే రేటు ఎక్కువైనా ఆ హైజీన్‌కి, రుచికి అందరూ ఎగబడ్డారు. మొదటి సంవత్సరంలోనే ఆ ఒక్క షాపు మీద అతనికి 40 లక్షల ఆదాయం వచ్చింది. జంబో కింగ్ సూపర్ హిట్. ఎటువంటి పరిస్థితుల్లో రుచిలో రాజీ పడకుండా చేయడం వల్లే ఇది సాధ్యమైంది. అయితే తాను సొంతగా షాపులు తెరుచుకుంటూ పోతే అజమాయిషీ కష్టం అని భావించాడు ధీరజ్. అతను పుస్తకాలు బాగా చదువుతాడు. ఫ్రాంచైజీల ద్వారా వ్యాపారాన్ని విస్తరణ చేయడం గురించి ఉన్న పుస్తకాలన్నీ చదివాడు. ఏ పద్ధతిలో ఫ్రాంచైజీలు ఇచ్చి, సరుకు రుచిని ఎలా కాపాడుకుంటూ వస్తే వ్యాపారం నిలబడుతుందో



ధీరజ్ గుప్తా

అంచనా వేసుకున్నాడు. ముడి పదార్థాల సప్లై చైన్, కచ్చితమైన రుచితో చేసేలా స్టాఫ్‌కు శిక్షణ... ఇవి తన చేతుల్లో ఉంటే తన పేరు మీద దుకాణం తెరిచి మిగిలిన కష్టం చేయడానికి వచ్చే వారు చాలా మంది ఉంటారు. అలా జంబో కింగ్‌ల ఫ్రాంచైజీలు మొదలయ్యాయి.

ఏటిఎం లాగా

'జనానికి ఏటిఎం కనిపించినంత దగ్గరగా నా వడ పావ్ స్టోర్ కనిపించాలి' అంటాడు ధీరజ్. ఇప్పటికే అతను 13 ముఖ్య నగరాల్లో స్టోర్‌లను విస్తరించాడు. కేవలం ముంబై, ఢిల్లీ, హైదరాబాద్‌లలోనే 150 జంబో కింగ్ స్టోర్లు ఉన్నాయి. వడ పావ్‌లతో పాటు 2017 నుంచి బర్గర్లు కూడా అమ్ముతూ దూసుకుపోతున్నాడు ధీరజ్. 15 లక్షల ఖర్చుతో ఎవరైనా సరే ఫ్రాంచైజీ తీసుకోవచ్చు. 5 సంవత్సరాల్లో పెట్టుబడి వచ్చేస్తుందంటాడు ధీరజ్.

ఒక దేశీయ అల్పాహారం ఒక మనిషిని ఎంత దూరం తీసుకెళుతుందో ఈ జంబో కింగ్ కథ చెబుతోంది. అతనికి వడ పావ్ ఉంటే మనకు ఇంకా చాలా ఉన్నాయి. ట్రై చేసేవారిదే అదృష్టం.

బ్యూటిప్



గోధుమ పిండిలో తాజా మీగడను కలుపుకుని ఆ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు పట్టించుకోవాలి. నలుగు పెట్టుకున్నట్టుగా చేతితో మిశ్రమాన్ని తొలగించాలి.ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా తయారవుతుంది. దీనిలో గంధం పొడి ఉపయోగిస్తే ఇంకా మంచి ఫలితం ఉంటుంది.

ఫిట్‌నెస్‌కి వయసు అడ్డంకి కాదు...



నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అంటోంది పుణే వాసి తరు మాటేటి. యాభై ఆరేళ్ల వయసులో భర్తతో కలిసి దక్షిణాఫ్రికా పర్వతాలలో జరిగిన కామ్రేడ్స్ మారథాన్‌లో పాల్గొని రికార్డు సృష్టించిన రెండవ భారతీయ జంటగా వార్తల్లో నిలిచారు. వందకు పైగా మారథాన్‌లలో పాల్గొన్న ఈ రన్నర్ మూడు అల్ట్రా మారథాన్‌లను నిర్వహించింది. స్వీయ శిక్షణ, కృషితో సాధించిన విజయాలు ఆమె మాటల్లోనే..

''పదేళ్లుగా జాతీయ అంతర్జాతీయ మారథాన్‌లలో పాల్గొంటున్నాను. 49వ ఏట పరుగు ప్రారంభించాను. ఆరేళ్ల తర్వాత నుంచి వందకు పైగా రేసుల్లో పరిగెత్తాను. ప్రభుత్వోద్యోగి కూతురిగా, ఆర్మీ అధికారి భార్యగా నాకు తెలిసిన ఒకే ఒక్క విషయం –' నెక్ట్స్ ఏంటి?' అనే ప్రశ్న. ఆ వెంటనే చేయాల్సిన పని పైన దృష్టి పెట్టడం. ఇదే నా విజయం.



తరు మాటేటి

ఉద్యోగాల మార్పు

ముప్పై ఏళ్ల క్రితం ఆర్మీ అధికారితో పెళ్లయ్యాక కొత్త ప్రదేశంలో నా సొంత జీవితాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని గ్రహించాను. మా వారికి అనుగుణంగా నేను ప్రతతిసారీ ఉద్యోగాలు మార్చుకోవాల్సి వచ్చేది. సాధారణంగా ఆ రోజుల్లో స్త్రీ కోరుకునే ఏకైక ఉద్యోగం టీచర్ పోస్ట్. నేను ఇంజనీర్‌ని అయినప్పటికీ నా కుటుంబాన్ని ఒకేచోట ఉంచాలనే కోరికతో చాలా సంతోషంగా టీచర్ ఉద్యోగంలో చేరాను. కొత్త ఉద్యోగం ఎంచుకున్న ప్రతిసారి ఎంతో కష్టపడి పనిచేశాను. అందుకు తగిన ప్రతిఫలాన్ని పొందాను. టీచర్‌గా చేయడం వల్ల ఐటీ జాబ్‌లో ప్రత్యేక స్థానం లభించింది.

రోజూ వ్యాయామాలు

ఇండోర్ స్పోర్ట్స్‌లో బ్యాడ్మింటన్, ఏరోబిక్స్‌ని బాగా ఇష్టపడ్డాను. నా ఉద్యోగంతో పాటు వీటినీ బ్యాలెన్స్ చేశాను. దీంతో అదీ మొదటి ప్రాధాన్యతగా మిగిలిపోయింది. రన్నింగ్‌ను నేను ఎంచుకోలేదు. రన్నింగ్ నన్ను ఎన్నుకుంది. పూణేలో 10కె రన్‌లో పాల్గొనడానికి ఒకరోజు పరుగు కోసం బయటకు వెళ్లాను. నా ఏరోబిక్స్ స్టామినా వల్ల ఫస్ట్‌టైమ్ టెన్ కె రన్ పూర్తి చేశాను. ఔట్‌డోర్‌లో చేసిన మొదటి ప్రాక్టీస్‌కు మంచి గుర్తింపు లభించింది. మనదైన సొంత మార్గంలో ఒక స్వేచ్ఛ ఉంటుంది. రన్నింగ్ షూస్ ధరించినప్పుడు నాకు నేను వేరే వ్యక్తిగా అనిపిస్తాను. చాలా ఆనందంగా అనిపించింది. అంతే, ఇక అక్కణ్ణుంచి పరుగు ఆపలేదు. ఉద్యోగంలో ఉంటూనే మూడు అల్ట్రా మారథాన్‌లు నడిపాను. ఫిట్‌నెస్‌కు సంబంధం లేకుండా మారథాన్లలో పాల్గొన్నాను. అయితే, ఆరోగ్యం గురించి మరింత శ్రద్ధ తీసుకున్నాను. శారీరకంగా మెరుగ్గా ఉండటానికి యోగా శిక్షణ తీసుకున్నాను. అయినప్పటికీ ఒక ప్రమాదంలో గాయపడ్డాను. కోలుకోవడానికి ఆరు నెలల సమయం పట్టింది.

దుస్తుల అడ్డంకులు

సంప్రదాయ కుటుంబం కావడంతో మొదట షార్ట్స్, స్కర్ట్స్, రేసర్ బ్యాక్‌లు ధరించడానికి కొద్దిగా జంకు ఉండేది. కానీ, పరుగు మొదలయ్యాక సంకోచాలను పక్కన పెట్టేశాను. కుటుంబం నుంచి వ్యతిరేకత కూడా ఏమీ రాలేదు. రన్నింగ్‌లో ఏర్పడిన అడ్డంకులన్నీ ఒక్కొక్కటీ తొలగిపోయాయి. ప్రతి పరుగు కొత్తదనాన్ని నేర్పించింది. ఇతర మహిళల పట్ల నా సొంత దృక్పథాన్ని మార్చుకోవడం కూడా నేర్చుకున్నాను.




భర్త చందన్ మాటేటితో తరు మాటేటి

కష్టమైనా ఇష్టంగా..

అత్యంత కష్టమైనది సౌత్ ఆఫ్రికాలో జరిగిన కామ్రేడ్స్ మారథాన్. ఒక సంవత్సరంలో 87 కి.మీ 'అప్ రన్' మరుసటి ఏడాది 90 కిలోమీటర్ల 'డౌన్ రన్' ఉంది. ఒక పరుగును 12 గంటల్లో పూర్తి చేయాలి. నేను, నా భర్త ఈ రన్‌లో భారతదేశం నుంచి పాల్గొన్న రెండవ జంట. పదకొండు గంటలలోపే రన్ పూర్తి చేశాం. మా ఇద్దరికీ పతకాలు రావడంతో ఆనందంతో గెంతులేశాం. 2014లో బెంగళూరు ఫుల్ మారథాన్‌లో పరుగులు తీశాను. హైదరాబాద్ మారథాన్‌ను నడిపాను. బెంగుళూరు రన్ సమయంలో గాయపడ్డాను. ఇక రుతుక్రమ సమయంలో అయితే అకస్మాత్తుగా శరీరంలో వేడి సెగలు మొదలయ్యేవి. మూడ్ స్వింగ్స్ కూడా మారుతుండేవి. కానీ, నా దృష్టి కేవలం మారథాన్‌పైనే ఉండేది. ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. మన అభిరుచులకు తగిన విధంగా అన్ని పరిస్థితులు ఉండవు. అందుకు కృషితో పాటు ఓపిక కూడా ఉండాలి'' అని వివరిస్తుంది తరు మాటేటి.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 210
శనివారం 15-4-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'


బ్రూక్ బంగారం..
సెంచరీ సాధించిన హ్యారీ బ్రూక్.. కోల్‌కతాపై సన్‌రైజర్స్ గెలుపు - 11లో


యథాతథంగానే డిజిన్వెస్ట్‌మెంట్
విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ స్పష్టీకరణ - 6లో


కేజ్రీవాల్‌కు సీబీఐ సమన్లు
మద్యం స్కామ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సీబీఐ సమన్లు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు హాజరవ్వాలని ఆదేశించింది.
వివరాలు 6లో ▸


ఈశాన్యంలో 'వైద్యం' బలోపేతం
ఈశాన్య భారత్‌లో ఏర్పాటు చేసిన మొట్ట మొదటి ఎయిమ్స్‌ను అస్సాం రాజధాని గువాహటిలో ప్రధాని మోదీ ప్రారంభించారు.
వివరాలు 6లో ▸


ఘన ఇంధన 'బాలిస్టిక్' పరీక్షించాం
మొదటిసారిగా ఘన ఇంధనాన్ని వినియోగించి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించినట్లు ఉత్తరకొరియా ప్రకటించింది.
వివరాలు 6లో ▸


పదేళ్లలో మరో వైరస్!
పదేళ్లలో కోవిడ్ లాంటి మరో మహమ్మారి పంజా విసిరే అవకాశముందని లండన్‌కు చెందిన 'ఎయిర్‌ఫినిటీ' తెలిపింది.
వివరాలు 6లో ▸

చిట్టి తల్లులకు 'స్వేచ్ఛ'..

విద్యార్థినుల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంలో ఏపీ.. దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 2021-22లో 1.16 కోట్ల శానిటరీ న్యాప్‌కిన్లను ఉచితంగా పంపిణీ చేసింది. బహిష్టు సమయంలో పరిశుభ్రత కార్యక్రమాల అమలులో ఏపీ రెండో స్థానంలో నిలిచిందని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. స్వేచ్ఛ కార్యక్రమం కింద 10 లక్షల మంది విద్యార్థినులకు ప్రతి నెలా 10 చొప్పున శానిటరీ న్యాప్‌కిన్లను జగన్ సర్కార్ ఉచితంగా అందజేస్తోంది.
5లో

ఉత్తరాంధ్రకు వెలుగు రేఖ




శ్రీకాకుళం జిల్లాలో పోర్టు నిర్మాణంతో మారనున్న ముఖచిత్రం
ఐదు రాష్ట్రాల ఎగుమతులు, దిగుమతులకు కేంద్రం

- రాష్ట్రంతో పాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, దక్షిణ ఒడిశాలకు కీలకం
- బొగ్గు, ఎరువులు, సున్నపురాయి, వంటనూనె, ముడి జీడిగింజల దిగుమతికి అవకాశాలు
- ముడి ఇనుము, సిలికా, సోయా మీల్, గ్రానైట్, జూట్, స్టీల్ ఎగుమతులకు మార్గం
- తొలి దశలో రూ.4,361.91 కోట్లతో నాలుగు బెర్తుల నిర్మాణం.. పూర్తి సామర్థ్యం 83.3 మిలియన్ టన్నులు
- తొలి దశలో అందుబాటులోకి 23.5 మిలియన్ టన్నులు
- 19న సీఎం జగన్ చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి, అమరావతి/సంతబొమ్మాళి/ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లా భావనపాడు వద్ద పోర్టు నిర్మాణంతో ఉత్తరాంధ్ర రూపు రేఖలు త్వరలో మారిపోనున్నాయి. సుదీర్ఘ కాలంగా ఉన్న ఈ ప్రాంత వాసుల కల త్వరలో సాకారం కానుంది. రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్నప్పటికీ, అత్యంత కీలకమైన చోట ఈ పోర్టు ఉంది. కేవలం మన రాష్ట్రం నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌తో పాటు దక్షిణ ఒడిశా రాష్ట్రాల నుంచి ఎగుమతులు, దిగుమతులకు ఈ పోర్టు అత్యంత కీలకం కానుంది. సుమారు రూ.16,000 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే, భావనపాడు పోర్టుల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు భావనపాడుకే ఉన్నాయని మారిటైమ్ వర్గాలు పేర్కొంటున్నాయి. పలు కీలక పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకులు.. థర్మల్ కోల్, కుకింగ్ కోల్, ఎరువులు, ముడి జీడి గింజలు, సున్నపురాయి, వంటనూనెల దిగుమతికి ఈ పోర్టు కేంద్రం కానుంది. ఇక్కడ నుంచి మినరల్ శాండ్, ముడి ఇనుము, జీడి పప్పు, సోయా మీల్, గ్రానైట్..

మిగతా 2వ పేజీలో ▶

రూ.35 కోట్లతో ఆర్ అండ్ ఆర్ కాలనీ
2లో
వలసల నివారణే ప్రభుత్వ ధ్యేయం


పోర్టును ఏర్పాటు చేయనున్న ప్రాంతం

కాంస్యంతో ముగింపు

ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన అనిరుధ్‌కుమార్
- వివరాలు 11లో

కప్పిపుచ్చడమే.. అసలైన కుట్ర!

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం వెనుక దాగిన నిజాల్ని కప్పిపుచ్చే పన్నాగం



- హత్యాయత్నం వెనుక కుట్ర కోణం ఉందని గత చార్జిషీట్‌లో పేర్కొన్న ఎన్ఐఏ
- దర్యాప్తు పూర్తి చేసి తుది చార్జిషీట్ వేయాల్సి ఉన్నా.. అంతులేని జాప్యం
- కుట్ర కోణాన్ని విచారించి, తుది చార్జిషీట్ వేయాలంటూ జగన్ పిటిషన్
- దానిపై ఎన్ఐఏను కోర్టు ఆదేశించటంతో.. తాజాగా కౌంటర్ వేసిన ఎన్ఐఏ
- ఎన్ఐఏ పేర్కొన్న అంశాలపై త్వరలో కౌంటర్ వేయనున్న వైఎస్ జగన్
- దీనికోసం ఈ నెల 17 వరకూ కేసును వాయిదా వేసిన న్యాయస్థానం

ఏది నిజం?

- వీటన్నిటినీ వదిలి... కుట్ర కోణం లేదని తేల్చేసినట్లు 'ఈనాడు' హడావుడి
- విమానాశ్రయంలో ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంటే ఈ కుట్రకు కేంద్ర బిందువు
- దాని యజమాని హర్షవర్ధన్ చౌదరి టీడీపీ నేత, టికెట్ ఆశించారు కూడా..
- శ్రీనివాసరావుకు ఎలాంటి నేరచరిత్రా లేదంటూ డిక్లరేషన్ ఇచ్చిన హర్ష
- తనపై అప్పటికే స్వగ్రామంలో కేసులు; చార్జిషీట్ కూడా దాఖలు

4లో



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు సీఎం జగన్ నివాళి
2లో
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రులు, నాయకులు

అత్తారిల్లు.. బస్సులో నిద్ర!

42 ఏళ్ల తర్వాత అత్తారింటికి నిమ్మకూరు వచ్చిన చంద్రబాబు బస్సులో నిద్రించాల్సిన దుస్థితి వచ్చింది. ఆయన నిద్రపోవడానికి కనీసం ఎవరూ ఇల్లు కూడా ఇవ్వలేదు. ఇది ఆయన పరపతి. ఇన్నేళ్లలో చంద్రబాబు నిమ్మకూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని కూడా పెట్టలేదు. ఆయన నిమ్మకూరు వచ్చి శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తానంటే ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుంది. ఖాళీ కుర్చీలకు చంద్రబాబు సొల్లు కబుర్లు చెబుతున్నారు.
– మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

5లో



పథకాల అమలు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

- అన్ని జిల్లాలకు నియమిస్తూ సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు
- నెలలో రెండు సార్లు జిల్లాలను సందర్శించి.. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ఆదేశం

- వివరాలు 3లో

సామాజిక సంస్కర్త అంబేద్కర్

గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న గవర్నర్

సాక్షి, అమరావతి: సమానత్వ సాధన, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషిచేసిన దార్శనికుడు బీఆర్ అంబేద్కర్ అని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కొనియాడారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో శుక్రవారం ఆయన చిత్రపటానికి గవర్నర్ దంపతులు ఎస్. అబ్దుల్ నజీర్, సమీరా నజీర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. అంటరానితనం, సామాజిక రుగ్మతలు, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా అంబేద్కర్ పోరాటం అందరికీ ఆదర్శనీయమన్నారు. రాజ్యాంగ నిర్మాతగా ఆయన చేసిన సేవలే దేశ అభివృద్ధికి బాటలు వేశాయన్నారు.

అంబేద్కర్‌కు సీఎం జగన్ నివాళి

సాక్షి, అమరావతి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నివాళులు అర్పించారు. తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పినిపే విశ్వరూప్, ఆదిమూలపు సురేష్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్ పాల్గొన్నారు. మరోవైపు.. దేశం గర్వించదగ్గ మేధావుల్లో అగ్రగణ్యుడు, మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియడారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలని.. న్యాయ, సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక, తదితర రంగాల్లో అపార జ్ఞానశీలి అంటూ శుక్రవారం ట్వీట్ చేశారు. 'దేశ రాజకీయ, ప్రజాస్వామ్య, సాంఘిక వ్యవస్థలకు దిక్సూచి. వాటికి గట్టి పునాదులు వేసిన రాజ్యాంగ నిర్మాత. భేదభావాలు మరిచేలా మానవత్వం పరిఢవిల్లేలా ఆయన చేసిన కృషి మరువలేం. ఆ మహనీయుడి బాటలో నడుస్తూ పేదరిక నిర్మూలనలో, సామాజిక న్యాయ సాధికారతలో చారిత్రక అడుగులు ముందుకేశాం. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు'.. అంటూ సీఎం జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

అంబేద్కర్ విశ్వమానవ మూర్తి

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి


వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులర్పించి ప్రసంగిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున. పక్కన నేతలు

సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పలువురు మంత్రులు, పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. నాడు తీవ్ర కుల వివక్షను ఎదుర్కొని నిలిచిన బాబాసాహెబ్ అంబేద్కర్.. అప్పటి సమాజంలోని అస్పృశ్యత, అంటరానితనాన్ని రూపుమాపేందుకు అవిరళ కృషిచేశారని కొనియాడారు. విశ్వమానవ మూర్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. మన దేశం సమైక్యంగా ముందుకు సాగడంలో నాడు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రధాన కారణమన్నారు. అంతటి మహనీయుడి ఆశయాలు విరాజిల్లాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారని.. ఆయన బాటలో నడుస్తూ.. ఆ మహనీయుని ఆశయాలు నిలబెడుతున్నారని చెప్పారు. కానీ, చంద్రబాబు నిత్యం రాజ్యాంగం అపహాస్యం పాలయ్యేలా, దళితులు, అణగారిన వర్గాల వారు అవమానాలకు గురయ్యేలా వ్యవహరించారని గుర్తుచేశారు. నారా లోకేశ్ కూడా తండ్రి మాదిరిగానే వ్యవహరిస్తున్నారని.. ఈరోజు అంబేద్కర్ జయంతి అని తెలిసి కూడా 'దళితులు ఏం పీకుతారు?' అని వ్యాఖ్యానించి తన కండకావరాన్ని ప్రదర్శించారన్నారు. మున్సిపల్‌శాఖ మంత్రి సురేష్ మాట్లాడుతూ.. దళితులకు సమాన హక్కులు, సాధికారతకు సీఎం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని.. అంబేద్కర్ ఆశయాలను తూచ తప్పకుండా పాటిస్తోంది వైఎస్సార్‌సీపీయేనన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. భారతీయులంతా గర్వించతగిన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత పెరికె వరప్రసాద్ రచించిన పుస్తకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ఆస్తి బీఆర్ అంబేద్కర్

టీడీపీ అధినేత చంద్రబాబు


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న చంద్రబాబు


సాక్షి, అమరావతి/గుడివాడరూరల్: మహానుభావుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఒక వర్గానికి, ప్రాంతానికి పరిమితం కాదని, ఆయన భారత దేశ ఆస్తి అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలో శుక్రవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చంద్రబాబు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని నిజంగా అమలు చేయడమంటే సమాజంలో ఆర్థిక అసమానతలు లేకుండా చేయడమేనన్నారు. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ చైర్మన్ అయిన తర్వాతే అంబేద్కర్‌కు భారతరత్న పురస్కారం ఇప్పించారని చెప్పారు.

అంబేద్కర్ ఆశయ సాధన కోసమే టీడీపీ స్థాపన: అచ్చెన్నాయుడు

ఎన్టీఆర్ వల్లే బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్‌కు భారతరత్న పురస్కారం వచ్చిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు చెప్పారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం అంబేద్కర్ 132వ జయంతిని నిర్వహించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధన కోసమే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని చెప్పారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాదని, సీఎం జగన్ తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నేతలు నక్కా ఆనంద్‌బాబు, కె.జవహర్, వంగలపూడి అనిత, పిల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

వివక్షలేని సమాజమే అంబేద్కర్ ఆశయం

ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఎండీ

సాక్షి, అమరావతి: దేశ పౌరులను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేయడమే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు మనం అర్పించే నిజమైన నివాళి అని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివక్షలేని సమాజం, సమసమానత్వం అందించేందుకు అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు ఎ.కోటేశ్వరరావు, పి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ బీమా పథకం

'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'

- 'ఇన్నోవేషన్ కేటగిరి'లో ఏపీకి ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని అందించిన కేంద్రం
- ఈ – క్రాప్ ప్రామాణికంగా యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం
- నోటిఫైడ్ పంటలకు 100 శాతం బీమా.. పంటల బీమాలో అంకిత భావం
- ఏపీ స్ఫూర్తితో జాతీయ స్థాయిలో ఫసల్ బీమాలో మార్పులు చేసినట్లు వెల్లడి


ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ అహుజా నుంచి అందుకుంటున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని దేశంలోనే అత్యుత్తమ పంటల బీమా పథకంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ – క్రాప్ ప్రామాణికంగా యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రకటించింది. రైతులపై పైసా కూడా భారం పడకుండా నోటిఫైడ్ పంటలకు 100 శాతం బీమా కల్పిస్తున్న రాష్ట్రమని ఏపీపై ప్రశంసలు కురిపించింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)పై చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో గురువారం ప్రారంభమైన జాతీయ స్థాయి వర్కుషాపులో 'ఇన్నోవేషన్ కేటగిరి' కింద ఉత్తమ బీమా పథకంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ఎంపిక చేశారు. ఈమేరకు కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా చేతుల మీదుగా రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

44 నెలల్లో రూ.6,684.84 కోట్ల పరిహారం..

నోటిఫై చేసిన పంటలకు సంబంధించి సాగు చేసిన ప్రతి ఎకరాకూ ఈ- క్రాప్, ఈ -కేవైసీ ప్రామాణికంగా ఖరీఫ్ 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో గరిష్టంగా 25.86 లక్షల హెక్టార్లలో పంటలకు బీమా కవరేజ్ కల్పించగా ప్రస్తుతం ఏకంగా 60 లక్షల హెక్టార్లలో కవరేజ్ వర్తింపచేశారు. 2018–19 సీజన్‌లో గరిష్టంగా రూ.1263 కోట్ల పరిహారం చెల్లించగా ఖరీఫ్ 2021 సీజన్‌కు సంబంధించి రికార్డు స్థాయిలో రూ.2,977.82 కోట్ల పరిహారం అందించారు. 44 నెలల్లో 44.28 లక్షల మంది రైతులు రూ.6,684.84 కోట్ల పరిహారాన్ని అందుకున్నారు. ఈ – క్రాప్ ప్రామాణికంగా యూనివర్సల్ కవరేజ్ కల్పించేందుకు కేంద్రం ముందుకు రావడంతో 2022–23 సీజన్ నుంచి పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఖరీఫ్ 2022 సీజన్‌కు సంబంధించి ఇప్పటికే నూరు శాతం ఈ – క్రాప్‌తో పాటు 97 శాతం ఈ – కేవైసీతో రికార్డు సృష్టించారు.

ఏపీ స్ఫూర్తితో మార్పులు: అహూజా

ఆంధ్రప్రదేశ్‌ను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో పలు మార్పులు చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా వెల్లడించారు. పంటల బీమా అమలులో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వర్కుషాప్‌లో ఆయన ప్రశంసించారు. రైతులపై పైసా భారం పడకుండా మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించడం నిజంగా గొప్ప ఆలోచనన్నారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారని ప్రశంసించారు. ఏపీ ప్రభుత్వం సాధించిన విజయాన్ని కేంద్రం గుర్తించిందన్నారు. ఏపీ తరహాలోనే సీజన్ ముగియకుండానే బీమా పరిహారాన్ని అర్హత కలిగిన రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసేలా కసరత్తు జరుగుతోందన్నారు. పంటల బీమా పథకంతో పాటు రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అంకితభావాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. వర్కుషాప్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు వెలుగు రేఖ

▶ మొదటి పేజీ తరువాయి

ఫెర్రో ఉత్పత్తులు, జూట్, ఐరన్ అండ్ స్టీల్ ఉత్పత్తుల ఎగుమతికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇంతటి కీలకమైన భావనపాడు పోర్టు పనులకు ఏప్రిల్ 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేయడం ద్వారా ప్రారంభించనున్నారు.

తొలి దశలో నాలుగు బెర్తులు

తొలి దశలో భావనపాడు పోర్టును నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4,361.91 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ పోర్టు నిర్మాణ పనులను రూ.2,949.70 కోట్లతో కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. నాలుగు బెర్తుల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనతో తొలి దశ ఉంటుంది. మొత్తం పోర్టు వార్షిక సామర్థ్యం 83.3 మిలియన్ టన్నులు కాగా, తొలి దశలో నాలుగు బెర్తులతో 23.5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో పోర్టును అభివృద్ధి చేయనున్నారు. నాలుగు బెర్తుల్లో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గు, ఇంకొకటి కంటైనర్‌తోపాటు ఇతర ఎగుమతి, దిగుమతులకు వినియోగించనున్నారు. ఈ పోర్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం భావనపాడు పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేకంగా కంపెనీ ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణ రూపంలో సమీకరించుకుంటున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 25,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. దీంతో పాటు చుట్టుపక్కల ప్రాంతం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతుంది.

వలసల నివారణే ప్రభుత్వ ధ్యేయం: సీదిరి



మత్స్యకారుల వలసల నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పశు సంవర్థక, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. రూ.365 కోట్లతో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెం తీరంలో నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్ జిల్లా పర్యటనలో ఈ ప్రాజెక్టును వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం నెరవేర్చారని చెప్పారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల సముద్ర తీరం ఉన్నా, హార్బర్లు లేక మత్స్యకారులు వలస వెళ్లే పరిస్థితిని సీఎం పూర్తిగా మార్చేస్తున్నారన్నారు. విశాఖపట్నం, కాకినాడ వంటి ప్రాంతాలకు సమానంగా భవిష్యత్‌లో ఇక్కడ తీరం అభివృద్ధి చెందుతుందన్నారు. నెల్లూరులో హార్బర్ నిర్మాణం చివరి దశలో ఉందని, బాపట్ల, మచిలీపట్నం, రామాయపట్నం వంటి ప్రాంతాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. అనకాపల్లి వద్ద మరో హార్బర్ నిర్మాణంతో పాటు మంచినీళ్లపేట వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను హార్బర్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం పరిపాలన రాజధాని అయితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. మే 3న భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌లో పూర్తి స్థాయి ప్రగతి సాధిస్తుందని అన్నారు. పవన్ కల్యాణ్ వంటి వారు అప్పుడప్పుడూ కనిపిస్తూ మత్స్యకారుల కోసం మాట్లాడుతుంటారని, అలాంటి పార్ట్‌టైమ్ నాయకులను నమ్మే పరిస్థితి లేదన్నారు.


శంకుస్థాపన చేయనున్న ప్రదేశంలో చదును చేస్తున్న దృశ్యం

భావనపాడు పోర్టు విశేషాలు

అంశం	సామర్థ్యం
తొలి దశ పోర్టు	23.5 ఎంటీపీఏ
తుది దశ పోర్టు	83.3 ఎంటీపీఏ
తొలి దశలో బెర్తుల సంఖ్య	4
నౌక పరిమాణం	1,20,00 డీడబ్ల్యూటీ
అవసరమైన భూమి	1,254.72 ఎకరాలు
దక్షిణ బ్రేక్ వాటర్	2,455 మీటర్లు
ఉత్తర బ్రేక్ వాటర్	580 మీటర్లు
తీరం రక్షణ	1,000 మీటర్లు
డ్రెడ్జింగ్	15.85 మిలియన్ క్యూబిక్ మీటర్లు
అప్రోచ్ చానల్	3.3 కి.మీ
రహదారి	ఎన్‌హెచ్16ను అనుసంధానం చేస్తూ 13.8 కి.మీ నాలుగు లైన్ల రహదారి
రైల్వే లైన్ నిర్మాణం	10.6 కి.మీ
నీరు	గొట్టా బ్యారేజీ నుంచి 0.5 ఎంఎల్‌డీ సరఫరా

రూ.35 కోట్లతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

భావనపాడు పోర్టు నిర్వాసితులు 594 మంది కోసం రూ.35 కోట్లతో 55 ఎకరాల్లో నౌపడలో అధునాతన వసతులతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించనున్నామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఈ నెల 19న భావనపాడు పోర్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు మూలపేట, విష్ణుచక్రంలో రైతుల నుంచి 320 ఎకరాలు సేకరించామని తెలిపారు. రైతులకు 10 శాతం మాత్రమే పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. అప్రోచ్ రోడ్డు కోసం మరో 320 ఎకరాలు సేకరించామని తెలిపారు. దీంతో పాటు మొదటి ఫేజ్‌లో సీఆర్‌జెడ్ భూములు, ప్రభుత్వ భూములు, అటవీ శాఖ భూములు.. మొత్తం 1000 ఎకరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. రెండో ఫేజ్‌లో బృహత్తర పోర్టు డెవలప్‌మెంట్‌కు మరికొన్ని భూములు రైతుల నుంచి సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆర్‌అండ్ ఆర్ కాలనీకి ఈ నెల 11న ప్రభుత్వం నుంచి ప్లాన్ అప్రూవల్ వచ్చిందన్నారు. జిల్లా ప్రజల పోర్టు కల నెరవేరుతుండడం శుభ పరిణామమన్నారు.

పోర్టు సిటీగా శ్రీకాకుళం



భావనపాడుతో శ్రీకాకుళం జిల్లా పోర్టు సిటీగా మారుతుంది. ఇప్పటికే ఈ పోర్టు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ పనులు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధిపై ముఖ్యంగా దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రామాయపట్నం పోర్టు పనులు వేగంగా జరుగుతుండగా, త్వరలో మచిలీపట్నం పనులు కూడా ప్రారంభించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి రామాయపట్నం పోర్టుకు తొలి నౌకను తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అదే స్ఫూర్తితో భావనపాడు పోర్టు పనులు కూడా లక్ష్యంలోగా పూర్తి చేస్తాం.

– గుడివాడ అమర్‌నాథ్,
పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి

పెద్ది శ్రీనుకు పెద్దదిక్కుగా నిలిచినందుకు గర్వపడుతున్నా

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్

సాక్షి, అమరావతి : ఏలూరు జిల్లా గణపవరానికి చెందిన పెద్ది శ్రీను కుటుంబానికి మన ప్రభుత్వం పెద్ద దిక్కుగా నిలిచినందుకు గర్వపడుతున్నానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీనుకు దివ్యాంగ పెన్షన్‌తో పాటు అతని భార్యకు అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, వడ్డీ రాయితీ వంటి పథకాలతో పాటు భూపట్టా ఇవ్వడంతో ఆ కుటుంబంలో వెలుగులు నింపినందుకు, అలాగే ఇటువంటి లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపే అవకాశం కలిగినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది'.. అంటూ శుక్రవారం రాత్రి ఆయన ట్వీట్ చేశారు.

కోస్తా జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు

ఉత్తరాంధ్రలో ఎండల ప్రభావం ఎక్కువని వాతావరణ శాఖ హెచ్చరిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో మరో 3 రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఉత్తరాంధ్రలో ఎండల ప్రభావం అధికంగా ఉంటుందని హెచ్చరించింది. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎండ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. మరోవైపు శుక్రవారం రాష్ట్రంలోని ఎక్కువ ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో శుక్రవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.6	27.3
ఏలూరు	43.0	27.0
రాజమహేంద్రవరం	43.0	26.0
విజయవాడ	42.0	27.0
మార్కాపురం	42.0	26.0
అనంతపురం	41.8	21.7
విశాఖపట్నం	41.4	26.2
కడప	41.2	23.5
శ్రీకాకుళం	41.0	25.0
తిరుపతి	41.0	24.0
నెల్లూరు	40.6	25.9
కర్నూలు	40.5	28.0
విజయనగరం	39.0	27.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	42.0	24.7
రామగుండం	39.6	25.5
హైదరాబాద్	36.5	20.3

అంబేద్కర్ ఆలోచనలతో సీఎం జగన్ ముందుకు..

- దళిత వ్యతిరేక బాబు, లోకేశ్‌లకు బుద్ధి చెబుదాం
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున పిలుపు
- రాష్ట్ర ప్రభుత్వం నేతృత్వంలో ఘనంగా అంబేద్కర్ జయంతి

సాక్షి, అమరావతి/భవానీపురం(విజయవాడ పశ్చిమ) : అంబేద్కర్ ఆలోచన విధానంతో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని.. కానీ, చంద్రబాబు మాత్రం దళిత వ్యతిరేక ధోరణితోనే వ్యవహరిస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతి మహోత్సవాన్ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ భావజాలంతో సీఎం జగన్ పాలన ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఇంటి తలుపు తట్టి మరీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నది జగనన్న ప్రభుత్వమేనన్నారు. దళితులపట్ల తొలి నుంచి వ్యతిరేక భావంతో వ్యవహరిస్తున్న చంద్రబాబు, లోకేశ్‌కు బుద్ధి చెబుదామని నాగార్జున పిలుపునిచ్చారు. మరో మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగానే సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అణగారిన జాతుల ఉద్ధరణకు నాడు అంబేద్కర్ పాటుపడితే నేడు రాష్ట్రంలో జగనన్న చేస్తున్న సామాజిక న్యాయంతో చరిత్ర సృష్టిస్తోందన్నారు. కార్యక్రమంలో.. మాజీమంత్రి వెల్లంపల్లి, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మీ, కలెక్టర్ ఢిల్లీ రావు తదితరులు మాట్లాడారు. ప్రముఖ కవి, రచయిత కత్తి పద్మారావు రచనలకు ప్రోత్సాహకంగా మేరుగు నాగార్జున రూ.లక్ష చెక్కును అందజేశారు.

శరవేగంగా అంబేద్కర్ స్మృతివనం



మరోవైపు.. విజయవాడ నగరం నడిబొడ్డున రూ.350కోట్ల ఖర్చుతో అంబేద్కర్ స్మృతివనం పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ నిర్మాణం పనులను మంత్రులు నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఇతర అధికారులు శుక్రవారం పరిశీలించారు.

ఏపీ,తెలంగాణ భవన్‌లో అంబేద్కర్‌కు ఘన నివాళి

సాక్షి, న్యూఢిల్లీ: బాబాసాహెబ్ అంబేద్కర్ 132వ జయంత్యుత్సవాలు ఏపీ, తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యనాథ్ దాస్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఏపీ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్, ప్రత్యేక కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మందా జగన్నాథం తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ రచనలో కీలకపాత్ర పోషించిన అంబేద్కర్ సమానత్వం కోసం పోరాడారని వక్తలు కొనియాడారు. అనంతరం తిరుపతి, విశాఖపట్నం, రాజమహేంద్రవరానికి చెందిన చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

హెల్త్ ఐడీల జారీలో ఏపీకి రెండో స్థానం

- రాష్ట్రంలో 3,86,86,305 మందికి ఆరోగ్య పరీక్షలు పూర్తి
- వీరందరికీ హెల్త్ ఐడీలు జారీ • ఆరోగ్య వివరాలు డిజిటలైజేషన్
- వెల్లడించిన నేషనల్ హెల్త్ అథారిటీ – ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్

సాక్షి, అమరావతి: ఆరోగ్య రంగంలో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు లభించింది. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ఐడీలను జారీ చేయడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. తొలి స్థానాన్ని మధ్యప్రదేశ్, మూడో స్థానాన్ని ఉత్తరప్రదేశ్ దక్కించుకున్నాయి. ఈ విషయాన్ని నేషనల్ హెల్త్ అథారిటీ–ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రకటించింది. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ వెళ్లి 3,86,86,305 మందికి సార్వత్రిక ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయడమే కాకుండా వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ ఐడీలను జారీ చేసిందని వెల్లడించింది.

ప్రాథమిక దశలోనే వ్యాధుల నివారణ..

జీవనశైలి, జీవనశైలేతర వ్యాధులను నివారించడానికి రాష్ట్రంలోని 4.66 కోట్ల జనాభాకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా ప్రజలకు వారి ఇళ్ల వద్దే ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు.. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, రక్తహీనతతో పాటు ఇతర వ్యాధులను గుర్తించడానికి ప్రాథమిక పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో వ్యాధులు బయటపడినవారికి వైద్యులతో తదుపరి పరీక్షలు చేయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స చేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నాటికి 3,86,86,305 మందికి వారి ఇళ్ల వద్దే ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. వారి ఆరోగ్య వివరాలతో కూడిన హెల్త్ ఐడీలను జారీ చేసి డిజిటలైజ్ చేశారు. అలాగే ప్రజల హెల్త్ ఐడీలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌కు అనుసంధానించారు. దీంతో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ఐడీలను జారీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది.

ఇదండీ జగత్



.. మళ్లీ ఎవరివైనా మనోభావాలు దెబ్బతిని పరువు నష్టం దావా వేస్తారేమోనని.. ముందే సారీ చెప్పేస్తున్నారు!

క్లుప్తంగా...

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా సంతోషరావు

ఉత్తర్వులు జారీ చేసిన ఇంధనశాఖ



సాక్షి, అమరావతి/తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా కె.సంతోషరావును నియమిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతున్న కె.సంతోషరావుకు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మేరకు ఆయన గత ఏడాది జూలై 22 నుంచి ఆ డిస్కం బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఏపీఈపీడీసీఎల్‌కు కొత్త సీఎండీగా ఐ.పృథ్వీతేజ్‌ను నియమించింది. ఈ నేపథ్యంలో ఏపీఎస్పీడీసీఎల్‌కు పూర్తి స్థాయి సీఎండీగా సంతోషరావును నియమిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

వివేకా హత్య కేసులో ఉదయ్‌కుమార్‌రెడ్డి అరెస్టు

పులివెందుల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో పులివెందులకు చెందిన యూసీఐఎల్ ఉద్యోగి గజ్జల ఉదయ్‌కుమార్ రెడ్డిని సీబీఐ అధికారులు శుక్రవారం ఉదయం అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారి రాంసింగ్ (ఐవో)ను మార్చి ఆయన స్థానంలో సీబీఐ డీఐజీ చౌరాసియా, ఐవోగా ఎస్పీ వికాస్ సింగ్‌తోపాటు మరికొందరు అధికారులను నియమించిన విషయం తెలిసిందే. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో సీబీఐ అధికారులు పట్టణంలోని ఉదయ్‌కుమార్‌రెడ్డి ఇంటికి చేరుకుని నోటీసు ఇచ్చారు. ఆయన్ని, ఆయన తండ్రి జయప్రకాష్‌రెడ్డిని రెండు వాహనాల్లో పులివెందుల శివారుకు తీసుకెళ్లారు. అక్కడ జయప్రకాష్‌రెడ్డిని దించేసి, కడప సెంట్రల్ జైలులో ఉన్న సీబీఐ కార్యాలయానికి రావాలని చెప్పారు. ఉదయ్‌కుమార్‌రెడ్డిని కడపలోని సీబీఐ కార్యాలయానికి తీసుకెళ్లారు. జయప్రకాష్‌రెడ్డి లాయర్‌తో కలిసి ఉదయం 9 గంటల ప్రాంతంలో సీబీఐ ఆఫీసుకు చేరుకోగా.. ఉదయ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేస్తున్నట్లు మెమోను ఆయనకు ఇచ్చారు. సాయంత్రం 4గంటలకు పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీఐ రాజుకు ఉదయ్‌కుమార్‌రెడ్డి అరెస్టు మెమో ఇచ్చారు. కాగా, వివేకా హత్య కేసుకు సంబంధించి తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని తనను వేధిస్తున్నారని గతంలో సీబీఐ అధికారి రాంసింగ్‌పై ఉదయ్‌కుమార్ రెడ్డి కేసు పెట్టిన విషయం తెలిసిందే.

శిల్పారామాలు కళకళ

రాష్ట్రంలో శిల్పారామాలకు పెరుగుతున్న పర్యాటకులు

- ఎనిమిదేళ్లతో పోలిస్తే 125 శాతం సందర్శకుల వృద్ధి
- రాష్ట్ర విభజన తర్వాత రికార్డు స్థాయిలో రాబడి
- తొలిసారిగా మెరుగైన లాభాల్లో శిల్పారామం సొసైటీ
- కొత్తగా కర్నూలు, రాయచోటిలో అర్బన్‌హట్స్ నిర్మాణం
- శిల్పారామాల్లో హస్తకళల మ్యూజియాల ఏర్పాటుకు ప్రతిపాదనలు



పులివెందుల శిల్పారామంలో ఆధునికీకరణ పనులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని శిల్పారామాలు పర్యాటకులతో నిత్యం కళకళలాడుతున్నాయి. గత ఎనిమిదేళ్లతో పోలిస్తే 125 శాతం మేర సందర్శకుల తాకిడి పెరిగింది. కోవిడ్ సమయంలో గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్న శిల్పారామం సొసైటీ ఏడాది కాలంలోనే అనూహ్యంగా వృద్ధిని సాధించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా మెరుగైన రాబడి లభించింది. గతంలో ఎప్పుడూ నష్టాల్లోనే నడిచిన శిల్పారామాలు 2022–23లో ఏకంగా రూ.2 కోట్ల వరకు లాభం గడించడం రాష్ట్రంలోని పర్యాటక అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. రాష్ట్రంలో ఎనిమిది శిల్పారామాలు ఉండగా సగటున ప్రతినెల 1.25 లక్షల మంది సందర్శిస్తున్నారు.

ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి

గ్రామీణ వాతావరణానికి ప్రతీకలుగా నిలిచే శిల్పారామాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా తిరుపతి, కడప శిల్పారామాల్లో మల్టీపర్పస్ హాల్, డైనింగ్ హాల్, టాయిలెట్‌ల పునరుద్ధరణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. పర్యాటకుల భద్రత దృష్ట్యా శిల్పారామాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా బోటింగ్ (జలవిహారం) కార్యకలాపాల పనులను శరవేగంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే విశాఖపట్నంలో స్విమ్మింగ్ పూల్, వాటర్ గేమ్స్–జిమ్, సందర్శకులను ఆకట్టుకునేలా పెయింటింగ్ డిస్‌ప్లేలను ఏర్పాటు చేసింది. మిగిలిన శిల్పారామాల్లోను ఈ తరహా వినోదాన్ని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గుంటూరు శిల్పారామం పనులు దాదాపు పూర్తికావడంతో త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. పులివెందుల శిల్పారామంలో పునరుద్ధరణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

కొత్త శిల్పారామాల ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా శ్రీకాకుళం, చిత్తూరు, విజయనగరం, కర్నూలు, రాయచోటిల్లో అర్బన్ హట్స్ (శిల్పారామాల) నిర్మాణాన్ని ప్రతిపాదించింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.8 కోట్లతో కర్నూలులో, రూ.9.20 కోట్లతో అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం బండపల్లిలో శిల్పారామాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ప్రస్తుతం డీపీఆర్ తయారీ, భూ సేకరణపై ప్రభుత్వం దృష్టిసారించింది. మరోవైపు విశాఖ, కాకినాడ, కడప, పులివెందుల, అనంతపురం, పుట్టపర్తి, గుంటూరుల్లో ఒక్కోచోట రూ.1.50 కోట్లతో హస్తకళల మ్యూజియాల నిర్మాణానికి చర్యలు చేపడుతోంది.

శిల్పారామాల్లో సందర్శకుల సంఖ్య, రాబడి, లాభనష్టాల వివరాలు

సంవత్సరం	సందర్శకుల సంఖ్య (లక్షల్లో)	రాబడి (రూ.కోట్లలో)	లాభం/నష్టం (రూ.కోట్లలో)
2016-17	9.51	4.01	+0.40
2017-18	9.80	4.14	-0.45
2018-19	11.43	6.28	-0.42
2019-20	10.29	5.83	-0.60
2020-21	4.35	3.80	-2.75
2021-22	8.28	4.05	-0.69
2022-23	13.30	6.64	+2.00

జిల్లాకో శిల్పారామం

ప్రతి జిల్లాలో శిల్పారామం ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన వాటా స్కీమ్‌లను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. శిల్పారామాల్లో పచ్చదనాన్ని కాపాడుతూనే ఆధునికీకరణ చేపడుతున్నాం. అందుకే రాష్ట్ర విభజన తర్వాత గణనీయమైన వృద్ధిని సాధించాయి. నెలకు 1.25 లక్షల మంది సందర్శకులు రావడం ఇందుకు నిదర్శనం.

– ఆర్.కె.రోజా, పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖ మంత్రి

చక్కని ఆటవిడుపు కేంద్రాలు

గతంలో ఎన్నడూ లేనివిధంగా శిల్పారామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాం. చక్కని ఆటవిడుపు కేంద్రాలుగా పిల్లలు, పెద్దలు కూడా సంతోషంగా గడిపే వాతావరణాన్ని సృష్టిస్తున్నాం. ముఖ్యంగా బోటింగ్ కార్యకలాపాలపై దృష్టిసారించాం. హస్తకళలు, కళాకారుల కోసం శిల్పారామాల్లో ఉచితంగా ప్రత్యేక స్టాల్స్, స్టేజ్‌లను అందిస్తున్నాం.

– శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సీఈవో, శిల్పారామం సొసైటీ

‘గీతం’ ఆక్రమణలోని ప్రభుత్వ భూమి స్వాధీనం

4.74 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె ఏర్పాటు



గీతం యూనివర్సిటీ ప్రాంగణంలోని మెడికల్ కాలేజీ వద్ద స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలంలో వేసిన కంచె, ఏర్పాటు చేసిన బోర్డు



వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌డీవో భాస్కర్‌రెడ్డి

కొమ్మాది (భీమిలి) : స్థానిక గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆక్రమణలో ఉన్న మరి కొంత ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం గీతం మెడికల్ కళాశాల ఆవరణలో, గీతం విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న సుమారు 4 ఎకరాల 74 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. తాజాగా ఇక్కడ భూములను సర్వే చేసి వాటి హద్దుల ప్రకారం సర్వే నంబరు 15, 16, 19, 20లలో సుమారు 4 ఎకరాల 74 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినట్లు చెప్పారు. మొత్తం ఆక్రమణలకు గురైన 40 ఎకరాల్లో ఇప్పటి వరకు 20 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. మిగిలిన ప్రభుత్వ భూమిపై హైకోర్టులో కేసు ఉన్నందున తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. గీతంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణలను గుర్తించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందుజాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆర్‌డీవో పేర్కొన్నారు. కాగా, గీతం కాలేజీలో భవనాలను కూల్చేస్తున్నారంటూ టీడీపీ నేతలు వదంతులు సృష్టించారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి అక్కడికి చేరుకుని హడావుడి చేశారు. ఆయన గీతంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, ఏసీపీ చుక్కా శ్రీనివాస్ అడ్డుకున్నారు. ఉదయం 10 గంటల తర్వాతే అనుమతి ఉంటుందని, అంతవరకు తమకు సహకరించాలని కోరారు.

సీఎం వైఎస్ జగన్ సంఘసంస్కర్త

వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, అమరావతి: సమాజంలో మౌలిక మార్పుల కోసం కృషి చేస్తున్న సంఘ సంస్కర్త ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. జగన్ రాజకీయ నాయకుడు కాదని, ఆయన ఓట్ల రాజకీయం చేయడం లేదని కొనియాడారు. విజయవాడలో శుక్రవారం ఆర్.కృష్ణయ్య మీడియా సమావేశం నిర్వహించారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీసీ కుల జనగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆర్.కృష్ణయ్య బీసీల కోసం ఉద్యమం చేస్తున్న తనను పిలిచి.. ‘కృష్ణన్నా నీకు ఎంపీ అనే ఆయుధం ఇస్తున్నా.. బీసీల కోసం బలంగా పోరాడు’ అని తనకు అవకాశం ఇచ్చిన గొప్ప దార్శనికుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. బీసీలు సీఎంగా ఉన్న రాష్ట్రాల్లో సైతం బీసీల గురించి జగన్ మాదిరిగా శ్రద్ధ తీసుకోవడం లేదన్నారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎంపీలతో పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టించి జగన్ చరిత్ర సృష్టించారన్నారు. అది చట్టం కాకపోయినా ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో ఏకంగా 65 శాతం పదవులను బీసీలకు కేటాయించారని గుర్తు చేశారు. కుల జనగణన చేపట్టాలని కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేయించడం చారిత్రాత్మకమన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందించకపోయినా ఏపీలో కుల గణన కోసం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని చెప్పారు. బీసీ కుల గణన కోసం, చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం అన్ని రాష్ట్రాలు తిరిగి ఏపీని ఆదర్శంగా చూపిస్తామన్నారు. దేశంలో బీసీల వాటా బీసీలకు ఇవ్వాలని కోరుతూ దేశంలో బీసీలందరితో జాతీయోద్యమాన్ని చేపడతామని తెలిపారు. ఆగస్టులో 40 లక్షల మంది బీసీలతో పార్లమెంట్‌ను ముట్టడిస్తామన్నారు. బీసీలపై కేంద్రం వైఖరి మార్చుకునే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. కాగా కృష్ణా జిల్లా గుడివాడలో మే 12న మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించి భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు ఎన్.మారేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలియం, సహజవాయువు రంగాల్లో ప్రోత్సాహం

- సీఎస్‌తో భేటీలో కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ కార్యదర్శి పంకజ్ జైన్
- రాష్ట్రంలో పెట్రో కెమికల్ ప్రాజెక్టు ఏర్పాటు వేగవంతంపై చర్చ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చమురు, సహజవాయువు రంగాల్లో చేపట్టే ప్రాజెక్టుల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ అన్ని విధాల కట్టుబడి ఉందని ఆ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ చెప్పారు. ఆయన శుక్రవారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్రోలియం చమురు, సహజవాయువు రంగానికి సంబంధించి లైసెన్సులు, క్లియరెన్స్‌ల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, రాష్ట్రంలో పెట్రో కెమికల్ ప్రాజెక్టుల స్థాపనకు సంబంధించిన ఫీజులు, వాటి నిర్వహణ వంటి కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న పెట్రోలియం మైనింగ్ లీజులు, అన్వేషణ, ఉత్పత్తి కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడానికి అవసరమైన వేగవంతమైన అనుమతుల మంజూరుకు తీసుకోవాల్సిన చర్యలు, చమురు, గ్యాస్, మైనింగ్ ప్రాజెక్ట్‌ల ఆపరేషన్ కోసం సమ్మతి, ఇటీవల పెరిగిన ఎస్టాబ్లిష్‌మెంట్ ఫీజులు, రుసుములు, ఉత్పత్తితో అనుసంధానించిన వేరియబుల్ కాంటినెంట్ అంశం గురించి కూడా చర్చించారు. రాష్ట్రంలో పెట్రో కెమికల్ ప్రాజెక్టు ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడంపై కూడా వారు చర్చించారు. ఈ సందర్భంగా పంకజ్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రానికి సంబంధించి ఈ రంగంలో నెలకొన్న ముఖ్యమైన సమస్యల సత్వర పరిష్కారానికి కలిసి పనిచేద్దామని చెప్పారు. పెట్రో కెమికల్ ప్రాజెక్టుతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని జవహర్‌రెడ్డి, పంకజ్ జైన్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

కేంద్రం ప్రకటనపై భగ్గుమన్న ఉక్కు కార్మికులు

విశాఖలో కేంద్రం దిష్టిబొమ్మ దహనం



కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కూర్మన్నపాలెం (గాజువాక): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతోందని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ తాజాగా చేసిన ప్రకటనపై విశాఖపట్నంలో శుక్రవారం కార్మిక సంఘాలు భగ్గుమన్నాయి. ఈ ప్రకటనతో ఆగ్రహించిన కార్మికులు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినదించారు. పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించడంతో కార్మికులు ప్రతిఘటించారు. దీంతో కూర్మన్నపాలెం కూడలిలోని జాతీయ రహదారిపై కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే ఎంతకైనా పోరాడతామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేసిన వారిని దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొద్దిసేపటి తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ప్రభుత్వ పథకాల అమలు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయి సందర్శనలు, తనిఖీలు చేయించాలని వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అన్ని జిల్లాలకు ప్రత్యేక సీనియర్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గత 46 నెలల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నవరత్నాల పేరుతో అనేక పథకాలను, కార్యక్రమాలను చేపట్టింది. వీటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులు నెలలో రెండు సార్లు తమకు కేటాయించిన జిల్లాలను సందర్శించాల్సి ఉంటుంది. క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాల అమలుతో పాటు రైతు భరోసా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు, భూముల రీ సర్వే.. స్కూళ్లు, ఆస్పత్రుల్లో చేపట్టిన నాడు–నేడు కార్యక్రమాలు తదితరాల అమలు తీరును ప్రత్యేక అధికారులు తనిఖీ చేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లు, ఆస్పత్రుల్లోని వసతులను పరిశీలిస్తారు. త్వరలో ప్రారంభించనున్న ‘జగనన్నకు చెబుతాం’ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను పరిష్కరిస్తున్న తీరును పరిశీలన చేస్తారు. ప్రత్యేక అధికారుల తనిఖీలు, పర్యవేక్షణకు వీలుగా సంబంధిత శాఖలన్నీ నమూనా పత్రాలను రూపొందించాలని సీఎస్ ఆదేశించారు. తనిఖీ నివేదికలను అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేకంగా యాప్/వెబ్‌సైట్‌ను రూపొందించాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక సీఎస్‌కు సూచించారు. ప్రత్యేక అధికారుల నివేదికలను సంబంధిత శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లు విశ్లేషించి.. తాము తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించాలని స్పష్టం చేశారు.

ప్రత్యేక అధికారులు	జిల్లా
గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి	అల్లూరి సీతారామరాజు
ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్	అనకాపల్లి
పౌర సరఫరాల కమిషనర్	అనంతపురం
ఆప్కాబ్ ఎండీ	అన్నమయ్య
సాంకేతిక విద్య కమిషనర్	బాపట్ల
పౌరసరఫరాల సంస్థ ఎండీ	చిత్తూరు
సీఆర్‌డీఏ కమిషనర్	తూర్పుగోదావరి
జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి	ఏలూరు
సెర్ప్ సీఈవో	గుంటూరు
వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి	కాకినాడ
బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి	డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ
గృహ నిర్మాణ సంస్థ ఎండీ	కృష్ణా
రవాణ, రహదారులు-భవనాలు కార్యదర్శి	కర్నూలు
ఐటీ కార్యదర్శి	నంద్యాల
వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్	శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వాణిజ్య పన్నుల కమిషనర్	ఎన్టీఆర్
పంచాయతీరాజ్ కమిషనర్	పల్నాడు
మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి	పార్వతీపురం మన్యం
వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి	ప్రకాశం
ఏపీ జెన్‌కో ఎండీ	శ్రీ సత్యసాయి
సర్వే, సెటిల్‌మెంట్స్, భూ రికార్డుల కమిషనర్	శ్రీకాకుళం
ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి	తిరుపతి
మున్సిపల్ పరిపాలన కమిషనర్ అండ్ డైరెక్టర్	విశాఖపట్నం
పాఠశాల విద్య కమిషనర్	విజయనగరం
మత్స్య శాఖ కమిషనర్	పశ్చిమగోదావరి
ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ	వైఎస్సార్

‘పొదుపు’ మహిళలకు వ్యక్తిగత రుణాలు

ఎస్‌బీఐతో సెర్ప్ అవగాహన ఒప్పందం

రుణాలు మాఫీ చేస్తామని మహిళలను మోసం చేసిన చంద్రబాబు

- వైఎస్సార్ ఆసరాతో ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- అక్కచెల్లెమ్మలపై వడ్డీ భారాన్నీ తప్పించిన సీఎం
- సకాలంలో రుణాలు చెల్లిస్తున్న సంఘాలు
- ఇక వారి వ్యాపారాన్ని అనుసరించి రుణం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని పొదుపు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులైన మహిళలకు వైఎస్ జగన్ అందించిన చేయూత అక్కచెల్లెమ్మలు మరింతగా పురోభివృద్ధి సాధించేందుకు బాటలు వేసింది. రాష్ట్రంలో పొదుపు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండే మహిళలకు సంఘంతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగానూ వ్యాపారానికి బ్యాంకు రుణాలు లభించనున్నాయి. ఈ రుణాల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రత్యేక అవగాహన ఒప్పందం చేసుకొంది. సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్, ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ వి. హేమ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ఓం నారాయణ శర్మ, సెర్ప్ బ్యాంకు లింకేజీ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ కేశవ్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇప్పటివరకు పొదుపు సంఘాలలో సభ్యులుగా ఉండే మహిళలకు బ్యాంకులు సంఘాల ప్రాతిపదికన మాత్రమే రుణాలు ఇస్తున్నాయి. మహిళలు పొదుపు సంఘంగా ఏర్పడి, నెలనెలా కొంత మొత్తం పొదుపు చేసుకుంటుంటే.. సంఘాల పని తీరు ఆధారంగా బ్యాంకులు వాటిలోని మహిళలందరికీ ఉమ్మడిగా మాత్రమే, సంఘం పేరుతోనే రుణాలిస్తున్నాయి. ఈ రుణాలతో వారి అత్యవసర కుటుంబ అవసరాలను తీర్చుకోవడంతో పాటు చిన్న చిన్న వ్యాపారాలను కూడా నిర్వహిస్తూ మహిళలు కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మోసం చేసింది. దీంతో అప్పట్లో పొదుపు సంఘాలపై వడ్డీలు, చక్రవడ్డీల భారం పడి పొదుపు సంఘాలన్నీ కుదేలైపోయాయి. సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించలేకపోయాయి. నాలుగో వంతుకు పైగా సంఘాలు నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ)గా ముద్రపడ్డాయి. ఆ సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలంతా ఆర్థికంగా దెబ్బ తిన్నారు. తిరిగి రుణాలివ్వడానికి బ్యాంకులు నిరాకరించాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితి మారింది. అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్ పూర్తి తోడ్పాటునందించారు. దీంతో పొదుపు సంఘాలు మళ్లీ జీవం పోసుకున్నాయి. ఇప్పుడు మహిళలు పొదుపు సంఘాల పేరిట తీసుకున్న రుణాలను నూటికి 99.55 శాతం మేర తిరిగి చెల్లిస్తున్నారు. పొదుపు సంఘాల రుణాల చెల్లింపుల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది.

సీఎం జగన్ అందించిన ‘ఆసరా’

చంద్రబాబు చేసిన మోసంతో దారుణంగా దెబ్బ తిన్న మహిళల పొదుపు సంఘాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదుకుంది. గత అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో రూ. 25,571 కోట్ల మేర అప్పులు ఉండేవి. ఆ రుణం మొత్తాన్ని నాలుగు దఫాలుగా నేరుగా మహిళల చేతికి అందిస్తామని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారు. అధికారంలోకి రాగానే, ఇచ్చిన హామీని అక్షరాలా అమలుచేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటికే మూడు విడతల్లో 7,98,395 స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని మొత్తం 78,94,169 మంది అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ మొత్తం రూ.19,178 కోట్లు అందజేశారు. దీనికి తోడు గత చంద్రబాబు ప్రభుత్వం మధ్యలోనే ఆపేసిన పొదుపు సంఘాలపై సున్నా వడ్డీ పథకాన్ని మళ్లీ అమలు చేశారు. పొదుపు సంఘాల మహిళలు బ్యాంకులకు కట్టాల్సిన వడ్డీ భారాన్ని కూడా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటిదాకా రూ. 3,615.29 కోట్లు వడ్డీని అక్కచెల్లెమ్మలకు అందజేసింది.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎస్‌బిఐ అధికారులు, సెర్ప్ సీఈవో ఇంతియాజ్

పెరిగిన మహిళా సంఘాల పరపతి

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పొదుపు సంఘాలకు ఇస్తున్న ప్రోత్సాహకాలతో మహిళలు సంఘాల పేరిట బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారు. వ్యాపారాలనూ వృద్ధి చేసుకుంటున్నారు. దీంతో మహిళా సంఘాల పరపతి పెరిగింది. పెద్ద ఎత్తున రుణాలివ్వడానికి బ్యాంకులు ముందుకు వస్తున్నాయి. 2019 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు బ్యాంకులు పొదుపు సంఘాలకు మొత్తం రూ. 1,09,956.87 కోట్ల రుణాలు అందజేశాయి. ఒకప్పుడు ఒక్కొక్క సంఘం రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల మధ్య మాత్రమే రుణాలు పొందగలిగేవి. ఇప్పుడు 3,00,468 సంఘాలు (మూడో వంతుకు పైగా) రూ. 10 లక్షలకు పైబడి రుణాలు పొందుతున్నాయి. వీటిలో 41,139 సంఘాలు ఏకంగా రూ. 20 లక్షల మేర రుణాలు పొందడం గమనార్హం. ఈ రుణాలతో వ్యాపారాభివృద్ధి చేసుకున్న పొదుపు సంఘాల మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. వారు ఇప్పుడు సొంతంగా వ్యాపారాలు చేసుకోగల స్థాయికి వచ్చారు. అయితే, వారికి బ్యాంకులు వ్యక్తిగతంగా రుణం ఇవ్వకపోవడం అవరోధంగా మారింది. ఇప్పుడు వీరికి రుణాలివ్వడానికి ఎస్‌బీఐ ముందుకు వచ్చింది. వారు ఏర్పాటు చేసుకొనే వ్యాపార సంస్థనుబట్టి సంఘంతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా రుణాలు లభిస్తాయని సెర్ప్ అధికారులు వెల్లడించారు.

స్వగృహ‘మస్తు’

సర్వాంగ సుందరంగా జగనన్న లేఅవుట్లు

- మెగా కాలనీల నిర్మాణం
- వేగంగా నిర్మాణ పనులు
- రాష్ట్రంలో మూడో స్థానంలో ఏలూరు జిల్లా



ఏలూరు శనివారపుపేట జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం

సాక్షి ప్రతినిధి,ఏలూరు: అందమైన ఇల్లు ప్రతి ఒక్కరి కల.. పేదవాడికి సొంతిల్లు ఓ వరం.. అలాంటి సొంతింటి కలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నెరవేరుస్తోంది. రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ జగనన్న లేఅవుట్లలో ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు సీసీ రోడ్లు, విద్యుత్, తాగునీరు, పార్కులు వంటి మౌలిక వసతులు కల్పిస్తోంది. అలాగే సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి కూడా లబ్ధిదారులకు సాయం అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటి నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే వేలాది నిర్మాణాలు పూర్తికాగా గృహప్రవేశాలు చేసుకుని లబ్ధిదారులు సంతోషంగా జీవిస్తున్నారు. మున్సిపాల్టీ, నగరపాలక సంస్థ పరిధిలో విలువైన స్థలాలు, మరికొన్ని మండలాల్లో జాతీయ రహదారి వెంబడి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో భూముల విలువ కూడా భారీగా పెరుగుతోంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన పురోగతిలో రాష్ట్రంలో ఏలూరు జిల్లా మూడో స్థానంలో నిలిచింది.

ఏలూరు జిల్లాలో 88,190 ఇళ్లు

ఏలూరు జిల్లాలోని 738 లేఅవుట్లలో 60,608 ఇళ్లు, సొంత స్థలాల్లో 27,582 ఇళ్లు మొత్తంగా 88,190 గృహాలు మంజూరు కాగా 84,630 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. డివిజన్ల వారీగా ఏలూరులో 457 లేఅవుట్లు, సొంత స్థలాల్లో 60,042 ఇళ్లు, నూజివీడు డివిజన్‌లో 137 లేఅవుట్లు, సొంత స్థలాల్లో 14,628 ఇళ్లు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 144 లేఅవుట్లు, సొంత స్థలాల్లో 13,520 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటికే ఏలూరు డివిజన్‌లో 13,665, నూజివీడు డివిజన్‌లో 3,712, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 4,682 ఇళ్లు మొత్తంగా 22,059 నిర్మాణాలు పూర్తయ్యాయి. 39,134 ఇళ్లు శ్లాబ్‌ల స్థాయిలో పురోగతిలో ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

రూ.541.44 కోట్లు

ఏలూరు జిల్లాలో ఇళ్ల నిర్మాణం కోసం గృహనిర్మాణ శాఖ రూ.541.44 కోట్లు ఖర్చు చేసింది. ఏలూరు డివిజన్‌లో రూ.330.09 కోట్లు, నూజివీడు డివిజన్‌లో రూ.97.37 కోట్లు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో రూ.113.97 కోట్లు వెచ్చించింది. ముఖ్యంగా భోగాపురం, శనివారపుపేట, కైకలూరు, అప్పన్నవీడు, ఉంగుటూరులోని లేఅవుట్లు సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. 1,500 పైగా ఇళ్లు ఉంటే ప్రభుత్వం అదనపు సౌకర్యాలు కల్పిస్తోంది. లేఅవుట్లల్లో గ్రే వాటర్ (వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను కూడా ఏర్పాటుచేస్తున్నారు. మొదటి విడతలో 208 లేఅవుట్లల్లో 13,663 ఇళ్లకు ఉపయుక్తంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి నిధులు, మెటీరియల్ కొరత లేకపోవడంతో పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పశ్చిమలో వేగంగా..

పశ్చిమగోదావరి జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మొత్తం 603 లేఅవుట్లలో 71,864 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 20,404 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఇందుకు ప్రభుత్వం రూ.404 కోట్లు ఖర్చు చేసింది. ముఖ్యంగా భీమవరం, ఆకివీడు, తణుకు, పాలకొల్లు, భగేశ్వరం, పోడూరు, విస్సాకోడేరు లేఅవుట్లలో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అన్నిరకాలుగా ప్రోత్సాహం

ప్రభుత్వం అర్హులైన పేదలకు లేఅవుట్లలో ఉచితంగా స్థలం అందిస్తోంది. పట్టణ ప్రాంతంలో సెంటు, రూరల్ ప్రాంతంలో సెంటున్నర భూమితో పాటు రూ.1.80 లక్షలను పూర్తి సబ్సిడీ రూపంలో అందిస్తున్నారు. అలాగే నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఐరన్, ఎలక్ట్రికల్ సామాన్లను రాయితీపై అందిస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 90 రోజుల ఉపాధి హామీ పనులు కేటాయించి ఒక్కో కుటుంబానికి రూ.30 వేల అదనపు లబ్ధిని చేకూరుస్తున్నారు.

నిత్యము సంతుష్టుడై, యోగియై, మనో నిగ్రహం కలవాడై, దృఢమైన నిశ్చయముతో, మనో బుద్ధులను నాకు అర్పించిన భక్తుడు నాకు ప్రియుడు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, 15 ఏప్రిల్ 2023

కర్ణాటకంలో కథానాయకుడెవరు?

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రోజుల క్రితం మొదలైన టికెట్ల పంపిణీ పర్వం ఎప్పటిలాగే ప్రధాన పక్షాల్లో ముసలం పుట్టిస్తోంది. సహజంగానే కాంగ్రెస్, జేడీ(ఎస్)ల కన్నా అధికార బీజేపీకే అసంతృప్తి తాకిడి ఎక్కువుంది. నాలుగేళ్లనాడు గోడదూకుళ్లతో అధికారంలోకొచ్చినందుకు ఇది ఆ పార్టీకి అనివార్యం. రాష్ట్రంలో తనవల్లే బీజేపీకి అధికారం సాధ్యమైందనుకునే పార్టీ నేతలు, ఫిరాయింపు నేతలు చాలామందే ఉండటం ఇందుకు కారణం. నాయకత్వం ఎంతో ఊగిసలాడి, ఎన్నికల్లో ఏమవుతుందోనన్న లెక్కలేసుకుని చివరకు 17 మంది ఫిరాయింపుదారుల్లో 14 మందికి టిక్కెట్లు ఇవ్వక తప్పలేదు. 224 అసెంబ్లీ స్థానాలుంటే బీజేపీ ఇంతవరకూ రెండు జాబితాల్లో 212 మందికి టిక్కెట్లిచ్చింది. ఈ రెండు జాబితాలతోనే దాదాపు 30 స్థానాల్లో తిరుగుబాటు జెండాలు పైకిలేచాయి. 18 మంది సిట్టింగ్‌లకూ, డజను మందికి మించి మాజీ ఎమ్మెల్యేలకూ ఈ జాబితాల్లో చోటు దక్కలేదు. మాజీ సీఎం జగదీశ్ షెట్టార్‌కు టికెట్ వస్తుందో రాదో ఇంకా తేలలేదు. సీనియర్ నేత, మాజీ సీఎం యడ్యూరప్ప ఆగ్రహంతో ఉన్నారని తొలుత వార్తలొచ్చినా బెంగళూరులో అడుగుపెట్టి అంతా బాగుందని ఆయన కితాబునివ్వటం బీజేపీకి ఉన్నంతలో ఊరటనిచ్చే అంశం. 'ఆయన ఫోన్ స్విచాఫ్ చేసుకున్నారంటే 50 స్థానాల్లో బీజేపీ కనుమరుగు కావటం ఖాయం' అని యడ్యూరప్ప శిబిరంలోని ఎమ్మెల్యే ఒకరు అంతక్రితం హెచ్చరించారు. యడ్యూరప్ప 1983 మొదలుకొని ఏడు దఫాలు ప్రాతినిధ్యంవహించిన శివమొగ్గ జిల్లాలోని షికారిపురా స్థానంలో ఈసారి ఆయన కుమారుడు విజయేంద్రకు చోటు దొరికింది. యడ్యూరప్ప సామాజిక వర్గమైన లింగాయత్‌లకు 51 స్థానాలు కేటాయించారు. మాజీ ఉపముఖ్యమంత్రి, యడ్యూరప్ప అనుచరుడు, లింగాయత్ నేతల్లో ముఖ్యుడైన లక్ష్మణ్ సవాది టికెట్ దక్కకపోవటంతో కాంగ్రెస్‌లో చేరటం పార్టీకి నష్టమే. ఇతర పార్టీలను కుటుంబ పార్టీలంటూ, కుల పార్టీలంటూ నిందించే బీజేపీ కుల సమీకరణాలూ, కుటుంబ సమీకరణాలూ చూసుకుని టిక్కెట్లు ఇవ్వక తప్పలేదు. దక్షిణాదిలో బలంగా ఉన్న ఏకైక రాష్ట్రం కర్ణాటకలో తిరిగి అధికారం చేజిక్కించుకోవటమే లక్ష్యంగా ఈ దఫా ఏలుబడిలో హిందూత్వ కార్డును బీజేపీ బలంగా ఉపయోగించింది. విద్యాసంస్థల్లో హిజాబ్ నిషేధం, ముస్లింలకున్న 4 శాతం కోటా రద్దు అందులో భాగమే. ముస్లింలకు రద్దుచేసిన కోటాను ప్రధాన కులాలైన లింగాయత్‌లకూ, వొక్కళిగలకూ చెరిసగం పంచారు. అందువల్ల ఆ రెండు ప్రధాన కులాల ఓట్లూ తనకే పడగలవని బీజేపీ విశ్వసిస్తోంది. కర్ణాటకలో యడ్యూరప్ప నుంచి పెద్దగా ఒత్తిళ్లు లేకుండా టిక్కెట్ల వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షించగలగటం అధిష్టానానికి ఇదే మొదటిసారి. అయితే పార్టీలో ఇన్నేళ్లుగా ప్రత్యామ్నాయ నాయకుడిని రూపొందించటంలో అధిష్టానం విఫలమైంది. బలమైన రాష్ట్రంలో ఈ పరిస్థితి ఏర్పడటం పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితే. ముఖ్యమంత్రి బసవ రాజ్ బొమ్మై యడ్యూరప్పతో సరితూగే నేత కాదన్నది పార్టీలో అందరికీ తెలుసు.

సమస్యలు వచ్చిపడినప్పుడు ఉద్యమించటానికి బదులు ఎన్నికలప్పుడు అధికార పక్షంపై విమర్శలు గుప్పించటం కర్ణాటకలోని పార్టీలకూ అంటింది. ముఖ్యంగా హిజాబ్ నిషేధం, ముస్లింల కోటా రద్దు అంశంలో కాంగ్రెస్, జేడీ(ఎస్)లు బలంగా తమ వాణి వినిపించలేకపోయాయి. ముస్లింలు అధికంగా ఉండే కోస్తా కర్ణాటకలోని 21 స్థానాల్లో కాంగ్రెస్, జేడీ(ఎస్)లపై దీని ప్రభావం ఎలావుంటుందో వేచిచూడాలి. గత నెలాఖరులో విడుదలైన సీ–ఓటర్ సర్వే అయితే కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని జోస్యం చెప్పింది. కానీ కాంగ్రెస్ దాన్ని నిజం చేస్తుందా లేదా అన్నదే ప్రశ్న. పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, సిద్ధరామయ్యల మధ్య ఎప్పుడూ పొసగదు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీఎం చేస్తే తనకు అభ్యంతరం లేదని శివకుమార్ ఇటీవల చెప్పటం సిద్ధరామయ్య శిబిరానికి ఆగ్రహం తెప్పించింది. జేడీ(ఎస్)ది మరో వ్యథ. సమస్యలపై పోరాడాల్సిన సమయంలో ఆ పార్టీ వారసత్వ పోరుతో కొట్టుమిట్టాడింది. వొక్కళిగలు అధికంగా ఉన్న మైసూర్ ప్రాంతంలో జేడీ(ఎస్) బలంగానే ఉండేది. ఈసారి బీజేపీ పాగా వేయాలని చూస్తోంది. నామినేషన్ల ఘట్టం పూర్తయ్యేనాటికైనా జేడీ(ఎస్) ఇంటిని చక్కదిద్దుకుంటుందో లేదో చూడాల్సివుంది.

తాము ఓట్లేసి గెలిపించిన పక్షమే అధికారంలోకొస్తుందన్న గ్యారెంటీ లేని స్థితిలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక ఈ జాడ్యం చాలా రాష్ట్రాలకు అంటినా కర్ణాటకది ప్రత్యేకమైన పరిస్థితి. అక్కడ స్వప్రయోజనాలు తప్ప సిద్ధాంత జంజాటం లేని నేతల సంఖ్య ఎక్కువే. కనుక అస్థిర రాజకీయాలు రివాజుగా మారాయి. ప్రజాభీష్టాన్ని తెలుసు కోవటమనే ప్రక్రియను విడనాడి, ప్రజాభీష్టాన్ని తయారు చేయటం కోసం ఎడతెగకుండా శ్రమించే పార్టీల హవాయే ప్రస్తుతం ఎక్కువగా నడుస్తోంది. ఎన్నికలు నిర్వహించటంతోనే ప్రజాస్వామ్య కర్తవ్యం పరిపూర్తయిందని భావించటంకాక, ప్రజానీకం ఆశలు ప్రతిఫలించేలా... వారిలో ప్రజా స్వామ్య స్ఫూర్తి ఇనుమడించేలా ఏలుబడి సాగించటం ముఖ్యమని అన్ని పార్టీలూ గ్రహించటం అవసరం. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యానికి అర్థం, పరమార్థం ఉంటుంది.

మనిషి కేంద్రంగానే ఆలోచనలన్నీ...

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

రెండువేల ఆరువందల సంవత్సరాల క్రితం మనిషి పుట్టుక, బతుకు, జీవితం, చావుల గురించి; మానవజాతి దుఃఖోపశమన మార్గాల గురించి ఆలోచించి, అన్వేషించి జ్ఞానోదయం పొందినవాడు బుద్ధుడు. ఆ కాలంలోనే 'బహుజన హితాయ బహుజన సుఖాయ' అన్నాడాయన. సర్వమానవ జాతి సుఖమయంగా జీవించడానికి అవసరమైన జీవన సత్యాలు, దుఃఖనివారణ మార్గాలు, ప్రకృతి సంరక్షణ... అహింసాయుత ప్రేమమయ సామాజిక స్థితులకు గల మూలాలు బౌద్ధధర్మంలో ఉన్నాయి. ఇది మనిషికేంద్రంగా చెప్పబడిన నైతిక ధర్మం.

బౌద్ధాన్ని హృదయానికి హత్తుకొని, బౌద్ధభిక్షువులుగా మారి, బౌద్ధధర్మ ప్రచారానికి తమను తాము అంకితం చేసుకున్నవాళ్ళు 2,500 ఏళ్ల కాలంలో చాలామందే ఉన్నారు. కాని బుద్ధుడు చెప్పిన నైతిక ధర్మాలను, బహుజన హితాన్ని, బహుజన సుఖాన్ని జీర్ణించుకొని దానికి ఆచరణశీలత కల్పించిన అపరబోధిసత్వుడు మాత్రం అంబేడ్కర్ ఒక్కడే. బౌద్ధధర్మాన్ని భారతీయాత్మకు సరిపోయేలా రాజ్యాంగంలోనూ, అనేక పుస్తకాల్లోనూ చొప్పించి బహుజనుల హితానికి ఎంతో మేలు చేశారు అంబేడ్కర్. కులం మెట్ల భారతీయ సమాజాన్ని సామాజిక అంతరాలు లేని సమసమాజంగా నిలబెట్ట దానికి... ఈ దేశపు అట్టడుగు వర్ణాల, వర్గాల, జాతుల పక్షాన నిలబడి తన జీవితాన్నే అంకితం చేసిన అపర బోధిసత్వుడు అంబేడ్కర్.

అంబేద్కరిజం అంటేనే స్పష్టంగా చెప్పాలంటే బౌద్ధధర్మానికి ఆచరణశీల రూపం.

అంబేడ్కర్ కుల రహిత భారతాన్ని స్వప్నించారు. స్టేట్ సోషలి జాన్ని కోరుకున్నారు. కాని సాయుధ పోరాటం ద్వారా వచ్చే సోషలిస్టు వ్యవస్థను కాదు. మతాలన్నీ ఘనీభవించుకుపోవడం గమనించారు. అందుకే ఏ మతాన్నీ స్వీకరించలేదు. మతవాసనలు లేని నైతిక ధర్మ మైన బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి తాను మతాలకు అతీతుణ్ణని చాటి చెప్పారు. నైతికత, శాస్త్రీ యత, మనిషికి ప్రాము ఖ్యత నివ్వడం అపర బోధి సత్వుడికి బౌద్ధంలో నచ్చిన అంశాల్లో కొన్ని. మని షిని దృష్టిలో పెట్టుకునే పథ కాలు రూపొందించాలి. భౌతికపరమైన లౌకిక విష యాలకే మొదటి ప్రాధా న్యత ఇవ్వాలి. అంటే మనిషి బతకడానికి అవస రమైన కూడు, గూడు, గుడ్డ, వైద్యం, భూమి లాంటి వాటికి ప్రాధా న్యత నిచ్చి తీరాలి. వీటితోపాటు భావప్రకటనా స్వేచ్ఛ, మతస్వేచ్ఛ, ప్రతివాడికీ ఓటుహక్కు లాంటివి రాజ్యాంగంలో పొందుపరిచారు. ఈ ఓటు హక్కు ద్వారా ఎవరైనా సరే ఎన్నికల్లో ఓటువేయడం మాత్రమే కాదు, పోటీచేసి పాలకుడయ్యే అవకాశమూ ఉంది.

కాని సెక్యులరిజం అనే పదం కొన్ని రాజకీయ పార్టీలకు బూతు పదమైంది. భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మాత్రం సెక్యులర్ పదాన్ని సరైన అర్థంలోనే తన పాలనాకాలంలో ఉపయోగించారు. వీలైనంత వరకు మతాతీతంగానే, ప్రవర్తించారు. నెహ్రూకున్న ఆధునిక భావాలు, సెమీ సోషలిస్టు విధానాలు, సెక్యులర్ ధోరణి భారతదేశాన్ని నవభారతంగా మార్చే దిశగా నడిపించాయి. కాని క్రమక్రమంగా హిందుత్వశక్తులు బలపడు తున్నకొద్దీ నెహ్రూ తర్వాతి కాలంలో కాంగ్రెస్‌లోనూ హిందూ ఓటర్లను ఆకర్షించడానికి సెక్యులర్ పదానికి అర్థం మారింది. హిందుత్వశక్తులు కేంద్రంలో స్వబలంతో అధికారంలోకి రావడానికి మతం, మత సెంటిమెంట్లు బాగా ఉప యోగపడ్డాయి. ప్రియాంబుల్ నుంచి సెక్యులర్ పదాన్నే తీసివేయా లన్నంతగా, మనిషి కేంద్రంగా ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని మార్చి మతం, మనువాదం కేంద్రంగా రాజ్యాంగం ఉండాలనేంతగా ప్రచారం జరుగుతోంది.

అయితే ఇదే సమయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంటి నాయకులు అందరి విశ్వాసాలను గౌరవించడమే సెక్యులరిజంగా భావిస్తూ మనిషి కేంద్రంగా పాలన కొనసాగిస్తున్నారు. ఏ మత విశ్వాసాలనూ తక్కువ చేయకుండా, ఏ మత భావనలనూ ప్రోత్సహించకుండా... మతమనేది వ్యక్తిగత విశ్వాసంగా భావిస్తూ మానవాభి వృద్ధే ధ్యేయంగా పథకాలు కొనసాగిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యవ సాయం, ఉద్యోగ కల్పనలపై దృష్టి కేంద్రీకరించి పాలన కొనసా గిస్తున్నారు. ఇలాంటి విషయాలు తెలుగుదేశం, జనసేన లాంటి పార్టీ నాయకులకు; బీజేపీకీ నచ్చడం లేదు. జగన్ సెక్యులర్ భావాలు వారికి మెజారిటీ ప్రజల మతానికి వ్యతిరేకమైనవిగా కనబడుతు న్నాయి. ఓట్ల రాజకీయాల నేపథ్యంలోఎలాగైనా సరే అధికారంలోకి రావాలన్న తపన తప్ప వీరికి ప్రజలంటే ప్రేమ లేదు. ప్రజలకు ఉపయోగపడే ప్రాపంచిక దృక్పథమూ లేదు. భారత రాజ్యాంగం సురక్షితంగా ఉండాలన్నా, అంబేడ్కర్ చెప్పినట్లు అభివృద్ధి ఫలాలు కుల, మత, వర్గ ప్రాంతాలకు అతీతంగా అందరికీ సమానంగా అందాలన్నా... జగన్‌లాంటి నాయకుల పాలన అవసరమన్నది చరిత్ర చెబుతున్న సత్యం.

వ్యాసకర్త కథా రచయిత | 91829 18567

కప్పిపుచ్చడమే.. అసలైన కుట్ర!

- హత్యాయత్నం జరిగిన నాడు... నిందితుడికి నేరచరిత్ర లేదని రాసేసిన 'రామోజీ'
- నేరచరిత్ర ఉందని ఆ మరుసటిరోజు చెప్పిన విశాఖ పోలీస్ కమిషనర్
- అలా రాయాలంటూ 'ఈనాడు'కు చెప్పిందెవరో తేలాలి కదా?
- అప్పటికి కొద్ది రోజులుగా ఎయిర్‌పోర్టులో పనిచేయని సిసి కెమెరాలు
- అంతకు ముందే 'ఆపరేషన్ గరుడ' అంటూ నటుడు శివాజీ డ్రామా
- దాన్ని ప్రస్తావిస్తూ... హత్యాయత్నం జరిగిన నాడే చంద్రబాబు అనుమానాలు
- వీటన్నిటినీ తన స్టేట్‌మెంట్లో ప్రస్తావించిన నాటి విపక్ష నేత వైఎస్ జగన్
- కాలం గడుస్తున్నా తేల్చలేదు కనక... దర్యాప్తు వేగవంతానికి తాజా పిటిషన్

మొదటి నుంచీ అంతే!!. 2018 అక్టోబర్లో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో హత్యాయత్నం జరిగిన రోజునే... అటు 'ఈనాడు' గానీ... ఇటు తెలుగుదేశం పార్టీ గానీ సిగ్గూ ఎగ్గూ వదిలేశాయి. హత్యాయత్నం చేసిన నిందితుడు శ్రీనివాసరావుపై తన స్వస్థలం ముమ్మిడివరంలో ఎలాంటి కేసులూ లేవంటూ రామోజీరావు తొలిరోజునే సర్టిఫికెట్ ఇచ్చేశారు. కానీ రెండవరోజున అప్పటి వైజాగ్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నిందితుడిపై ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్లో నమోదైన రెండు కేసుల్ని వివరించారు. తప్పనిసరై దాన్ని కూడా ప్రచురించింది 'ఈనాడు'. ఇక్కడ గమనించాల్సింది... ప్రశ్నించాల్సింది ఒక్కటే. తొలిరోజున ఏ పోలీస్ అధికారీ చెప్పకుండానే... 'ఈనాడు' తనంతట తానుగా నిందితుడు శ్రీనివాసరావుపై ఎలాంటి కేసులూ లేవని ఎలా ప్రచురించింది? అసలెందుకు ప్రచురించిందీ వార్త? ఎందుకంటే ఇదంతా రామోజీ, చంద్రబాబు కలిసి ఆడించిన కుట్ర కాబట్టి!. తాజాగా ఎన్ఐఏ వేసిన కౌంటర్‌కు తన సొంత భాష్యం చెబుతూ శుక్రవారం 'ఈనాడు' రాసిన వార్త... ఈ కుట్రను మరోసారి స్పష్టంగా బయటపెట్టింది.అంతే!.

7. It is submitted that on 28.01.2018 a police clearance certificate was issued to the respondent No. 2/accused herein without due diligence with regard to pendency of any FIR registered against the above. The said fact can be conspicuously seen from the police clearance certificate which was issued with regard to no FIR crime being registered against the accused herein in the limits of Visakhapatnam Airport Police, but the fact remains that no due diligence was adhered towith regard to enquiry of crime registered in Crime No. 48 of 2017 dated 02.03.20217 under Sections 323 and 506 of IPC, 1860had been registered against Janipalli Srinivasa Rao @ Chanti (A1) at Mummidivaram Police Station, East Godavari District, Andhra Pradesh. It is evident that this important fact was dishonestly concealed by accused at the time of applying for his airport pass.

కోర్టుకు ఎన్ఐఏ సమర్పించిన అఫిడవిట్‌లో జనిపల్లి శ్రీనివాసరావుపై ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో 2017 మార్చి నెలలో కేసు నమోదు అయినట్లు పేర్కొన్న భాగం

ఈనాడు, కాకినాడ– ముమ్మిడివరం, న్యూస్‌టుడే: జగన్‌పై దాడి చేసిన జనిపల్లి శ్రీనివాసరావు మానసిక కుంగుబాటుతో నాలుగేళ్ల కిందట ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడని స్థానికులు తెలిపారు. కుటుంబీకులు, స్థానికులు సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పిందని వివరించారు. తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంకకు చెందిన శ్రీనివాసరావు.. జగన్‌కు వీరాభిమాని. జగన్ పుట్టిన రోజు, పాదయాత్ర సందర్భంగా స్థానికంగా బాగా హడావుడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. జగన్ ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేశాడు. శ్రీనివాసరావుకు కోడి పందేలంటే పిచ్చి. ముమ్మిడివరం మండలం ఠాణేలంక సమీపంలోని రాజుపాలెంలో కోడిపందేల బరి ఉంది. ఏటా సంక్రాంతి సందర్భంగా కోడిపందేల్లో పాల్గొనేవాడు. జగన్‌పై దాడికి పాల్పడిన కత్తిని కూడా కోడిపందేల సందర్భంగా సేకరించిందేనన్న వాదన ఉంది. శ్రీనివాసరావుపై ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు, ఫిర్యాదులు నమోదు కాలేదు.

జనిపల్లి శ్రీనివాసరావుపై ముమ్మిడివరం స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసు నమోదు కాలేదు అంటూ హత్యాయత్నం జరిగిన నాడే 'ఈనాడు' రాసిన వార్త.. (ఫైల్)

వాస్తవానికి సంఘటన జరిగిననాడే 'ఈనాడు' ఏడెనిమిది వార్తలు వేసింది. అందులో ఒక్కటి మాత్రమే దాడికి సంబంధించినది. మిగిలినవన్నీ ఆ దాడితో తెలుగుదేశానికి సంబంధం లేదంటూ ఎదురుదాడి చేసినవే. ఆ రోజు మొదలు... ప్రతిరోజూ ఈ కేసును తప్పుదోవ పట్టించే వార్తలే. కాకపోతే ఈ కేసును దర్యాప్తు చేసిన 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) 2019 జనవరి 23న దీనిపై ఛార్జిషీట్ వేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యకు ప్రయత్నించటం వెనక కుట్ర కోణం ఉన్నట్లు ఎన్ఐఏ ఆ ఛార్జిషీట్లో స్పష్టంగా పేర్కొంది. ఆ దిశగా దర్యాప్తు చేయాల్సి ఉందని చెప్పింది. ఇలాంటి సమయంలో న్యాయస్థానాలు అయితే ఆ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుని అభియోగాలు నమోదు చేయటం ... లేకపోతే తదుపరి దర్యాప్తు కొనసాగించి తుది ఛార్జిషీటు వేయాలని చెప్పటం చేస్తాయి. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేసి తుది ఛార్జిషీటు వేయాలని ఎన్ఐఏకు కోర్టు చెప్పింది. కాకపోతే ఏళ్లు గడుస్తున్నా... ఎన్ఐఏ తుది ఛార్జిషీటు వేయలేదు. ఈ కేసులో కుట్ర కోణం దాగి ఉందని తన తొలి ఛార్జిషీట్లో చెప్పింది కాబట్టి... ఆ కోణాన్ని త్వరగా విచారించి తుది ఛార్జిషీటు వేయాల్సిందిగా ఎన్ఐఏను ఆదేశించాలంటూ పిటిషనర్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

ఆనాడే.. తన స్టేట్‌మెంట్లో.. వివరంగా

తనపై హత్యాయత్నానికి సంబంధించి 2019 జనవరి 17న నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దర్యాప్తు అధికారులకు వాంగ్మూలమిచ్చారు. తనపై హత్యాయత్నం వెనక ఉన్న కుట్ర కోణాన్ని ఆయన బలంగా వినిపించారు. ''నిందితుడెవరో నాకు తెలియదు. కానీ తనను వైఎస్సార్ సీపీ అభిమానిగా చూపించటం, దానికి మద్దతుగా ఒక ఫ్లెక్సీని సృష్టించటం ఇదంతా ఓ పెద్ద కుట్రలో భాగం. ఇదంతా తమకు సంబంధం లేని వ్యవహారంగా చిత్రించడానికి టీడీపీ చేస్తున్న కుట్ర. నా పాదయాత్ర విశాఖలో అడుగుపెట్టిన నాటి నుంచీ హత్యాయత్నం జరిగిన రోజు వరకూ ఎయిర్‌పోర్టులో సీసీ టీవీ కెమెరాలు పనిచేయలేదని నాకు తెలిసింది. పైపెచ్చు నిందితుడికి ఎయిర్‌పోర్టులోని తన ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్లో ఉద్యోగమిచ్చిన హర్షవర్ధన్ చౌదరి టీడీపీ నాయకుడు. 2014లో గాజువాక టిక్కెట్ కూడా ఆశించారు. నిందితుడు శ్రీనివాసరావుపై ఎలాంటి కేసులూ లేవని అబద్ధపు డిక్లరేషన్ ఇచ్చి మరీ తనను పనిలో పెట్టుకున్నాడు. 'ఆపరేషన్ గరుడ' పేరిట టీడీపీ సానుభూతిపరుడైన ఓ నటుడు(శివాజీ) ఇచ్చిన స్టేట్‌మెంట్ కూడా ఈ కుట్రలో భాగమేననిపిస్తోంది. వీళ్లు చేసే హత్యాయత్నం ఫలిస్తే వీళ్లనుకున్నది జరుగుతుంది. ఒకవేళ బెడిసికొడితే.. గరుడలో చెప్పిందే జరిగిందని వీళ్లే ఎదురుదాడి చేయాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది'' అంటూ అప్పట్లో తన స్టేట్‌మెంట్లో వివరంగా చెప్పారు జగన్‌మోహన్ రెడ్డి. మరి దీన్ని ఎన్ఐఏ ఎందుకు సమగ్రంగా విచారించటం లేదు? ఇదే ఇప్పుడు ప్రశ్న.

ఇది కుట్ర కాదనగలమా?

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం చేసిన జానిపల్లి శ్రీనివాసరావు విశాఖపట్నం విమానాశ్రయంలోని

ఏది నిజం?

రెస్టారెంట్ ఫ్యూజన్ ఫుడ్స్‌లో ఉద్యోగంలో చేరడమే ఈ కుట్రకు నాంది. తదనంతరం జరిగిన పరిణామాలు కుట్రను స్పష్టంగా బయటపెట్టేలా ఉన్నా... ఎన్ఐఏ ఉదాసీనంగా ఉండటమే ఇక్కడ విస్మయం కలిగించే అంశం. ఎందుకంటే జె.శ్రీనివాసరావుకు తన రెస్టారెంట్లో ఉద్యోగమిచ్చేందుకు దాని యజమాని హర్షవర్ధన్ చౌదరి అన్ని నిబంధనలనూ తుంగలో తొక్కారు. కట్టుదిట్టమైన భద్రతా వలయంలో ఉండే విమానాశ్రయాల్లో ప్రైవేటు సిబ్బంది నియామకానికి కచ్చితమైన మార్గదర్శకాలున్నాయి. రెస్టారెంట్, ట్రావెల్ ఏజెన్సీల డెస్కులు మొదలైన వాటిలో ప్రైవేటు వ్యక్తులే పని చేస్తారు. అందుకోసమే డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించింది. ఆ మార్గదర్శకాల ప్రకారం విమానాశ్రయంలో పనిచేసే వారికి ఎలాంటి నేర చరిత్ర ఉండకూడదు. ఆ విషయాన్ని నిర్ధారిస్తూ నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) ఇస్తేనే ఉద్యోగంలో చేర్చుకోవాలి. నిజానికి జె.శ్రీనివాసరావుపై 2017లో నాటి తూర్పుగోదావరి జిల్లాలోని ముమ్మిడివరంలో ఓ కేసు నమోదైంది. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోపాటు పోలీసులు చార్జిషీట్ కూడా వేశారు. అంటే అతనికి నేర చరిత్ర ఉన్నట్టే. కానీ అతనిపై ఎలాంటి కేసులూ లేవని ఫ్యూజన్ ఫుడ్స్ యజమాని హర్షవర్ధన్ చౌదరి డిక్లరేషన్ ఇవ్వటం గమనార్హం. ఇంకా శ్రీనివాసరావుపై తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులూ లేవని, స్వస్థలంలో ఉన్నాయేమో చూడాలని విశాఖ ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్‌వోసీ ఇచ్చారు. కానీ స్వస్థలంలో కేసుల గురించి కనుక్కునే ప్రయత్నం ఎవ్వరూ చేయలేదు. దానికితోడు శ్రీనివాసరావుపై ఎలాంటి కేసులూ లేవంటూ హర్షవర్ధన్ చౌదరి తన సొంత ఎన్ఓసీ ఇచ్చేశారు. హత్యాయత్నం జరిగిన రోజున రామోజీరావు కూడా శ్రీనివాసరావుపై ఎలాంటి కేసులూ లేవంటూ 'ఈనాడు' ద్వారా ఎన్ఓసీ ఇచ్చేశారు. ఇంతటి కీలకమైన అంశంపై ఎన్ఐఏ దృష్టిసారించకపోవటమే పలు అనుమానాలకు తావిస్తోంది.

సీసీ టీవీ రికార్డింగులు ఎందుకు కోర్టుకు సమర్పించలేదు


ఈ కేసులో విమానాశ్రయంలో సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ అత్యంత కీలకం. ఎందుకంటే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే విమానాశ్రయంలోకి జె.శ్రీనివాసరావు హత్యాయత్నం చేయడానికి వాడిన కత్తిని ఎలా తీసుకువెళ్లారన్నది కీలకం. హత్యాయత్నానికి కంటే కొన్ని రోజుల ముందటి సీసీ టీవీ కెమెరాల రికార్డులను ఎన్ఐఏ ఆ కెమెరాల తయారీదారైన తోషిబా కంపెనీకి పంపించి విశ్లేషించింది. విమానాశ్రయం కిచెన్‌లో ఓ వంటపాత్రలో ఆ కత్తిని వేడిచేస్తున్నట్టుగా ఆ వీడియో క్లిప్పింగుల్లో ఉందని వెల్లడైంది. జె.శ్రీనివాసరావే ఆ కత్తిని వేడినీటిలో మరిగిస్తున్నట్టుగా వీడియో క్లిప్పింగుల్లో ఉంది. మరి ఆ విషయాన్ని ఎన్ఐఏ ఎందుకు కౌంటర్ అఫిడవిట్‌లో ప్రస్తావించలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. అంతటి కీలకమైన వీడియో క్లిప్పింగులను న్యాయస్థానానికి కూడా సమర్పించకపోవడం గమనార్హం.

నిందితుడి లేఖను కూడా సమర్పించనే లేదు...

ఈ కేసులో నిందితుడు జె.శ్రీనివాసరావు రాసిన లేఖ, ఇతర కాపీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఎన్ఐఏకు అప్పగించారు. తనకు ఏమైనా అయితే తన శరీర అవయవాలను దానం చేయాలని అతను రాసినట్టుగా ఉంది. తనకు ఏదైనా అవుతుందని జె.శ్రీనివాసరావు ముందే ఎలా ఊహిస్తారు... ! అంటే ఇదేమీ యాదృచ్ఛికంగానో అప్పటికప్పుడు హఠాత్తుగానో జరిగింది కాదన్నది సుస్పష్టం. ముందస్తుగానే కొందరితో కలిసి పన్నిన కుట్ర ప్రకారమే అంతా జరిగిందని... ప్లాన్‌తోనే ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని వెల్లడి కావటంలేదా? మరి అంతటి కుట్ర వెనుక ఎవరున్నారన్నది తెలుసుకోవాల్సిన అవసరం లేదా?

దర్యాప్తు ముగియనే లేదు కదా...!
అంత ఆత్రుత ఎందుకు రామోజీ?

హత్యాయత్నం వెనక ఉన్న కుట్రకోణాన్ని త్వరగా దర్యాప్తు చేసి తుది ఛార్జిషీటు వేయాల్సిందిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వేసిన పిటిషన్‌పై ప్రస్తుతం కోర్టు విచారణ జరుగుతోంది. ఈ విచారణలో భాగంగా ఎన్ఐఏను సమాధానమివ్వాలని కోర్టు కోరగా... దీనిపై ఎన్ఐఏ కౌంటర్ వేసింది. ఇది కౌంటర్ మాత్రమే తప్ప తుది ఛార్జిషీటు కాదు. తమ దర్యాప్తు ముగిసిందని కూడా చెప్పలేదు. ఈ కేసులో బాధితుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావించిన అంశాలను కౌంటర్లో ప్రస్తావించింది. దర్యాప్తు కొనసాగుతోందని చెప్పింది. కానీ దర్యాప్తు ముగిసిపోయినట్లు... ఇక దర్యాప్తు చేసేందుకు ఏమీ లేదని అన్నట్టుగా టీడీపీ అనుకూల పచ్చ మీడియా తెగ హడావుడి చేస్తోంది. నిందితుడు శ్రీనివాసరావు హత్యాయత్నం చేసినట్లు ఎన్ఐఏ ఎప్పుడో చెప్పింది. దానికి కారణాలు తేలాలి. ఆ దిశగా దర్యాప్తు సాగుతోంది. కారణాలు తెలిస్తే కుట్ర కోణమూ బయటపడుతుంది. కాకపోతే దర్యాప్తు కొనసాగుతుండగానే... ఇక కుట్ర కోణమేదీ లేదని ఎల్లో మీడియా తేల్చేసింది. ఎన్నాళ్లగానో తాము చేస్తున్న ప్రయత్నం ఫలించినట్లుగా... ఎన్ఐఏ కౌంటర్‌ను చూసి ఎల్లో మీడియా తెగ సంబరపడిపోయింది. ఎందుకింత ఆత్రం? దర్యాప్తు పూర్తికాకుండానే ఎందుకంత తొందర రామోజీ?




ఎల్లో సిండికేట్ తీరే అంత...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో ప్రజల్ని తప్పుదారి పట్టించడమే లక్ష్యంగా ఎల్లో సిండికేట్ మొదటి నుంచీ వ్యవహరిస్తూ వస్తోంది. ఈ ఘటన జరిగిన వెంటనే అప్పటి డీజీపీగా ఉన్న ఆర్పీ ఠాకూర్ హడావుడిగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి నిందితుడు జె.శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ అభిమాని అని ప్రకటించేశారు. కేవలం సానుభూతి కోసమే ఈ హత్యాయత్నానికిపాల్పడ్డారని బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న డీజీపీ ఏకపక్షంగా ప్రకటించడం అప్పట్లో అందరినీ నివ్వెరపరిచింది. నిజానిజాలు వెలికితీస్తాం అని ప్రకటించాల్సిన ఆయన... చంద్రబాబు డైరెక్షన్ మేరకు అడ్డగోలు అబద్ధాలు చెప్పారు. ఈ కేసు దర్యాప్తు చేసే కింది స్థాయి పోలీసు అధికారులను ప్రభావితం చేసేందుకే ఆయన అలా ప్రకటించారన్నది సుస్పష్టం.

వైఎస్ జగన్‌కు తీవ్రమైన గాయం అయ్యింది. ఆ కత్తి మెడలో దిగి ఉండే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చేదని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలో కూడా అదే విషయాన్ని పేర్కొన్నారు. కానీ గాయం చిన్నదే అని నాటి డీజీపీ, చంద్రబాబు, 'ఈనాడు' కట్టగట్టుకుని ప్రచారం చెయ్యడాన్ని ఏమనుకోవాలి?

మళ్లీ అదే తతంగం


ఇక తాజాగా ఎన్ఐఏ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాల విషయంలోనూ ఎల్లో మీడియా ఇదే పంథా ఎంచుకుంది. హత్యాయత్నం వెనక ఎలాంటి రాజకీయ కుట్ర లేదని నిర్ధారణ అయినట్టుగా కథనాలు ప్రచురించి తన దుర్బుద్ధిని చాటుకుంది. ఎన్ఐఏ కౌంటర్ అఫిడవిట్‌లోని అంశాలను సవాల్ చేస్తూ బాధితుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. అందుకోసం న్యాయస్థానం గడువు ఇస్తూ కేసు విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది. జగన్ తరఫు న్యాయవాది వేసే కౌంటర్లోని అంశాలను న్యాయస్థానం పరిగణలోకి తీసుకున్నాక విచారణ ప్రక్రియ సాగుతుంది. మరోవైపు ఎన్ఐఏ దర్యాప్తు కూడా ఇంకా పూర్తి కాలేదు. తుది నివేదిక రావాలి. ఇవేవీ పట్టించుకోకుండా కేసు దర్యాప్తు ముగిసినట్టే అనే భ్రాంతి కలిగించేలా పచ్చ మీడియా హడావుడి చేస్తుండటమే అసలైన కుట్ర!!.



01/2019/NIA/HYD Date: 17.01.2019

...atement of Shri Y. S. Jagan Mohan Reddy, Aged 47 years S/o Late Shri Y. S. Rajasekhar Reddy, R/o- Plot No.3/4, Opposite Lotus Pond, HUDA Heights, MLA Colony, Road No.12, Banjara Hills, Hyderabad U/s 161 of CrPC, recorded at above mentioned address.

హర్షవర్ధన్ చౌదరి పాత్రను, తెలుగుదేశంతో ఆయన సంబంధాలను, ఈ కుట్రపై దర్యాప్తు జరగాల్సిన అవసరాన్ని పేర్కొంటూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం.



CHARGE SHEET

RC-01/2019/NIA/HYD

[JAGAN MOHAN REDDY CASE]

17.9. Accused wearing the uniform of Fusion Foods Restaurant entered the VIP lounge with a water bottle in his hand to avoid being stopped by the security personnel at the entrance of the Lounge. He stood on the left hand side of Shri Y.S. Jagan Mohan Reddy. The accused waited for the opportune moment and attacked Shri Y.S. Jagan Mohan Reddy and attempted to stab him on his neck with a sharp knife with intention to kill him and in the

నిందితుడు శ్రీనివాసరావు ఫ్యూజన్ ఫుడ్స్ యూనిఫామ్ వేసుకుని, వాటర్ బాటిల్‌తో వీఐపీ లాంజ్‌లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పక్కన నిల్చుని అవకాశం కోసం చూశాడని, అవకాశం దొరికిన వెంటనే పదునైన కత్తితో హతమార్చుదామని అనుకున్నాడని.. ఈ క్రమంలోనే జగన్‌మోహన్‌రెడ్డి వేగంగా పక్కకు తప్పుకోవటంతో భుజానికి గాయం అయిందని ఛార్జిషీట్లో పేర్కొన్న ఎన్ఐఏ.

18.4 Investigation into conspiracy and abetment, if any, relating to attack on Shri Y.S.Jagan Mohan Reddy continues under section 173(8) of CrPC.

ఈ కేసులో కుట్ర కోణాన్ని, నిందితుడిని ప్రేరేపించిన పరిస్థితులుంటే వాటిని కూడా దర్యాప్తు చేస్తామని తొలి ఛార్జిషీట్లో కోర్టుకు చెప్పిన ఎన్ఐఏ.

క్లుప్తంగా...

దళిత వ్యతిరేకులు చంద్రబాబు, లోకేశ్

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కైలే అనిల్ కుమార్



సాక్షి ప్రతినిధి, విజయవాడ/ సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్ దళిత వ్యతిరేకులని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చెప్పారు. దళితులను వారు మనుషుల్లా చూసే పరిస్థితి లేదని అన్నారు. అనిల్‌కుమార్ శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో లోకేశ్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా డాక్టర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు జరుపుకొంటుంటే.. వారు మాత్రం దళితులను కించపరుస్తున్నారని అన్నారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకొంటారని, బోస్టన్ రిపోర్ట్ చదవడానికి ఆ విజయ్‌కుమార్ గాడు (దళిత ఐఏఎస్) ఎవడని, సీఎం జగన్, హోం మంత్రి, డీజీపీ అంతా క్రిస్టియన్‌లే అని చంద్రబాబు మాట్లాడారని చెప్పారు. టీడీపీ నేతలు కూడా ఇదే విధంగా మాట్లాడారన్నారు. తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొన్న లోకేశ్ దళితులు పీకింది ఏమి లేదు, పొడిచింది ఏమి లేదంటూ అవమానకరంగా మాట్లాడారని మండిపడ్డారు. తండ్రీ కొడుకులకు దళితులంటే వివక్ష, అసహ్యమని అన్నారు. ఇప్పటికే గత ఎన్నికల్లో చంద్రబాబు, లోకేశ్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని, 2024లోనూ దళితులంతా సత్తా చూపి, పొడిచేదెవరో పీకేదెవరో తేలుస్తారని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు దళితులంటే గౌరవం ఉందని, ఆయన నేతృత్వంలో దళితులు ఆత్మగౌరవంతో తలెత్తుకు తిరుగుతున్నారని తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో దళితుల హక్కులను తూచా తప్పకుండా సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారన్నారు.

ప్రజల ఆస్తి కరిగిపోతోంది

- సీఎం జగన్ ఆస్తి పెరుగుతోంది
- పాదయాత్రలో లోకేశ్ ఆరోపణ

ప్యాపిలి/కర్నూలు (అర్బన్): రాష్ట్ర ప్రజల ఆస్తి కరిగిపోతుంటే, సీఎం జగన్ ఆస్తి మాత్రం పెరిగిపోతోందని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. 30 మంది సీఎంలకు రూ.వెయ్యి కోట్ల ఆస్తి ఉంటే, ఒక్క జగన్‌కే అందులో 51 శాతం ఆస్తి ఉందని చెప్పారు. అందుకే జగన్ పేరును రిచ్ మోహన్‌గా మార్చానన్నారు. ఉద్యోగాలు ఇస్తే యువత ఎక్కడ రిచ్ అయిపోతారో అని రిచ్ మోహన్‌కు భయమన్నారు. నంద్యాల జిల్లా ప్యాపిలిలో శుక్రవారం లోకేశ్ రెండో రోజు పాదయాత్ర కొనసాగించారు. కలచట్ల రోడ్డులోని టమాట మార్కెట్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. సీఎం జగన్ జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని, 2.30 లక్షల ఉద్యోగాలూ ఇవ్వలేదన్నారు. రిచ్ మోహన్ ధన దాహం ఇంకా తీరలేదని, మద్యం ప్రవాహంతో మహిళల తాళి బొట్లు కూడా కొట్టేస్తున్నాడన్నారు. రైతులను కూడా దోచేస్తున్నాడని.. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు, నకిలీ పురుగు మందులు అన్నీ జగన్ బ్రాండ్లేనని చెప్పారు.

అడుగడుగునా అక్కసు

డోన్ నియోజకవర్గంలో దేవుని మాన్యాన్ని టీడీపీ నేతలు అమ్ముకుంటుంటే దానిని వైఎస్సార్‌సీపీ నేతలపైకి లోకేశ్ నెట్టారు. మైనింగ్ యజమాని లద్దగిరి శీను హత్యోదంతంలో నిందితులంతా టీడీపీ వారే అయినా దీన్నీ వైఎస్సార్‌సీపీ నేతలకు అంటగట్టారు. మంత్రి బుగ్గన చొరవతో ప్యాపిలిలో నిర్మిస్తున్న నాలుగు లైన్ల ప్రధాన రహదారిపై నడిచిన లోకేశ్.. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ రహదారి పనులను పూర్తి చేస్తానని చెప్పడం నవ్వులు పూయించింది. తనపై 'సాక్షి' అసత్య కథనాలు రాస్తోందని అక్కసు వెళ్లగక్కారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి



తిరుపతి 45వ డివిజన్‌లో స్టిక్కర్ అతికిస్తున్న తిరుపతి డిప్యూటీ మేయర్లు భూమన అభినయరెడ్డి, ముద్రనారాయణ



విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీలో స్టిక్కర్లు అంటిస్తున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ప్రతి ఇంటా జగన్నినాదం

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ఎనిమిదో రోజూ విశేష స్పందన

- సొంతింటి కలను సీఎం సాకారం చేశారంటూ ప్రశంసలు
- ఇంటి వద్దే పింఛన్ అందిస్తూ బాసటగా నిలిచారన్న అవ్వాతాతలు
- మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినదిస్తున్న అన్ని వర్గాల ప్రజలు
- ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ 43 లక్షల కుటుంబాలకుపైగా మిస్డ్ కాల్స్



అనకాపల్లి జిల్లా రావికమతంలో స్టిక్కర్ అతికిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామంలో స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో 46 నెలల్లో సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరించడం.. ప్రభుత్వంపై విపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. శుక్రవారం ఎనిమిదో రోజు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు ప్రతి ఇంటా ఆ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. టీడీపీ సర్కార్‌కూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలను వివరిస్తూ కరపత్రాన్ని కుటుంబ సభ్యులకు గృహ సారథులు అందించారు. సొంతిల్లు నిర్మించుకోవాలనే కలను సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారని.. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికిపైగా ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని అక్కచెల్లెమ్మలు ప్రశంసించారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ ఎప్పుడిస్తారో తెలిసేదే కాదని ఎత్తిచూపుతూ.. ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకు వచ్చి వలంటీరు రూ.2,750 చొప్పున పింఛన్ అందిస్తున్నారని అవ్వాతాతలు సీఎం వైఎస్ జగన్‌ను అభినందించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని సీఎం వైఎస్ జగన్ వేగవంతం చేసి.. ఉపాధి అవకాశాలను మెరుగుపర్చారని అన్నదమ్ములు ప్రశంసించారు.

సీఎం వైఎస్ జగన్‌కు పెరుగుతున్న మద్దతు

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గృహ సారథులు మెగా ప్రజా సర్వేను నిర్వహిస్తున్నారు. టీడీపీ సర్కార్‌కూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలను వివరిస్తూ ఐదు ప్రశ్నలను అడిగి.. కుటుంబ సభ్యులు చెప్పిన అభిప్రాయాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత ఆ కుటుంబ సభ్యులకు రసీదు ఇస్తున్నారు. ఆ తర్వాత ప్రజలు వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తున్నారు. ఆ వెంటనే సీఎం వైఎస్ జగన్ సందేశంతో ఐవీఆర్‌ఎస్ కాల్ రాగానే కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఏడు రోజుల్లో అంటే గురువారం నాటికి 55 లక్షల కుటుంబాలను జగనన్న సైన్యం నేరుగా కలిసింది. అందులో 43 లక్షల కుటుంబాలకు చెందిన ప్రజలు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960 82960 నెంబర్‌కు మిస్డ్ కాల్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమం కొనసాగుతున్న కొద్దీ సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల మద్దతు పెరుగుతోంది.

ప్రతిపక్షాలకు ముచ్చెమటలు: ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి



'జగనన్నే మా భవిష్యత్ అంటూ అధికార వైఎస్సార్ సీపీ చేపట్టిన మేగా పీపుల్స్ సర్వే ఆంధ్ర రాజకీయాల్లో కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తోంది. ప్రతిపక్షాలకు ముచ్చెమటలు పట్టిస్తోంది. ఎన్నికలనగానే సాధరణంగా గుర్తొచ్చేది పాదయాత్రలు, రోడ్ షోలు ,ప్రచారార్భాటాలు. కానీ వీటన్నిటికీ భిన్నంగా.. గత ప్రభుత్వంతో బేరీజు వేస్తూ మా పరిపాలన ఎలా ఉందో చెప్పండి.. ఇదీ మా ప్రభుత్వంలో మీకు జరిగిన మేలు.. మా ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు సంక్షేమ పథకాల కింద నేరుగా ప్రజల ఖాతాల్లోకి వేసింది.. పాలనపై అవసరమైతే సలహాలివ్వండి తీసుకుంటాం.. అంటూ నిర్వహిస్తోన్న ఈ సర్వేకు అనూహ్య స్పందన లభిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి తాడేపల్లిలోని సైన్స్ సిటీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 175 నియోజకవర్గాల పరిధిలోని 15 వేల సచివాలయాల్లో చేపట్టిన మేగా పీపుల్స్ సర్వే ఉవ్వెత్తున ఎగసిపడే ఉద్యమ కెరటంలా ముందుకు సాగుతోందన్నారు. రోజు రోజుకు ప్రజల నుంచి వస్తోన్న స్పందన, ఆదరణ చూసి విపక్షాలు బెంబేలెత్తిపోతున్నాయని చెప్పారు. వాడవాడలా మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదం హోరెత్తుతోందన్నారు. కేవలం ఆరు రోజుల్లో 43 లక్షల కుటుంబాలు మిస్డ్ కాల్స్ ద్వారా జగనన్నకు మద్దతు తెలపటం చిన్న విషయం కాదన్నారు. ఈ కార్యక్రమం పార్టీ క్యాడర్‌కు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదాలతో షేర్ అవుతున్న ఫోటోలు, వీడియోలే ఇందుకు నిదర్శనం అని చెప్పారు.

సీఎం మేలును ఎప్పటికీ మరిచిపోం..



తన ఇంట్లో దేవుని మందిరంలో సీఎం జగన్ స్టిక్కర్ ఉంచిన వెంకటేశ్వరరావు

భీమడోలు: అన్ని విధాలా మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు భగవంతునితో సమానం అని, అందుకే ఆయన ఫొటోను దేవుడి గదిలో ఉంచామని ఏలూరు జిల్లా భీమడోలు మండలం పోలసానిపల్లిలోని బీసీ కాలనీకి చెందిన సారిక వెంకటేశ్వరరావు చెబుతున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి ప్రభుత్వ పనితీరు వివరించారు. వాకిలికి 'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్ అంటించబోగా.. 'ఈ ప్రభుత్వం చాలా బాగా పని చేస్తోంది. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. మా అమ్మకు పింఛన్, నా భార్యకు చేయూత, పిల్లలకు విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా లబ్ధి పొందాము. ఇంత మేలు చేసిన సీఎంను మేం ఎప్పటికీ మరచిపోము. అందుకే ఆయన ఫొటోను అంటించాల్సింది ఇక్కడ కాదు' అంటూ ఇటివ్వండని తీసుకుని దేవుడి గదిలో అంటించారు. ఇప్పుడు తనకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

చిట్టి తల్లులకు 'స్వేచ్ఛ'

- విద్యార్థినుల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంలో దేశంలోనే ఏపీ అగ్రగామి
- 2021–22లో 1.16 కోట్ల శానిటరీ నాప్‌కిన్లు ఉచితంగా పంపిణీతో రాష్ట్రానికి రెండోస్థానం
- మెన్‌స్ట్రువల్ హైజీన్ కార్యక్రమాల అమలులో కూడా..
- స్వేచ్ఛ కార్యక్రమం కింద ఏడు నుంచి ఇంటర్ వరకు విద్యార్థినులకు ప్రభుత్వం అందజేత
- 10 లక్షల మంది విద్యార్థినులకు ప్రతినెలా 10 చొప్పున పంపిణీ
- నెలసరి సమయంలో అపరిశుభ్ర పద్ధతులతో ఎదురయ్యే సమస్యలపైనా అవగాహన



తమకు అందించిన శానిటరీ నాప్‌కిన్‌లను చూపుతున్న బాలికలు

సాక్షి, అమరావతి: రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. రేపటి పౌరులైన కిశోర బాలికల ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. సమర్థవంతంగా మెన్‌స్ట్రువల్ హైజీన్ (బహిష్టు సమయంలో పరిశుభ్రత) కార్యక్రమాల అమలులో కూడా మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంటోంది. ఈ అంశాన్ని ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. నెలసరి సమయంలో స్కూళ్లు, కళాశాలల్లో చదివే విద్యార్థినులు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 'స్వేచ్ఛ' కార్యక్రమం ద్వారా శానిటరీ నాప్‌కిన్లను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఇలా 2021–22లో 1.48 కోట్ల శానిటరీ నాప్‌కిన్ల పంపిణీతో తమిళనాడు దేశంలో మొదటి స్థానంలో ఉండగా, 1.16 కోట్లతో ఏపీ రెండో స్థానంలో ఉంది.

ప్రతీనెలా 10 లక్షల మంది బాలికలకు..

రుతుక్రమం ఇబ్బందులతో బాలికలు స్కూలుకు దూరమవుతున్న పరిస్థితులను సీఎం జగన్ ప్రభుత్వం గుర్తించింది. డ్రాపౌట్స్‌ను తగ్గించడంతో పాటు, బాలికలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా స్వేచ్ఛ కార్యక్రమాన్ని 2021లో ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఏడు నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న 10,01,860 మంది బాలికలకు ప్రతినెలా 10 నాణ్యమైన, బ్రాండెడ్ శానిటరీ నాప్‌కిన్లను ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏటా ప్రభుత్వం రూ.30 కోట్ల మేర ఖర్చుచేస్తోంది. అంతేకాక.. ఎదుగుతున్న సమయంలో శరీరంలో వచ్చే మార్పుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళా ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఫ్యామిలీ డాక్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేకంగా అడోలసెంట్ ఫ్రెండ్లీ క్లినిక్‌లు..

ఇక కౌమార దశలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల నివృత్తికి,వైద్యసేవలు అందించేందుకు అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అడోలసెంట్ ఫ్రెండ్లీ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు.

అపరిశుభ్ర పద్ధతులతో సమస్యలివే..

- నెలసరిలో వస్త్రాన్ని వాడే విధానాన్ని అపరిశుభ్ర పద్ధతిగా వైద్యులు చెబుతారు. ఇలా వాడటంతో జననాంగం సంబంధిత ఇన్ఫెక్షన్లు వస్తాయి.
- జననాంగంలో రక్షణకు అవసరమైన హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను స్రవించే లాక్టోబాసిల్లై అనే మంచి బ్యాక్టీరియాతో పాటు కొద్దిమోతాదులో వేరే బ్యాక్టీరియా కూడా ఉంటుంది. వస్త్రం వంటి అపరిశుభ్ర పద్ధతులతో జననాంగం సంబంధిత ఇన్ఫెక్షన్ల ముప్పు ఏర్పడ్డాక సంతానలేమి, శృంగారంతో ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధులొస్తాయి. హానికరమైన బ్యాక్టీరియాతో యూరినరీ ఇన్ఫెక్షన్ కూడా వస్తుంది. సంతానలేమి సమస్యలు తలెత్తుతాయి.

చాలా మార్పు కనిపిస్తోంది



ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థినుల్లో చాలామంది పేద కుటుంబాలకు చెందినవారే. వీరు నెలసరిలో పాఠశాలకు గైర్హాజరయ్యే వారు. ప్రస్తుతం ప్రభుత్వమే ఉచితంగా శానిటరీ నాప్‌కిన్లు ఇస్తోంది. పాఠశాలల్లో బాత్‌రూమ్‌లు, ఇతర వసతులు మెరుగుపడ్డాయి. దీంతో గతంతో పోలిస్తే గైర్హాజరు తక్కువగా ఉంటోంది.

– కేవీ పద్మావతి, ఉపాధ్యాయురాలు, అడవివరం, జెడ్పీ ఉన్నత పాఠశాల, విశాఖపట్నం

ప్రతి స్కూల్‌లో అంబాసిడర్లుగా ఇద్దరు టీచర్లు



మెన్‌స్ట్రువల్ హైజీన్ కార్యక్రమాలను విద్యా సంస్థల్లో నిర్వహించడానికి ప్రతి విద్యాసంస్థలో ఇద్దరు టీచర్లను హెల్త్, వెల్‌నెస్ అంబాసిడర్లుగా గుర్తించారు. వీరితోపాటు మెడికల్ ఆఫీసర్లకు ఎయిమ్స్ వైద్యుల ద్వారా మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై శిక్షణ ఇప్పించాం. వీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నారు.

– డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్, అడిషనల్ డైరెక్టర్ వైద్య శాఖ

తప్పు చేసిన పోలీసులను బొక్కలో వేస్తాం

- మనుషుల కంటే కుక్కలు తెలివైనవి
- అందుకే రాష్ట్రంలో డాగ్ స్క్వాడ్ తెచ్చాను
- ఆడబిడ్డలకు నాయకత్వం ఇచ్చింది టీడీపీనే
- కొల్లు రవీంద్ర అత్యాచారం చేశాడట..
- నూజివీడు సభలో చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/నూజివీడు/ హనుమాన్ జంక్షన్ రూరల్: 'పోలీసులకు సంస్కారం నేనే నేర్పించా.. మీపై సైకో ఆఫీసర్ల పెత్తనం ఎక్కువగా ఉంది. కొంత మంది తప్పులు చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి కేసునూ సమీక్షించి తప్పు చేసిన పోలీసులను బొక్కలో వేస్తాం' అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి 'ఇదేమి కర్మ – మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా నూజివీడులో రోడ్‌షో నిర్వహించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి అంతా తాను చేసిందేనని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర గురించి మాట్లాడుతూ.. నోట్లో వేలు పెడితే కొరకడం కూడా చేతగాని అమాయకుడు కొల్లు రవీంద్ర అని అన్నారు. అలాంటి రవీంద్ర అత్యాచారం చేశాడంటా.. ఎవరినో చంపేశాడంట.. అని వ్యాఖ్యానించడంతో పక్కడే ఉన్న కొల్లు రవీంద్ర అవాక్కయ్యారు. 'మనుషుల కంటే కుక్కలే చాలా తెలివైనవి. అందుకే నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోలీస్ శాఖలో డాగ్ స్క్వాడ్‌ను తీసుకువచ్చాను. తెలుగుదేశం పార్టీ ఆడబిడ్డలకు నాయకత్వం ఇచ్చింది. డ్వాక్రాకు శ్రీకారం చుట్టి పొదుపు ఉద్యమం తెచ్చింది నేనే. ఆడబిడ్డలను కండక్టర్లుగా కూడా చేసిన ఘనత నాదే' అని అన్నారు. రామోజీరావుకు చెందిన మార్గదర్శిపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. 2004లో ముఖ్యమంత్రి ఆస్తి రూ.1.70 కోట్లు అయితే ఇప్పుడు రూ.510 కోట్లని, ఇదంతా షెల్ కంపెనీలు, హవాలా డబ్బుల ద్వారానే వచ్చిందన్నారు. గీతం యూనివర్సిటీపై కబ్జా కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు.



చంద్రబాబు రాక నేపథ్యంలో జనం లేక వెలవెలబోతున్న జంక్షన్ సెంటర్

తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం..

సీతారామపురానికి చెందిన దాదాపు 30 మంది టాటా ఏస్ వాహనంలో టీడీపీ జెండాలతో నూజివీడు సభకు వచ్చారు. జంక్షన్ రోడ్డులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ పక్కనే ఉన్న పెట్రోలు బంకు వద్ద వారు ఒక్కసారిగా జెండాలను పైకి ఎత్తారు. జెండా పైపులకు పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో సీతారామపురానికి చెందిన దుడ్డి సువార్త (60)కు తీవ్ర గాయాలయ్యాయి. మరో తొమ్మిది మంది స్వల్పంగా గాయపడ్డారు.

చంద్రబాబు సభ అట్టర్ ఫ్లాప్

చంద్రబాబు నూజివీడు బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయింది. ఆయన వేదిక వద్దకు రాత్రి 8.50 గంటలకు వచ్చారు. అప్పటికే వచ్చిన వారిలో అత్యధికులు ఇంటిదారి పట్టారు. కొందరు కార్యకర్తలు 'నెక్ట్స్ సీఎం జూనియర్ ఎన్టీఆర్' అంటూ ఫ్లెక్సీని ప్రదర్శించారు. చంద్రబాబు గుడివాడ నుంచి నూజివీడు వచ్చే మార్గంలో తుక్కులూరు వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు బాబును ప్రశ్నిస్తూ ఫ్లెక్సీలు పెట్టారు. చంద్రబాబుకు గానీ, దత్తపుత్రుడికి గానీ 175 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యముందా అని ప్రశ్నించారు. హనుమాన్ జంక్షన్ వద్ద కూడా బాబుకు చేదు అనుభవం ఎదురైంది. 'అయ్యా చంద్రబాబూ.. మాకెందుకీ కర్మ.. మీకెందుకు ఘన స్వాగతం' 'బైబై బాబు' అనే ఫ్లెక్సీలు కట్టారు. ఇలా అడుగడునా ఫ్లెక్సీలు దర్శనమివ్వడంతో చంద్రబాబు నొచ్చుకున్నట్లు సమాచారం. కాగా, బాపులపాడు మండలం ఆరుగొలను వద్ద టీడీపీ నేతలు.. అంబేడ్కర్ జయంతి నిర్వహిస్తున్న దళితులపై దాడి చేశారు.



నూజివీడులో చంద్రబాబు ప్రసంగిస్తుండగా ఖాళీగా ఉన్న ప్రాంగణం



బాపులపాడు మండలం కానుమోలు వద్ద చంద్రబాబును ప్రశ్నిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అత్తారిల్లు.. బస్సులో నిద్ర!

- **నిమ్మకూరులో ఎన్టీఆర్ విగ్రహం పెట్టలేని వ్యక్తి ఉత్సవాలు జరపడమా?**
- ఆయన బస చేయడానికి ఏ ఒక్కరూ ఇల్లు ఇవ్వలేదు
- బాబు పక్కన కమ్మవారు మినహా ఇతరులు ఉండకూడదా?
- గుడివాడలో ఆయన పెట్టింది కమ్మవారి మీటింగే
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు ఏమయ్యారు?
- మాజీ మంత్రి కొడాలి నాని ధ్వజం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నిమ్మకూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని పెట్టలేని చంద్రబాబు ఉత్సవాలు జరపడమా? అని మాజీ మంత్రి కొడాలి నాని ఎద్దేవా చేశారు. ఆయన నిమ్మకూరు వచ్చి శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామంటే ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. 42 ఏళ్ల తర్వాత అత్తారింటికి నిమ్మకూరు వచ్చిన చంద్రబాబు బస్సులో నిద్రించాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు నిద్రించడానికి నిమ్మకూరులో కనీసం ఎవరూ ఇల్లు కూడా ఇవ్వలేదని, అది ఆయన పరపతి అని పేర్కొన్నారు. కొడాలి నాని శుక్రవారం గుడివాడలో మీడియాతో మాట్లాడుతూ ఇన్నేళ్లుగా ఎన్టీఆర్ విగ్రహాన్ని చంద్రబాబు ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. నిమ్మకూరులో జూనియర్ ఎన్టీఆర్, తాను విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. నందమూరి హరికృష్ణ ఎంపీగా ఉన్నప్పుడు రూ.14 కోట్లతో నిమ్మకూరును అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ జన్మ స్థలమైన నిమ్మకూరుపై ప్రేమాభిమానాలున్న వ్యక్తులు కేవలం హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ మాత్రమేనన్నారు.

రెండెకరాల బాబుకు వేల కోట్ల ఆస్తులా?

చంద్రబాబు తన సతీమణి ఆస్తులను ఎందుకు చెప్పడం లేదని కొడాలి నాని ప్రశ్నించారు. రెండెకరాల నుంచి అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం చంద్రబాబు ఆస్తి రూ.668 కోట్లకు ఎలా పెరిగిందో సమాధానం చెప్పాలన్నారు. క్రైస్తవులపై విమర్శలు చేసిన చంద్రబాబు సిగ్గు లేకుండా పాస్టర్లతో మీటింగ్ ఎలా పెట్టారని నిలదీశారు.

బాబు ప్రచారం చేస్తే ఓటమే

చంద్రబాబు గుడివాడలో ఎవరి కోసం ప్రచారం చేసినా ఓడిపోవడమే జరుగుతుందని కొడాలి నాని వ్యాఖ్యానించారు. దేవుడి దయవల్ల చంద్రబాబు తన తరఫున ప్రచారం చేయలేదు కాబట్టే గెలిచానన్నారు. వచ్చే ఎన్నికల్లో గుడివాడలో టీడీపీ ఓటమి ఖాయ మన్నారు. జిత్తులమారి నక్క లాంటి చంద్రబాబు గుడివాడకు చేసిందేమీ లేదన్నారు. నాడు దివంగత వైఎస్సార్, ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ గుడివాడలో పేదల ఇళ్ల కోసం భూములు కొనుగోలు చేశారని చెప్పారు. టిడ్కో ఇళ్లతో కలిపి 23 వేల మంది సొంతింటి కలను నెరవేర్చనున్నట్లు తెలిపారు.

ఇదే నా సవాల్..

చంద్రబాబు గుడివాడలో పేదల కోసం ఒక్క ఎకరమైనా కొన్నట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని కొడాలి నాని సవాల్ చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు గుడివాడలో ఫ్లైఓవర్ ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రూ.16 కోట్లతో సైడు కాల్వలతో కలిపి రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. పేదల ఇళ్ల స్థలాల కోసం సీఎం జగన్ రూ.600 కోట్లు వ్యయం చేస్తున్నారని తెలిపారు. గుడివాడకు మంచినీటి సదుపాయం కల్పించింది వైఎస్సార్ మాత్రమేనన్నారు. మూడు మండలాల్లో తాగునీటి సమస్య తీర్చడానికి రూ.130 కోట్లతో టెండర్లు సిద్ధం చేశామన్నారు. రూ.23 కోట్లతో బస్టాండ్ నిర్మిస్తున్నామని, రూ.15 కోట్లతో ఆసుపత్రిని ప్రారంభిస్తామన్నారు. మే నెలలో సీఎం జగన్ బందరు పోర్టుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ చరిత్ర పునరావృతమవుతుందని, చంద్రబాబు, లోకేష్ ఓటమి ఖాయమని చెప్పారు.

మేకప్ కోసం మూడు చోట్ల బస్సు ఆపి..

గుడివాడలో రాత్రి మేకప్ వేసుకునేందుకు చంద్రబాబు మూడుచోట్ల బస్సు ఆపారని కొడాలి నాని పేర్కొన్నారు. కులమతాల సమ్మేళనం లాంటి గుడివాడలో పర్యటన సందర్భంగా చంద్రబాబు బస్సుపై ఉన్న నలుగురూ కమ్మవారేనని చెప్పారు. అలాంటప్పుడు అది కమ్మ వారి కుల మీటింగ్ అవుతుందే కానీ ప్రజల మీటింగ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. 'కొనకళ్ల నారాయణ, అచ్చెన్నాయుడు ఏమయ్యారు? మొన్న గెలిచిన ఎమ్మెల్సీ అనురాధ ఎక్కడ? చంద్రబాబు పక్కన కమ్మవారు మినహా మరొకరు ఉండకూడదా? అని విమర్శించారు. బస్సులోకి వెళ్లి గంట గంటకూ గంజాయి దమ్ము కొట్టొచ్చేది చంద్రబాబేనన్నారు. 'నాకు చంద్రబాబు రాజకీయ జీవితాన్ని ఇస్తే మరి ఆయనకు ఇచ్చిందెవరు? రాజకీయ జీవితం ప్రసాదించిన ఇందిరాగాంధీ, ఎన్టీఆర్‌ను చంద్రబాబు ఏం చేశారో అందరికీ తెలుసు' అని చెప్పారు.

క్లుప్తంగా...

కేజ్రీవాల్‌కు సీబీఐ సమన్లు
లిక్కర్ స్కామ్‌లో ఆదివారం విచారణకు హాజరు కావాలని ఆదేశం



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించి ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సీబీఐ శుక్రవారం సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఆదివారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరవాలని ఆదేశించింది. సాక్షిగా ఆయన్ను ప్రశ్నించనున్నట్లు సీబీఐ అధికారులు తెలియజేశారు. ఈ కేసులో కేజ్రీవాల్ సాక్షేనా, నిందితుడా అనేది చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాతే నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సీబీఐ ఇప్పటికే అరెస్టు చేయడం తెలిసిందే. ఆదివారం కేజ్రీవాల్ విచారణకు హాజరవుతారని ఆప్ వెల్లడించింది. ఆయనను కుట్రపూరితంగానే విచారణకు పిలుస్తున్నారని ఆరోపించింది. సిసోడియా సెల్‌ఫోన్లు ధ్వంసం చేశారంటూ కోర్టుకు ఈడీ అబద్ధాలు చెబుతోందని ఆప్ నేత సంజయ్ సింగ్ ఆరోపించారు. ఆయన ఏ ఫోన్‌ను ధ్వంసం చేయలేదన్నారు. ఈడీ పేర్కొంటున్న 14 ఫోన్లూ పనిచేస్తుండగా వాటిలో 5 ఫోన్లు ఈడీ, సీబీఐ స్వాధీనంలోనే ఉన్నాయని చెప్పారు. దర్యాప్తును ఈడీ అపహాస్యం చేస్తోందని విమర్శించారు. సిసోడియా ఫోన్లను ధ్వంసం చేశారని ఆరోపిస్తున్న బీజేపీ నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆయుధాలు అమ్మబోం: చైనా
బీజింగ్: ఏడాదికి పైగా యుద్ధంలో తలమునకలైన రష్యా, ఉక్రెయిన్లలో ఎవరికీ ఆయుధాలు విక్రయించబోమని చైనా ప్రకటించింది. చైనా మిత్ర దేశమైన రష్యా యుద్ధం కారణంగా సాయుధ సంపత్తిని భారీగా కోల్పోవడం తెలిసిందే. దాంతో రష్యాకు చైనా భారీగా ఆయుధాలు సరఫరా చేయవచ్చని పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. అలాంటి ఉద్దేశమేమీ తమకు లేదని చైనా విదేశాంగ మంత్రి క్విన్ కాంగ్ శుక్రవారం ప్రకటన చేశారు. పౌర, సైనిక వాడకం రెండింటికీ పనికొచ్చే వస్తువులను రష్యాకు ఎగుమతి చేయడంపైనా నియంత్రణ విధిస్తామన్నారు. యుద్ధంలో తమది తటస్థ పాత్ర అని ఆయన స్పష్టం చేశారు. కాకపోతే యుద్ధం మొదలైనప్పటి నుంచీ రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా రష్యాకు చైనా మద్దతుగానే నిలుస్తూ వస్తోంది. పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆంక్షల నేపథ్యంలో చైనా దన్ను రష్యాకు ఎంతగానో ఆసరా అయింది. అదే క్రమంలో రష్యాకు ఆయుధాలు కూడా సమకూర్చేందుకు చైనా సన్నద్ధమవుతున్నట్టు తమకు నిఘా సమాచారముందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇటీవల పేర్కొనడం తెలిసిందే.



ఎస్.రాజమహేంద్రారెడ్డి

సచిన్ పైలట్‌కు హఠాత్తుగా కోపం వచ్చింది. నాలుగున్నరేళ్లుగా లోలోపల రగిలిపోతున్న అసంతృప్తిని ఒకే ఒక్క చర్యతో బలంగా బహిర్గతం చేశారు. ఎంత బలంగా అంటే, కాంగ్రెస్ అధిష్టానం కంగుతినేంతగా! రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ ఉక్కిరిబిక్కిరయ్యేంతగా! మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజె అవినీతిపై విచారణకు ఆదేశించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటూ గహ్లోత్ తీరును బాహాటంగానే దుయ్యబట్టిన పైలట్ ఈ నెల 11న ఏకంగా ఒక రోజు నిరసన దీక్షకు కూడా కూర్చున్నారు! అధిష్టానం హెచ్చరించినా, బుజ్జగించినా ఆయన ససేమిరా అన్నారు. దీన్ని ఏమీ పట్టించుకోనట్టుగా గహ్లోత్ పైకి గాంభీర్యం ప్రదర్శించినా లోలోపల తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. స్వపక్షీయుడే అయిన మాజీ కేంద్ర మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం అయిన పైలట్ ప్రతిపక్షంలా తనపైనే దాడికి దిగడం గహ్లోత్‌కు అసలు మింగుడు పడలేదు. ఎవరేమనుకున్నా ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముఖ్యమంత్రి కావాలన్న తన లక్ష్యాన్ని పైలట్ కాస్త గట్టిగానే వినిపించారు. ఒకవిధంగా ఒకే దెబ్బకు రెండు పిట్టల్ని కొట్టారన్నమాట! సీఎం పదవిపై ఉన్న కాంక్షను వెలిబుచ్చడం ఒకటైతే, ప్రస్తుత ముఖ్యమంత్రి గహ్లోత్, మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజెల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాన్ని వేలెత్తిచూపడంరెండోది. అంతా బాగుందనుకున్న రాజస్తాన్ కాంగ్రెస్‌లో ఇది సరికొత్త ముసలం...!

సచిన్ పైలట్ కాగలడా!

ఎన్నికల వేళ 'సీఎం' ఆకాంక్షలకు పదును • రాజస్తాన్ కాంగ్రెస్‌లో ముదురుతున్న ఇంటిపోరు

➤ గహ్లోత్–పైలట్ తలనొప్పిని ఎలా పరిష్కరించాలో తెలియక కాంగ్రెస్ అధిష్టానం తలపట్టుకు కూర్చుంది. ఇలాంటి అంతర్గత విభేదాలను పరిష్కరించడంలో ఆరితేరిన కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సైతం ఎవరినీ ఏమీ అనలేక, మధ్యేమార్గంగా 'మేజర్ సర్జరీ'తో వివాదం సద్దుమణిగేలా చేస్తామన్నారు. అయితే ఆ శస్త్రచికిత్స ఎప్పుడు, ఎలా అన్నది మాత్రం దాటవేశారు. బహుశా సోనియా, రాహుల్‌గాంధీల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్టుంది. పైలట్‌లో ఈ రీతిన అసంతృప్తి పేరుకుపోవడానికి అధిష్టానం వైఖరే కారణం. రాజస్తాన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా 2018లో పార్టీని విజయపథాన నడిపించిన పైలట్‌కు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టినట్టే పెట్టి, గహ్లోత్ చాణక్యానికి తలవంచడం అసంతృప్తిని రాజేసింది. బీజేపీ నుంచి అధికారాన్ని చేజిక్కించుకున్న ఆనందం ఆవిరవకుండా పైలట్‌ను బుజ్జగించి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి మమ అనిపించారు. సందర్భాన్ని బట్టి అప్పట్లో ఆ పదవితో పైలట్ సంతృప్తి పడినట్టు కనిపించినా రెండేళ్ల తిరిగేసరికి తనను తాను సర్దిబుచ్చుకోలేక రాజీనామా చేసి అసంతృప్తిని వెళ్లగక్కారు. తాజాగా దీక్షకు దిగి గహ్లోత్‌తోనూ, అధిష్టానంతోనూ అమీతుమీకే సిద్ధమయ్యానన్న సంకేతాలను పంపగలిగారు. క్రమశిక్షణ చర్యలు తప్పవని రాజస్తాన్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఎస్.ఎస్.రణ్‌ధవా నేరుగానే హెచ్చరించారు. అయితే పైలట్ మాత్రం ఇవన్నీ పట్టించుకునే స్థితిలో ఉన్నట్టు లేదు. ఈసారి సీఎం పదవి చేజారితే మరో ఐదున్నరేళ్లు ఎదురు చూడాల్సి వస్తుందని ఆయన భయం. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ గహ్లోత్‌నే సీఎంగా చూడటం పైలట్‌కు సుతరామూ ఇష్టం లేదు. మరోవైపు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగుతున్న రాజస్తాన్ పడవ వివాదాల సుడిగుండంలో చిక్కుకుని మునిగిపోవడం కాంగ్రెస్ అధిష్టానానికి రుచించడం లేదు. గహ్లోత్‌ను మళ్లీ సీఎం పదవి నుంచి తప్పించడానికి అధిష్టానం విముఖంగా ఉంది. ఎన్నికల ముందు సీఎంను మార్చి ఓటర్లను గందరగోళంలో పడేయడం తప్పుడు సంకేతాలను పంపినట్టవుతుందని భావిస్తోంది. గహ్లోత్‌పై పైలట్ చేసిన ఆరోపణలకు బలం చేకూర్చడం కూడా కాంగ్రెస్‌కు సుతరామూ ఇష్టం లేదు. పంజాబ్‌లో సిద్ధూ ఉదంతం అక్కడి ఎన్నికల్లో ఎలాంటి ఫలితాన్నిచ్చిందో కాంగ్రెస్‌కు అనుభవమే కాబట్టి మరోసారి అదే తప్పును పునరావృతం చేయడానికి సాహసించడం లేదు. అయితే ఈ సాకులన్నీ తనను మోసగించడానికేనని పైలట్ గట్టిగా నమ్ముతున్నారు. మరోవైపు కాంగ్రెస్ అంతర్గత పోరును తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ తన ప్రయత్నాలను ముమ్మరం చేయడం గమనార్హం. ఇప్పటికిప్పుడు బీజేపీ పరిస్థితి అమాంతం మెరుగయ్యేలా లేకపోయినా కులం కార్డు తమకు ఈసారి లాభిస్తుందని కమలనాథుల ఆశ. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సీపీ జోషి (బ్రాహ్మణ్), బీజేపీ పక్ష నాయకుడిగా రాథోడ్ (రాజ్‌పుత్), ఉప నాయకుడిగా సతీశ్ పునియా (జాట్)లను నియమించడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

పథకాలను నమ్ముకున్న గహ్లోత్



2018 నుంచి ఇప్పటిదాకా తను ప్రవేశపెట్టిన ప్రజాకర్షక పథకాలు 2023లో మరోసారి విజయం అందిస్తాయని గహ్లోత్ దృఢంగా నమ్ముతున్నారు. పార్టీలకు అతీతంగా ఇతర నాయకులతో తనకున్న సత్సంబంధాలు కూడా విజయావకాశాలను ప్రభావితం చేస్తాయని విశ్వసిస్తున్నారు. ఇటీవలే వందేభారత్ రైలు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఒక అడుగు ముందుకేసి గహ్లోత్ గుణగణాలను ప్రశంసించడం గమనార్హం. అయితే మరో ఆరేడు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలంటే గహ్లోత్–పైలట్ తమ విభేదాలను పక్కన పెట్టి సామరస్యంగా పనులు చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఇదే కోరుకుంటోంది. కానీ వారు బహిరంగంగానే సై అంటే సై అనుకోవడం కాంగ్రెస్‌పై ఓటర్లకున్న విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉంది. వివాదాలను తెగేదాకా లాగడం కాంగ్రెస్ అధిష్టానానికి అలవాటుగా మారింది. సెప్టెంబరులోనే అధికార మార్పిడికి ఒకసారి విఫల యత్నం చేసి చేతులెత్తేసిన గాంధీలు మరోసారి అలాంటి సాహసానికి దిగే ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయరు. ఖర్గే కూడా గాంధీల మార్గంలోనే పయనిస్తున్నారు. ఉన్నపళంగా పైలట్‌ను సీఎం చేసే దుస్సాహసానికి ఒడిగట్టే స్థితిలో ఆయన కూడా లేరు. పైలట్ కూడా ఇప్పటికిప్పుడు సీఎం పీఠం అధిష్ఠించాలన్న ఆలోచనలో లేరు. తాను వచ్చే ప్రభుత్వానికి 'పైలట్' కావాలని మాత్రమే కోరుకుంటున్నారు. 2020లో తిరుగుబాటు చేసినప్పుడు తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకోవడంలో పైలట్ విఫలమై ఉన్న డిప్యూటీ సీఎం పదవి కూడా వదులుకున్నారాయన. ప్రస్తుతం ఆయన ముందున్న లక్ష్యం మరోసారి ఎన్నికల ముందు పార్టీ అధ్యక్షునిగా ఎంపికై తన మద్దతుదార్లకు ఎక్కువ టికెట్లు ఇప్పించుకోవడం ఒక్కటే! అదీ అధిష్టానం అనుకూలంగా ఉంటేనే సాధ్యమవుతుంది. కానీ తాజా దీక్షతో ఆ అవకాశం కూడా పైలట్ చేజారినట్టు కన్పిస్తోంది!

ఇక పైలట్‌కు మిగిలింది...
➤ చిన్న పార్టీలైన హనుమాన్ బెనీవాల్ పార్టీ, బీఎస్పీ, ఎన్సీపీలతో జతకట్టి స్వతంత్రంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం.
➤ సొంతంగా ప్రాంతీయ పార్టీ స్థాపించి భావసారూప్యం గల వారిని చేర్చుకోవడం.
➤ పైలట్ గుజ్జర్ వర్గానికి చెందిన వారు కాబట్టి గుజ్జర్ల ఓట్లతో గెలవగలిగిన మొత్తం 30 అసెంబ్లీ సీట్లపైనా పూర్తిగా పట్టు బిగించడం.
➤ ఆమ్ ఆద్మీ పార్టీలో చేరి ఎన్నికల్లో పోటీ చేయడం. అయితే రాజకీయాల్లో తనకన్నా జూనియర్ అయిన కేజ్రీవాల్‌తో కూడటం ఆయనకు రుచించకపోవచ్చు.
➤ కాంగ్రెస్‌లోనే ఉంటూ పోరాటం కొనసాగిస్తూనే తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం.

రాజస్తాన్ ప్రభుత్వాన్ని పైలట్‌గా ముందుండి నడిపించాలన్న సచిన్ ఆశ నెరవేరుతుందో లేదో ఇప్పటికిప్పుడే చెప్పలేం. కానీ

కొసమెరుపు.. ఒకటి మాత్రం నిజం. కాంగ్రెస్ గనక ఈసారి ఆయన లేకుండా ఎన్నికల బరిలోకి దిగితే 2013లో వచ్చిన 21 సీట్లు కూడా రాకపోవచ్చనేది విశ్లేషకుల అంచనా. అంటే సచిన్ కాస్త కష్టపడితే రాష్ట్రానికి 'పైలట్' అవుతారనే కదా!!

పదేళ్లలో మరో మహమ్మారి!
కోవిడ్–19 తరహాలో దాడి చేసే అవకాశం



లండన్: కోవిడ్–19.. ప్రపంచవ్యాప్తంగా అల్లకల్లోలం సృష్టించిన మహమ్మారి. లక్షలాది మందిని పొట్టనపెట్టుకుంది. నియంత్రణ చర్యలతోపాటు ఔషధాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ చాలా దేశాల్లో వైరస్ వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. మరో పదేళ్లలో కోవిడ్–19 లాంటి భీకరమైన మహమ్మారి పంజా విసిరే అవకాశాలు ఉన్నాయని లండన్‌లోని ప్రెడిక్టివ్ హెల్త్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ సంస్థ 'ఎయిర్‌ఫినిటీ' వెల్లడించింది. వచ్చే పదేళ్లలో కొత్త మహమ్మారి తలెత్తడానికి 27.5 శాతం అవకాశాలు ఉన్నట్లు స్పష్టంచేసింది. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న వైరస్‌లతోపాటు వాతావరణ మార్పులు, జంతువుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందే వ్యాధుల ఆధారంగా ఈ సంస్థ అంచనాలు వెలువరిస్తూ ఉంటుంది. తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. మనుషుల నుంచి మనుషులకు వ్యాపించే కొత్త వైరస్ యూకేలో ఒక్కరోజులో 15,000 మందిని అంతం చేయగలదని తెలియజేసింది. ఏవియన్ ఫ్లూ తరహాలోనే ఇది మార్పులు చెందుతూ ఉంటుందని పేర్కొంది. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకోవడం, నియంత్రణ చర్యలను వేగవంతం చేయడం, 100 రోజుల్లో వ్యాక్సిన్లు అభివృద్ధి చేసుకోవడం ద్వారా కొత్త వైరస్ ముప్పు 27.5 శాతం నుంచి క్రమంగా 8.1 శాతానికి తగ్గిపోతుందని అభిప్రాయపడింది. ప్రపంచవ్యాప్తంగా మహమ్మారులను ఎదుర్కొనేందుకు అవసరమైన సన్నద్ధత అధ్వాన్నంగా ఉందని, ఈ పరిస్థితి చాలా మెరుగుపడాలని ఎయిర్‌ఫినిటీ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు రాస్మస్ బెచ్ హాన్‌సెన్ స్పష్టం చేశారు.

కేఐఐటీ డీయూలో వై20 కన్సల్టేషన్స్
భువనేశ్వర్: జీ20 సదస్సులో భాగంగా ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ(కేఐఐటీ డీయూ)లో 'వై20 కన్సల్టేషన్స్' శుక్రవారం ప్రారంభమైంది. ఒడిశా రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని 21వ శతాబ్దంలో మన దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సౌభాగ్యాలను నెలకొల్పడంలో యువత పాత్ర అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. వై20 కన్సల్టేషన్స్‌కు కేఐఐటీ వ్యవస్థాపకులు డాక్టర్ అచ్యుత సమంత అధ్యక్షత వహించారు.

విపక్ష కూటమి తథ్యం: అఖిలేశ్



ఇండోర్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని సమైక్యంగా ఎదుర్కొనేందుకు విపక్షాలమి సాకారమవుతుందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆశాభావం వెలిబుచ్చారు. ఇప్పటికే కేసీఆర్, మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్ వంటి ముఖ్యమంత్రులు ఇందుకు ప్రయత్నాలు చేస్తున్నారని గుర్తు చేశారు. ''విపక్షాలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో వాటికి దన్నుగా నిలిచేందుకు కాంగ్రెస్ ముందుకు రావాలని శుక్రవారం పిలుపునిచ్చారు. తద్వారా విపక్ష కూటమి బలోపేతానికి ఊతమిచ్చినట్టు అవుతుందన్నారు. తప్పుడు ఎన్‌కౌంటర్లపై కోర్టులు తమంత తాము విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తమవారిని బూటకపు ఎన్‌కౌంటర్లలో హత మార్చారని భావిస్తున్న వాళ్లు ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

కర్ణాటక బీజేపీకి మరో నేత గుడ్ బై



బెంగళూరు: కర్ణాటక బీజేపీలో టికెట్ల లొల్లి కొనసాగుతోంది. రానున్న ఎన్నికల్లో అధిష్టానం టికెట్ నిరాకరించిందనే ఆగ్రహంతో మాజీ డిప్యూటీ సీఎం లక్ష్మణ్ సావది కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ చీఫ్ డీకే శివకుమార్, ముఖ్యనేత సిద్దరామయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి రణదీప్ సూర్జేవాలా సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ పరిణామంపై సీఎం బస్వరాజ్ బొమ్మై విచారం వ్యక్తం చేశారు. లింగాయత్ వర్గానికి చెందిన సావది బెళగావి జిల్లా అథనీ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. ఈసారి సిట్టింగ్ ఎమ్మెల్యే మహేశ్ కుమతల్లికి టికెట్ ఇవ్వడం సావది అసంతృప్తికి కారణమైంది. తాజాగా, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అథనీ టికెట్‌పై ఆయనకు హామీ ఇచ్చినట్లు సమాచారం.

50 మందితో జేడీ(ఎస్) రెండో జాబితా
దేవెగౌడ కోడలు భవానీ రేవణ్ణకు మొండిచెయ్యి

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రతిపక్ష జేడీ(ఎస్) 50 మంది అభ్యర్థులతో శుక్రవారం రెండో జాబితాను విడుదల చేసింది. కీలకమైన హసన్ స్థానంలో హెచ్.పి.స్వరూప్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. ఈ స్థానం నుంచి టికెట్ ఆశించిన జేడీ(ఎస్) అగ్రనేత, మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవెగౌడ కోడలు భవానీ రేవణ్ణకు నిరాశే ఎదురయ్యింది. ఆమెకు తన భర్త రేవణ్ణ, కుమారులు ప్రజ్వల్ రేవణ్ణ, సూరజ్ రేవణ్ణ మద్దతుగా నిలిచినప్పటికీ జాబితాలో పేరు లేకపోవడం గమనార్హం. దేవెగౌడ పెద్ద కుమారుడు రేవణ్ణ భార్య అయిన భవానీ గతంలో హసన్ జిల్లా పంచాయతీ సభ్యురాలిగా పనిచేశారు. రేవణ్ణ, భవానీ అంగీకారంతో, దేవెగౌడ ఆశీస్సులతో హసన్ స్థానం నుంచి స్వరూప్‌ను పోటీకి దింపబోతున్నట్లు జేడీ(ఎస్) నేత హెచ్.డి.కుమారస్వామి ప్రకటించారు. తన సోదరుడు కుమారస్వామి ముఖ్యమంత్రి కావాలని తాను కోరుకుంటున్నానని రేవణ్ణ చెప్పారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. దేవెగౌడ సొంత జిల్లా అయిన హసన్‌లో ఆయన కుటుంబానికి మంచి ఆదరణ ఉంది. దివంగత ఎమ్మెల్యే హెచ్.ఎస్.ప్రకాశ్ తనయుడైన హెచ్.పి.స్వరూప్ గతంలో హసన్‌జిల్లా పంచాతీయ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

అంబేడ్కర్‌కు రాష్ట్రపతి, ప్రధాని నివాళులు

న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత, సామాజిక సంస్కర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో నిరుపేద, అణగారిన వర్గాల అభ్యున్నతికోసం అంబేడ్కర్ తన జీవితాన్ని అంకితం చేశారని మోదీ కొనియాడారు. పార్లమెంట్ ప్రాంగణంలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నేలంతా ఘనంగా నివాళులర్పించారు.



అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో సోనియా, ఖర్గే, ధన్‌ఖడ్, ముర్ము, నడ్డా, మోదీ తదితరులు

వ్యవస్థలపై వికృత దాడి: సోనియా
న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని జాతి వ్యతిరేకిగా మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అభివర్ణించారు. తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడటమే గాక రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ తన తాబేదార్లుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం ఓ పత్రికకు ఆమె వ్యాసం రాశారు. రాజ్యాంగ విజయం పాలకుల ప్రవర్తనపైనే ఆధారపడుతుందని అంబేడ్కర్ పదేపదే హెచ్చరించేవారని గుర్తు చేశారు. మోదీ సర్కారు దెబ్బకు దేశంలో స్వేచ్ఛ పూర్తిగా ప్రమాదంలో పడిందని ఆరోపించారు. ''చట్టాలను ప్రజల హక్కుల పరిరక్షణకు బదులుగా వారిని వేధించేందుకు ఉపయోగిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే విద్వేష వాతావరణం సృష్టించి సమాజంలో సౌభ్రాతృత్వాన్ని మంటగలుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలే నడుం బిగించాలి'' అని పిలుపునిచ్చారు.

ప్రమాదకర ధోరణి: ఖర్గే

ప్రత్యర్థులపై జాతి వ్యతిరేక ముద్ర వేయడం, బలవంతంగా నోరు మూయించడం వంటి ప్రమాదకర ధోరణులు పాలకుల్లో నానాటికీ పెరిగిపోతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆందోళన వెలిబుచ్చారు. ఇది అంతిమంగా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నాశనం చేస్తుందన్నారు. పార్లమెంటు చర్చా వేదికను కూడా అధికార బీజేపీ పోరాటస్థలిగా మార్చిందని దుయ్యబట్టారు. ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఖర్గే, కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వద్రా తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రాజ్యాంగ విలువలపై వ్యవస్థీకృత దాడి జరుగుతోందంటూ ప్రియాంక ట్వీట్ చేశారు.

ఘన ఇంధన బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించాం
ఉత్తరకొరియా ప్రకటన



సియోల్: మొట్టమొదటిసారిగా ఘన ఇంధనాన్ని వినియోగించి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించినట్లు ఉత్తరకొరియా శుక్రవారం ప్రకటించింది. వేగంగా ప్రయాణించే కొత్త రకం క్షిపణిని ఆ దేశం గురువారం ప్రయోగించినట్లు దక్షిణకొరియా, జపాన్ పేర్కొనడం తెలిసిందే. రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపంలోని అటవీ ప్రాంతంలోని వేదికపై నుంచి చేపట్టిన ఈ ప్రయోగాన్ని అధ్యక్షుడు కిమ్, ఆయన భార్య, కుమార్తె, సోదరి తిలకించినట్లు అధికార వార్తా సంస్థ కేసీఎన్‌ఏ తెలిపింది. ఈ క్షిపణి మూడు దశలుగా ప్రయాణించి, లక్ష్యాన్ని ఛేదించినట్లు వివరించింది. ఇప్పటి వరకు ద్రవ ఇంధనంతో పనిచేసే క్షిపణులను పరీక్షించిన ఉత్తరకొరియా తాజాగా ఘన ఇంధనం వాడినట్లు ప్రకటించడం ముందడుగేనని నిపుణులంటున్నారు. అమెరికాను నేరుగా భయపెట్టే అణ్వాయుధాలను సమకూర్చుకోవాలనే లక్ష్యంలో ఇది పురోగతిగా అభివర్ణిస్తున్నారు. అయితే ఈ తాజా క్షిపణి సామర్థ్యంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అది ప్రయాణించిన దూరం, ఎత్తు, తిరిగి భూ వాతావరణంలోకి ప్రవేశించి లక్ష్యాన్ని ఎలా ఛేదించింది, వార్ హెడ్ అమరిక వంటి వివరాలను వెల్లడించకపోవడాన్ని ప్రస్తావిస్తున్నారు.

అధికార నివాసం ఖాళీ చేస్తున్న రాహుల్
న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత, వయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ ఢిల్లీలోని అధికార నివాసాన్ని ఖాళీ చేస్తున్నారు. తుగ్లక్ లేన్‌లోని 12వ నంబర్ బంగ్లాలోని సామగ్రిని తన తల్లి సోనియా గాంధీ నివాసానికి తరలిస్తున్నారు. శుక్రవారం రాహుల్ నివాసం వెలుపల రెండు ట్రక్కులు కనిపించినట్లు పీటీఐ తెలిపింది. ఈ నెల 22లోగా నివాసాన్ని ఖాళీ చేయాలంటూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటీసులివ్వడం తెలిసిందే. సోనియా నివాసం 10, జనపథ్‌లోనే ఉండేందుకు రాహుల్ నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సామగ్రి తరలింపు మొదలైనట్లు సమాచారం.

యథాతథంగానే విశాఖ ఉక్కు డిజిన్వెస్ట్‌మెంట్
కేంద్ర ఉక్కు శాఖ స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ ఉక్కు (ఆర్‌ఐఎన్‌ఎల్)లో పెట్టుబడుల ఉపసంహరణ యథాతథంగా కొనసాగుతుందని కేంద్ర ఉక్కు శాఖ స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ పురోగతిలోనే ఉందని తెలిపింది. పనితీరును మెరుగుపర్చుకునేందుకు కంపెనీ ప్రయత్నాలు చేస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో వివరించింది. వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణ ప్రక్రియను ప్రభుత్వం ప్రస్తుతానికి నిలిపివేస్తోందంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో కేంద్ర ఉక్కు శాఖ ఈ మేరకు వివరణ ఇచ్చింది. వైజాగ్ స్టీల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 7 మిలియన్ టన్నులు. కంపెనీలో ప్రభుత్వానికి ఉన్న 100 శాతం వాటాలను విక్రయించే ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) 2021 జనవరి 27న ఆమోదముద్ర వేసింది.

ఈశాన్యంలో వైద్య సదుపాయాలు బలోపేతం

- ఎయిమ్స్–గువాహటి జాతికి అంకితం
- బిహూ నృత్యోత్సవంలో పాల్గొన్న ప్రధాని

గువాహటి: ఈశాన్య రాష్ట్రాల్లో నూతన ఆసుపత్రులు, వైద్య కళాశాలల రాకతో వైద్య రంగంలో మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కాబోతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఈశాన్య భారతంలో సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం తొమ్మిదేళ్లుగా శ్రమిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు ఈశాన్య ప్రాంతాన్ని ఆమడ దూరంలో ఉంచాయని, తమ ప్రభుత్వం దగ్గరికి చేర్చుకుంటోందని వివరించారు. ఈశాన్య భారతదేశంలో నిర్మించిన తొలి అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను మోదీ శుక్రవారం జాతికి అంకితం చేశారు. అస్సాం రాజధాని గువాహటిలో రూ.1,123 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించారు. అలాగే నల్బారీ, నాంగావ్, కోక్రాజార్‌లో మెడికల్ కాలేజీలను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.546 కోట్లతో నిర్మించే అస్సాం అడ్వాన్స్‌డ్ హెల్త్ కేర్ ఇన్నోవేషన్ ఇనిస్టిట్యూట్ (ఏఏహెచ్‌ఐఐ)కు పునాది రాయి వేశారు. దీన్ని అస్సాం ప్రభుత్వం, ఐఐటీ–గువాహటి సంయుక్తంగా నిర్మించనున్నాయి. 1.1 కోట్ల ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. విపక్షాలు దేశాన్ని అప్రతిష్ట పాలు చేయడమే పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు.



శుక్రవారం గువాహటిలో ప్రధాని మోదీ రోడ్ షో

రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించిన మోదీ

గువాహటిలోని ఇందిరాగాంధీ అథ్లెటిక్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో రూ.7,300 కోట్లతో కూడిన ఐదు రైల్వే ప్రాజెక్టులను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. బ్రహ్మపుత్ర నదిపై రూ.3,200 కోట్లతో పలాస్‌బారీ–సువాల్‌కుచీ బ్రిడ్జి నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేశారు. దిబ్రూగఢ్‌లో రూ.1,709 కోట్లతో నిర్మించిన మిథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అస్సాంలో సంప్రదాయ బిహూ నృత్యోత్సవంలో మోదీ పాల్గొన్నారు. 11,000 మందికిపైగా నృత్యకారులు, కళాకారులు అలరించారు. ఇక్కడ గురువారం నిర్వహించిన బిహూ నృత్యం రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సృష్టించడం తెలిసిందే.

సాంకేతికతతో సత్వర న్యాయం
గౌహతి హైకోర్టు వార్షికోత్సవంలో మోదీ

న్యాయసేవలు అందించే వ్యవస్థను మరింత వేగవంతం చేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. టెక్నాలజీతో సత్వర న్యాయం అందించవచ్చని, దీనివల్ల ఈశాన్య రాష్ట్రాల వంటి మూరుమూల ప్రాంతాల ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. శుక్రవారం అస్సాంలో గౌహతి హైకోర్టు 70వ వార్షికోత్సవ ముగింపు సభలో మోదీ ప్రసంగించారు. నూతన టెక్నాలజీతో ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. లక్షలాది మంది పౌరులకు ప్రాపర్టీ కార్డులు జారీ చేశామని ప్రధాని మోదీ వివరించారు. దానివల్ల ఆస్తుల సంబంధిత కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు.

జూలై ఒకటి నుంచి అమర్‌నాథ్ యాత్ర
జమ్మూ: హిమాలయాల్లో కొలువైన అమర్‌నాథ్ ఆలయ వార్షిక యాత్ర జూలై ఒకటో తేదీ నుంచి మొదలుకానుంది. ఆగస్ట్ 31 దాకా కొనసాగనుంది. ఈ నెల 17వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుంది. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన ఆలయ బోర్డు భేటీలో ఈ మేరకు నిర్ణయించినట్టు అధికారులు చెప్పారు. యాత్రకు వివరాల కోసం గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

తీహార్ జైలులో గ్యాంగ్‌వార్
లారెన్స్ బిష్ణోయి అనుచరుడు మృతి

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని తీహార్ జైలులో శుక్రవారం ఖైదీల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయి ముఠా సభ్యుడు ప్రిన్స్ తేవాతియా మృతిచెందాడు. సాయంత్రం 5 గంటలకు జైలులో ఇరు వర్గాల మధ్య గ్యాంగ్‌వార్ జరిగినట్లు తెలిసింది. తేవాతియా కత్తిపోట్లకు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని దీన్‌దయాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఘర్షణలో గాయపడిన మరో ఐదుగురు ఖైదీలను అధికారులు ఆసుపత్రికి తరలించారు.



బైసాఖీ పర్వదినం సందర్భంగా ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ వద్ద గంగానదిలో భక్తుల పుణ్యస్నానాలు

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శనివారం । 15 । ఏప్రిల్ । 2023

స్టాలిన్‌తో హిజ్రాల భేటీ



హిజ్రాల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా హిజ్రాలు కలిశారు. సీఎంతో మంత్రి మంత్రి గీజాజీవన్ ఉన్నారు. – సాక్షి, చెన్నై

జోహార్ అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని శుక్రవారం వాడవాడల్లో ఘనంగా నిర్వహించారు. రాజకీయ పక్షాల నేతలు అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, పుష్పాంజలితో నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో సమత్తువ దినోత్సవంగా అధికారిక వేడుకలు జరిగాయి.

అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలో వాడవాడల్లో ఉన్న ఆయన విగ్రహాల్ని ఆయా ప్రాంతాల్లోని సంఘాలు, రాజకీయ పక్షాల ప్రతినిధులు ముస్తాబు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నాయకులు, సంఘాల ప్రతినిధులు తరలివచ్చి విగ్రహాలకు పూలమాలలు వేశారు. అలాగే, ఆయా విగ్రహాల వద్ద ఉంచిన అంబేద్కర్ చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించారు. డీఎంకే, రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో సమత్తువ (సమానత్వం) దినోత్సవం అంబేడ్కర్ జయంతి వేడుక నిర్వహించారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎడపాడి పళనిస్వామి, అన్నాడీఎంకే నేతలు

సీఎం నివాళి..

ఆర్‌ఏ పురంలోని అంబేడ్కర్ స్మారక మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. సీఎం ఎంకే స్టాలిన్, మంత్రి శేఖర్‌బాబు, ఎం సుబ్రణియన్ , కేఎస్ నెహ్రూ ఏవి వేలు, సెంజి మస్తాన్, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, వీసీకే నేత తిరుమావళవన్, కాంగ్రెస్ శాసనసభా పక్షనేత సెల్వ పెరుంతొగై, చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహ వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి సీఎం స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు. సేలంలో జరిగిన కార్యక్రమంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రధాన ప్రతి పక్ష నేత పళణి స్వామి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. తేనీలో మాజీ సీఎం ఓ పన్నీరు సెల్వం, చెన్నై కలెక్టరేట్ ఆవరణలో జరిగిన వేడుకలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, టీ నగర్‌లోని నివాసంలో జయలలిత నెచ్చెలి శశికళ అంబేడ్కర్ చిత్రపటానికి అంజలి ఘటించారు.

మిన్నంటిన భక్తిభావం

• భక్తులతో ఆలయాలు కిటకిట
• ఘనంగా తమిళ ఉగాది
• తమిళులకు రాష్ట్రపతి, పీఎం శుభాకాంక్షలు



శ్రీవారి సేవలో శేఖర్

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని ఆలయాల్లో శుక్రవారం భక్తి భావం మిన్నంటింది. తమిళ కొత్త సంవత్సరాదిని రాష్ట్ర ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వాడవాడల్లో పరస్పరం శుభాకాంక్షలతో ఆనందాన్ని పంచుకున్నారు.

చిత్తిరై మాసం తొలిరోజును తమ కొత్త సంవత్సరంగా మొదటి నుంచి తమిళులు అనుసరిస్తున్నారు. గతంలో కరుణానిధి సీఎంగా ఉన్న సమయంలో పొంగల్ పండుగను తమిళ కొత్త సంవత్సరంగా ప్రకటించారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే యథాప్రకారం చిత్తిరై మాసం తొలిరోజునే తమిళ ఉగాదిగా ప్రకటించింది. అప్పటి నుంచి చిత్తిరై మాసం తొలిరోజును కొత్త సంవత్సరంగా జరుపుకుంటున్నారు. శుక్రవారం తమిళ కొత్త సంవత్సరం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో భక్తి భావం మిన్నంటింది. ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

బారులు తీరిన భక్తులు..

మదురై మీనాక్షి, తిరుచ్చి శ్రీరంగనాథ స్వామి, రామనాథపురం రంగనాథ స్వామి, పళణి దండాయుధ పాణి, తిరుచెందూరు సుబ్రమణ్యస్వామి, పిల్లయార్ పట్టి వినాయకుడి ఆలయం, తంజావూరు బృహదీశ్వర ఆలయంలో, చెన్నై వడపళని మురుగన్, కాంచీపురం మీనాక్షి ఆలయం రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో వేకువజామున భక్తులు బారులు తీరారు. ఆలయంలో జరిగిన పూజాది కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే జరగాలని ఆకాంక్షించారు. తిరునల్వేలిలోని రాజగోపాల ఆలయంలో గోపూజ పెద్ద ఎత్తున జరిగింది. కన్యాకుమారి జిల్లా నాగర్ కోయిల్‌లోని ఆదిపరాశక్తి పీటంలో చిత్తిరై తొలిరోజు ఉత్సవం కనులపండువగా జరిగింది. భక్తులకు కొత్త రూపాయి, రూ. ఐదు నాణెలను అందజేశారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని పలు గ్రామాల్లో ఎడ్లబండి, రెక్లా పోటీలు జరిగాయి. చెన్నై టీనగర్‌లో టీటీడీ సమాచారం కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. తమిళ ఉగాది ఆస్థాన కార్యక్రమం జరిగింది. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే, జీఎన్ చెట్టి రోడ్డులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి దర్శనం చేసుకున్నారు. తమిళ కొత్త సంవత్సరం సందర్భంగా తమిళ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. తమిళ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను గుర్తు చేస్తూ వ్యాఖ్యలు చేశారు. ఈ సారి తమిళ ఉగాదికి వరుససెలవులు వచ్చాయి. శుక్ర, శని, ఆది వారాలు సెలవు దినాలు కావడంతో చెన్నై నుంచి పెద్ద ఎత్తున జనం స్వస్థలాలు, స్వగ్రామాలకు తరలి వెళ్లారు. గురువారం అర్ధరాత్రి వరకు చెన్నైలోని బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిశాయి.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

న్యూస్‌రీల్

రూ.1.60 కోట్ల మత్తు మాత్రలు స్వాధీనం

కొరుక్కుపేట: రామనాథపురం సముద్ర ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.1.60 కోట్ల విలువైన మత్తు మాత్రలను శ్రీలంక ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంకలోని మన్నార్‌లోని సిలావతురై ప్రాంతంలో తమిళనాడు నుంచి పడవ ద్వారా అక్రమంగా మత్తు మాత్రలను తరలిస్తున్నట్లు శ్రీలంక ఆర్మీ ఇంటెలిజెన్స్ విభాగానికి సమాచారం అందింది. శుక్రవారం వేకువజామున మన్నార్ సమీపంలోని సిలవతురై ప్రాంతంలో సైనికాధికారులు దాడులు నిర్వహించారు. వేల సంఖ్యలో మత్తు మాత్రలు, క్యాప్సూల్స్ స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.60 కోట్లు. విచారణలో రామనాథపురం జిల్లా తీర ప్రాంతం నుంచి పడవలో అక్రమంగా తరలించినట్లు శ్రీలంక ఆర్మీ అధికారులు తెలిపారు.

రెట్టింపు జీతం ఇవ్వాల్సిందే!

సాక్షి, చెన్నై: అంబేడ్కర్ జయంతి సందర్భంగా విధుల్లో ఉన్న ఉద్యోగ సిబ్బందికి రెట్టింపు జీతం ఇవ్వాల్సిందేనని మదురై ధర్మాసనం ఆదేశించింది. తిరునల్వేలి జిల్లా కూడంకులం అణువిద్యుత్ కేంద్రం ఉద్యోగ, కార్మిక సంఘం గతంలో మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనాన్ని ఆశ్రయించింది. అంబేడ్కర్ జయంతిని జాతీయసెలవు దినంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఈ రోజున గతంలో తాము విధులకు హాజరై పనిచేసినట్టు పేర్కొన్నారు. అయితే, జాతీయ సెలవు దినాల్లో అదనపు పనిచేసిన పక్షంలో ఆ రోజుకు రెట్టింపు జీతం ఇవ్వాలని, ఇంత వరకు తమకు ఆ జీతం రాలేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన మదురై ధర్మాసనం గురువారం సాయంత్రం జారీ చేసిన ప్రత్యేక ఉత్తర్వులు శుక్రవారం వెలుగులోకి వచ్చాయి. జాతీయ సెలవు దినాల్లో అదనంగా పనిచేసిన పక్షంలో జీతం ఇచ్చేందుకు సంబంధించిన ఒప్పందాలు ఉన్న పక్షంలో రెట్టింపు జీతం ఇవ్వాల్సిందేనని ఆదేశిస్తూ అందులో వివరించారు. దీంతో తమకు జాతీయ సెలవు దినాల్లో అదనంగా పని కేటాయించిన పక్షంలో రెట్టింపు జీతం ఇవ్వాలని, గత బకాయిని త్వరితగతిన విడుదల చేయాలని కార్మిక సంఘం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.

17న డీఎంకే యూత్ నిరసన

సాక్షి, చెన్నై: సీఆర్‌పీఎఫ్ పరీక్షలను మాతృభాషలో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ డీఎంకే యువజన, విద్యార్థి విభాగం నేతృత్వంలో ఈనెల 17న నిరసనకు పిలుపునిచ్చారు. యువజన విభాగం, కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. చెన్నైలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయం శాస్త్రీ భవన్ వద్ద ఈ నిరసన జరుగుతుందన్నారు. సీఆర్‌పీఎఫ్ పరీక్షలను హిందీలో రాయాలని ఆదేశించి, బలవంతంగా ఆ భాషను మరో భాషల ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఉదయ నిధి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజకీయలబ్ధి కోసమే ఆస్తి జాబితా



గ్రామ సచివాలయ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు: రాజకీయలబ్ధి కోసమే బీజేపీ అన్నామలై డీఎంకే పార్టీకి చెందిన వారి ఆస్తి జాబితాను విడుదల చేస్తున్నారని రాష్ట్ర మంత్రి, డీఎంకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ అన్నారు. వేలూరు జిల్లా కేవీ కుప్పం నియోజకవర్గంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ కార్యాలయాన్ని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధ్యక్షతన మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డీఎంకే పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై డీఎంకే పార్టీలోని పలువురి ఆస్తి జాబితాను విడుదల చేసినట్లు సమాచారం వచ్చిందని వాటిని తాను చూడలేదన్నారు. కావేరి–గుండారు అనుసంధానాన్ని తామే చేస్తున్నామని ఇందుకు ఇతర దేశాలతో నిధులు తీసుకుని పనులు చేస్తున్నామని ప్రస్తుతం కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. వీటి విలువ రూ.1000 కోట్లతో పనులు జరుగుతున్నాయని ఈ పనులను వేగవంతం చేసి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, పార్లమెంట్ సభ్యుడు కదిర్‌ఆనంద్, డీఆర్ఓ రామమూర్తి పాల్గొన్నారు.

జీతం కోసం ఆందోళన

సాక్షి, చెన్నై: జీతాలు చెల్లించకపోవడంతో పారిశుధ్య కార్మికులు కన్నెర్ర చేశారు. అరియలూరు మున్సిపాలిటీలోని కార్మికుల అందరూ శుక్రవారం విధులను బహిష్కరించారు. మధ్యాహ్నమైనా చెత్త,చెదారాలు తొలగించకపోవడంతో అనేక చోట్ల దుర్గంధ భరిత వాతావరణం నెలకొంది. మున్సిపాలిటీ అధికారులు, పాలక మండలి వర్గాలు పరుగులు తీశాయి. కార్మికులను బుజ్జగించారు. మార్చినెలలో చెల్లించాల్సిన జీతాన్ని శనివారం అందజేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కార్మికులు విధులకు వెళ్లారు.

వీరులకు నివాళి

• వివాదంగా మారిన భౌతికకాయం తరలింపు
• సేలంలో రచ్చ



యోగేష్‌కుమార్, కమలేష్ (ఫైల్)

సాక్షి, చెన్నై: పంజాబ్ సైనిక శిబిరంలో జరిగిన కాల్పుల్లో మృతిచెందిన తమిళవీరులకు నివాళులర్పించారు. వీరి ఇద్దరి మృతదేహాలకు శుక్రవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. పంజాబ్‌లోని సైనిక శిబిరంలో బుధవారం జరిగిన కాల్పుల్లో తమిళనాడులోని తేని జిల్లా దేవారం సమీపంలోని మూనాండి పట్టికి చెందిన యోగేష్‌కుమార్, సేలం జిల్లా వానంకాడకు చెందిన కమలేష్ మరణించిన విషయం తెలిసిందే. ఈ సమాచారంతో ఆ కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగాయి. వీరి మృతదేహాల కోసం కుటుంబీకులు, ఆ గ్రామస్తులు ఎదురు చూశారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ నుంచి ఆర్మీ వర్గాలతో మదురై విమానాశ్రయానికి యోగేష్‌కుమార్ మృతదేహాన్ని తీసుకొచ్చారు. విమానాశ్రయంలో అధికారుల నివాళుల అనంతరం భౌతికకాయాన్ని రోడ్డు మార్గంలో తేనికి తరలించారు. స్వగ్రామంలో ఉంచారు. బంధువులు, ఆప్తుల సందర్శనానంతరం స్థానిక శ్మశాన వాటికలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి.

వివాదం..

కమలేష్ భౌతికకాయం తరలింపు వివాదానికి దారి తీసింది. కోయంబత్తూరు విమానాశ్రయం నుంచి ప్రభుత్వ మార్చురీ అంబులెన్స్‌లో తరలించారు. అంబులెన్స్ వెంట ఏ ఒక్క ఆర్మీ అధికారి లేకపోవడంతో గ్రామస్తులలో ఆగ్రహం బయలు దేరింది. దీంతో మృతదేహాన్ని అంబులెన్స్‌లోనే ఉంచి ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత తప్పలేదు. చివరకు పోలీసులు అధికారులు బుజ్జగించారు. ఆర్మీ వర్గాల అంబులెన్స్ వచ్చినానంతరం భౌతికకాయాన్ని స్వస్థలానికి తరలించారు. సాయంత్రం కమలేష్ భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగాయి. కమలేష్ తండ్రి రవి డీఎంకే నాయకుడి కావడం వల్లే ఆయన కుమారుడికి ఆర్మీ వర్గాలు సరైన గౌరవం ఇవ్వలేదని ఆ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీకి నిబంధనలు



ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీ

సాక్షి, చెన్నై : ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీకి 12 రకాల నిబంధనలు విధించారు. రాష్ట్రంలో సుప్రీంకోర్టు నుంచి అనుమతి పొంది మరో ర్యాలీ నిర్వహించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఈనెల 16న 45 చోట్ల ర్యాలీ నిర్వహించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ నిర్ణయించింది. ఇందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. చెన్నైలో రెండు చోట్ల ఈ ర్యాలీ జరగనుంది. అయితే, రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీకి అనేక నిబంధనలు విధించారు. డీజీపీ శైలేంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని జిల్లాల ఎస్పీలకు 12 కట్టుబాట్లు తప్పనిసరిగా అమలయ్యే విధంగా శుక్రవారం ఆదేశాలు వెళ్లాయి. ర్యాలీ, సభలో వ్యక్తిగతం, కులమతాలకు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదు. దేశ పరువుకు భంగం కలిగించే చర్యలకు పాల్పడరాదు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగించకుండా ర్యాలీ నిర్వహించాలి. ర్యాలీలో పాల్గొనే వారు ఆయుధాలు, కర్రలు చేతబట్టి ముందుకు వెళ్లేందుకు వీలు లేదు. ర్యాలీలో పాల్గొనే వారి కోసం తాగునీరు, కెమెరాలు, అగ్నినిరోధక పరికరాలు, ఇలా అన్ని రకాల ఏర్పాట్లను నిర్వాహకులు చేసుకోవాలి. ఎంపిక చేసిన , అనుమతి ఇచ్చిన మార్గాలలో ఎడమ వైపు మాత్రమే ర్యాలీ జరగాలి. అనుమతి ఇచ్చిన రహదారిలోని నాలుగు భాగాలలో ఓ భాగం మాత్రమే ర్యాలీకి ఉపయోగించుకోవాలి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ర్యాలీలో ఉన్న వారిని పర్యవేక్షించేందుకు స్వచ్ఛంద సేవకులను నియమించుకోవాలని సూచించారు.

డీఎంకే అక్రమాస్తుల రచ్చ

• 12 మందిని టార్గెట్ చేసిన అన్నామలై
• జాబితా విడుదల చేసిన బీజేపీ అధ్యక్షుడు
• ఎదురుదాడిలో డీఎంకే
• బీజేపీ కార్యాలయానికి భద్రత పెంపు



మీడియాతో డీఎంకే నేత ఆర్‌ఎస్ భారతి, బీజేపీ నేత అన్నామలై

సాక్షి, చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై శుక్రవారం విడుదల చేసిన డీఎంకే అక్రమాస్తుల జాబితా రచ్చకెక్కింది. రూ.లక్షా 34 వేల కోట్ల ఆస్తులను డీఎంకే నేతలు ఆర్జించినట్టుగా ఆయన ఆరోపించారు. ఇదేఅదనుగా అన్నామలైను టార్గెట్ చేసి డీఎంకే వర్గాలు ఎదురుదాడికి దిగాయి. కోర్టుల చుట్టూ అన్నామలై తిరగాల్సిందేనని, ఈ ఆరోపణలకు ఆధారాల్ని చూపించాల్సిందేనని పట్టుబట్టాయి.

అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో డీఎంకే వర్గాలు రాష్ట్రాన్ని దోచుకున్నట్టు అన్నామలై ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. తమిళ ఉగాది సందర్భంగా డీఎంకే ఫైల్స్ పేరిట అవినీతి ఆస్తుల జాబితాను ప్రకటిస్తానని చెబుతూ వచ్చారు. ఆ మేరకు కమలాలయంలో శుక్రవారం ఉదయం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి వీడియో ఆధారంగా జాబితాను విడుదల చేశారు.

అక్రమాస్తులు..

అన్నామలై తన జాబితాలో డీఎంకే నేత జగత్‌రక్షకన్ రూ.50,219 కోట్లు, మంత్రులు ఏవీవేలు రూ.రూ. 5,422 కోట్లు, కేఎన్ నెహ్రూ రూ.2,495 కోట్లు, పొన్ముడి రూ.581 కోట్లు. అన్బిల్ మహేశ్ రూ.1,000 కోట్లు, ఉదయనిధి స్టాలిన్ రూ.2 వేల కోట్లు ఆస్తులు గడించినట్టు ఆరోపణలు గుప్పించారు. డీఎంకే ఎంపీలు కనిమొళి రూ. 830 కోట్లు, టీఆర్ బాలు రూ. 10,840 కోట్లు, సీనియర్ మంత్రి దురైమురుగన్ కుమారుడు, ఎంపీ కదిర్ ఆనంద్ రూ. 579 కోట్లు, కళానిధి వీరాస్వామి రూ.2,923 కోట్లు, శబరీషన్ రూ. 902 కోట్లు ఆస్తులు గడించినట్టు ఆరోపించారు. మొత్తం 12 మందిని టార్గెట్ చేసి వివరాలను వెల్లడించారు. మొత్తంగా లక్షా 34 వేల కోట్లను దోచేశారని పేర్కొన్నారు. అలాగే, సీఎం స్టాలిన్‌నుకూడా టార్గెట్ చేసి ఆయనకు రూ. 200 కోట్లు ఓ సంస్థ నుంచి లంచంగా ముట్టినట్టు ఆరోపించారు. ఇది తొలి భాగంగా జాబితా మాత్రమేనని, త్వరలో మరో మూడు భాగాలు రాబోతున్నాయని అన్నామలై వివరించారు. ఈఅక్రమాస్తుల గురించి ఏసీబీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, అందుకే సీబీఐను ఆశ్రయిస్తున్నట్టు ప్రకటించారు. డీఎంకే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏ ఒక్కర్ని వదలి పెట్టేది లేదని, రెండు , మూడు భాగాలు మరింత ఆసక్తికరంగా ఉంటాయని వ్యాఖ్యలు చేశారు. నాలుగో జాబితా సమగ్ర వివరాలతో ఉంటాయని పేర్కొంటూ, మీడియా ఈసందర్భంగా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు నిరాకరించారు. వారం రోజుల తర్వాత తాను మళ్లీ మీడియా ముందుకు వస్తానని ఆ సమంయలో ప్రశ్నలు అడగవచ్చు అని దాట వేశారు.

నెలకు రూ.8 లక్షలు ఖర్చు..

తన కుటుంబంలోనే తాను తొలితరం రాజకీయ నాయకుడిని అని, తన వెనుక ఎవరూ లేరని పేర్కొంటూ, తన నెలసరి ఖర్చు గురించి వివరించారు. తనకు నెలకు రూ.7 నుంచి 8 లక్షల వరకు ఖర్చు అవుతోందని, ఈ ఖర్చులు తన మిత్రులే భరిస్తున్నారన్నారు. తాను వాడుతున్న రఫేల్ వాచీ ఖరీదు రూ.3 లక్షలు అని బిల్లులు సహా వివరాలను వెల్లడించారు. పీఎం మోదీ చెన్నై పర్యటన సందర్భంగా తాను హాజరు కాలేదని, ఇందుకు కారణం బెంగళూరు ఎన్నికల పనులేనని పేర్కొన్నారు. ధైర్యం ఉంటే, అన్నామలైను అధ్యక్ష పదవి నుంచి తప్పించండి చూద్దామని సవాల్ చేస్తూ ఆయన ప్రసంగాన్ని ముగించడం గమనార్హం.

డీఎంకే ఎదురు దాడి..

అన్నామలై ఆరోపణలు డీఎంకే తీవ్రంగా ఖండించింది. ఆయనపై ఎదురు దాడిలో డీఎంకే నేతలు నిమగ్నం అయ్యారు. ఆరుద్రా గోల్డ్ మోసం వ్యవహారంలో అన్నామలై గుట్టురట్టు కాబోతున్న నేపథ్యంలో వివాదాన్ని పక్కదారి పట్టించే విధంగా తమ మీదే బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని విరుచుకు పడ్డారు. ఆరుద్రా గోల్డ్ వ్యవహారం అన్నామలై మెడకు ఉచ్చుగా మారుతోన్న సమయంలో ఆయన తన దైన శైలిలో గారడీని ప్రదర్శించే పనిలో పడ్డట్టున్నారని నేతలు శివాలెత్తారు. డీఎంకే నేత ఆర్‌ఎస్ భారతీ, ఎంపీ, సీనియర్ న్యాయవాది విల్సన్‌తో కలిసి మీడియా ముందుకు వచ్చారు. ఆధార రహిత ఆరోపణలు చేసిన అన్నామలై ఇక, కోర్టుల చుట్టు తిరగబోతున్నారని పేర్కొన్నారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను 15 రోజులలోపు బహిర్గతం చేయని పక్షంలో అన్నామలైపై ఇక, కన్నెర్ర చేయడం ఖాయం అని హెచ్చరించారు. అతడో పొలిటికల్‌జోకర్ అని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా, అన్నామలై డీఎంకే వర్గాలపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. దీంతో బీజేపీ కార్యాలయం, ఆ పరిసరాలలో భద్రతను మరింతగా కట్టుదిట్టం చేశారు.డీఎంకే జాబితాను బయట పెట్టిన అన్నామలైకు అన్నాడీఎంకే జాబితా విడుదల చేసే ధైర్యం, దమ్ము ఉందా అని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ సవాల్ చేశారు.

పది నియోజకవర్గాల్లో మినీ స్టేడియంలు

• ఒక్కో నియోజకవర్గంలో రూ.3 కోట్లతో పనులు



ఉదయనిధి స్టాలిన్

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో మినీ క్రీడాస్టేడియంల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పది అసెంబ్లీ నియోజకవర్గాలలో తొలి విడతగా అన్ని హంగులతో క్రీడామైదానాలను తీర్చిదిద్దనున్నారు. ఒక్కో మైదానం పనులకు రూ. 3 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి, క్రీడాకారులకు ప్రోత్సాహం, అంతర్జాతీయస్థాయి క్రీడా పోటీలకు చెన్నైను వేదికగా చేయడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అసెంబ్లీ వేదికగా క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్ క్రీడా ప్రగతి గురించి ప్రత్యేక విజన్‌ను రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఇందులో 234 అసెంబ్లీ నియోజకవర్గాలలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయనున్నామని, ఇది మినీస్టేడియం తరహాలో ఉంటాయని ప్రకటించారు. దీనిని కార్యరూపంలోకి తెస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు.

పది నియోజకవర్గాలలో..

తొలి విడతగా పది అసెంబ్లీ నియోజకవర్గాలలో మినీ స్టేడియంల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో సీఎం స్టాలిన్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు, మంత్రి ఉదయనిధి ప్రాతినిధ్యం వహిస్తున్న చేపాక్కం– ట్రిప్లికేన్ నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. అలాగే వాణియంబాడి, కాంగేయం, చోళవందాన్, తిరువెరంబూరు, శ్రీ వైకుంతం , పద్మనాభపురం, ఆలంకుడి, కారైక్కుడి అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. ఒక్కో నియోజకవర్గంలో రూ.3 కోట్లతో ఈ మైదానాలు ఏర్పాటు కానున్నాయి. మినీ స్టేడియంను తలపించే విధంగా ప్రేక్షకుల గ్యాలరీ, పరుగు పందెం ట్రాక్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఆటల కోసం ప్రత్యేక ఏర్పాటు, క్రీడాకారులకు వసతి, ఇతర సౌకర్యాలతో ప్రత్యేక నిర్మాణాలు జరగనున్నాయి. ఈ నియోజకవర్గాలలో మినీస్టేడియంల నిర్మాణానికి అవసరమైన స్థల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. ఇక్కడ త్వరితగతిన పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలపై దృష్టిపెట్టారు.

క్లుప్తంగా

చెన్నై వేదికగా ఆటోమేషన్ సదస్సు

కొరుక్కుపేట: చెన్నై, నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటర్ వేదికగా ఈనెల 26 నుంచి 28వతేదీ వరకు మూడు రోజులు పాటు ఆటోమేషన్ ఎక్స్‌పో సౌత్ సదస్సును నిర్వహించనున్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఐఈడీ కమ్యూనికేషన్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ ఆరోగ్యస్వామి మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో తొలిసారిగా ఆటోమేషన్ సదస్సును నిర్వహించనున్నామని అన్నారు. ఐఈడీ కమ్యూనికేషన్ లిమిటెడ్ నేతృత్వంలో జరగునున్న సదస్సులో దేశంతోపాటు అంతర్జాతీయ స్థాయిలో ఈపీసీ కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు ఆటోమొబైల్ తయారీదారులు, ఆటో విడిభాగాల కేంద్రాల ప్రతినిధులు పాల్గొంటున్నారని అన్నారు. ముఖ్యంగా చమురు, గ్యాస్, పెట్రోలియం, ఎరువులు, చక్కెర, సిమెంట్, నీరు, వ్యర్థ జలాలు మొదలైన రంగాలకు చెందిన వారు పాల్గొని 153 స్టాల్స్‌లో 10వేలకు పైగా ఆధునిక ఆటోమేషన్ వస్తువులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

అరుణాచలేశ్వరాలయంలో పంచాంగంతో పూజలు


లింగంపై కిరణాలు

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో తమిళ సంవత్సరాదిని పురస్కరించుకుని శివచార్యులు నూతన పంచాంగాన్ని చదివారు. పంగుణి ఉత్తరాయణ ఉత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 3గంటలకు ఆలయాన్ని తెరిచి అన్నామలైయార్ సమేతఉన్నామలై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అన్నామలైయార్, సమేతఉన్నామలై అమ్మవారికి బంగారు కవచం వేశారు. అనంతరం సంబంధ వినాయకునికి బంగారు కవచం ధరించి శివాచార్యులు వినాయకుని ముందు కొత్త పంచాంగాన్ని శివాచార్యులచే స్వామి వారి సన్నిధి వద్ద ఉంచి చదివారు. అనంతరం గిరివలయం రోడ్డులోని తిరునేర్ అన్నామలైయార్ సన్నిధిలో సంవత్సరానికి ఒకసారి మాత్రం శివలింగంపై సూర్యుని కాంతి పడే సమయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


నూతన పంచాగంతో పూజలు చేస్తున్న శివాచార్యులు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

కొరుక్కుపేట: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని తెలుగు లోగిళ్లలో ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో అంబేడ్కర్ శిలా విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఎమ్మార్పీస్ అధ్వర్యంలో: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తమిళనాడు ఆధ్వర్యంలో పెరియమేట్‌లో రాష్ట్ర అధ్యక్షుడు కర్రా లోకేష్‌కుమార్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళుర్పించారు. ఎమ్మార్పీఎస్ ప్రిసీడియం చైర్మన్ కొండయ్య, ఉపాధ్యక్షుడు నాగభూషణం, అధికార ప్రతినిధి కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా ట్రిప్లికేన్‌లోని స్వతంత్ర నగర్‌లో తెలుగువారు కోలాహలంగా జరుపుకున్నారు. ఆది ఆంధ్ర ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు , సెక్రటరీ అముల్‌రాజ్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అలాగే చెన్నై కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు, ఎస్సీ ఎస్టీ ఓబీసీ ఉద్యోగుల సంఘం తరపున రిప్పన్ బిల్డింగ్ ప్రాంగణంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పెరియమేట్‌లో ఆల్ ఇండియా లేబర్ పీపుల్స్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జార్జి నివాళులర్పించారు. చెన్నై కొడుంగైయూర్‌లోని చిన్నాండిమడంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య పుష్పాంజలి ఘటించారు. అదేవిధంగా ద్రవిడ దేశం అధ్వర్యంలో చెన్నై కీల్పాక్‌లో ఉన్న అంబేడ్కర్ శిలా విగ్రహానికి ద్రావిడదేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు నివాళుర్పించారు.

వేలూరులో..

వేలూరు: వేలూరు కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ కుమరవేల్ పాండియన్, జిల్లా రెవెన్యూ అధికారి రామమూర్తి నివాళులర్పించారు. అదే విధంగా తిరుపత్తూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ భాస్కర పాండియన్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి చిత్త రంజన్, జిల్లా అధ్యక్షులు టీకా రామన్, వేలూరు మకాన్ సిగ్నల్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు నివాళులర్పించారు. దళిత నాయకులు కేజీ కుట్టి పాల్గొన్నారు.

తిరువళ్లూరులో..

తిరువళ్లూరు: పట్టణంలోని బస్టాండు వద్ద వున్న విగ్రహానికి మంత్రి నాజర్, ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, డీఎంకే జిల్లా కన్వీనర్ తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ నేతృత్వంలో ఘనంగా నివాళులర్పించారు. అయిల్ మిల్ వద్ద వున్న విగ్రహానికి అన్నాడీఎంకే ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ మాజీ మంత్రి రమణ, పార్టీ నేతలు మోదుగల తుకారామ్ నివాళుర్పించారు. బీజేపీ, వీసీకే, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళుర్పించారు.

పళ్లిపట్టులో..

పళ్లిపట్టు: పళ్లిపట్టు సమీపంలోని అత్తిమాంజేరి కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి అన్నాడీఎంకే యూనియన్ మాజీ ఉప కార్యదర్శి కన్నయ్య, మాజీ ఎంపీ హరి నివాళులర్పించారు.


తిరువళ్లూరులో నివాళి అర్పిస్తున్న రమణ


నివాళులర్పిస్తున్న కృష్ణారావు


అత్తిమాంజేరిపేటలో..


అంబేడ్కర్ వేషధారణలో ప్రభాకర్,


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న లోకేష్


రిప్పన్ బిల్డింగ్‌లో..


నివాళి అర్పిస్తున్న గుడిమెట్ల చెన్నయ్య


నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

పళ్లిపట్టులో కోడిపందేలు


కోడిపందేలు ప్రారంభిస్తున్న శ్రీనివాసన్

- తమిళ ఉగాదికి హైకోర్టు అనుమతి

పళ్లిపట్టు: తమిళ సంవత్సరాది సందర్భంగా హైకోర్టు అనుమతితో కోడిపందేలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు పందెంరాయుళ్లు కార్లలో పందెం కోళ్లతో పళ్లిపట్టు చేరుకున్నారు. పందేలను యూనియన్ డీఎంకే కార్యదర్శి సీజే.శ్రీనివాసన్ ప్రారంభించారు. పందేలకు 16 గ్రౌండ్లు ఏర్పాటు చేశారు. కోళ్లను పందెంలో దించేందుకు రూ.వెయ్యి చెల్లించారు. అంతకు ముందు పశు వైద్యులు కోళ్లను పరిశీలించి కత్తులు, ఇతర ఆయుధాలు లేకుండా పోటీకి అనుమతిచ్చారు. తొలిరోజు వందకు పైబడిన కోళ్ల పోటీపడ్డాయి. గెలుపొందిన కోడికి 8 గ్రాముల వెండికాయిన్‌తో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పళ్లిపట్టు పట్టణ డీఎంకే కార్యదర్శి జ్యోతి కుమార్, నిర్వాహకులు సెంథిల్‌కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.



టామ్స్‌ను బలోపేతం చేద్దాం


టామ్స్ నాయకులతో గొల్లపల్లి ఇజ్రాయేల్

కొరుక్కుపేట: ఆది ఆంధ్రుల అభ్యున్నతికి పాటుపడుతున్న తమిళనాడు ఆది ఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్)ను బలోపేతం చేయాలని టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇజ్రాయేల్ పిలుపునిచ్చారు. ఎగ్మూర్‌లోని ఇక్సా ప్రాంగణంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టామ్స్ సంస్థ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో వివిధ జిల్లాల నుంచి టామ్స్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయేల్ మాట్లాడుతూ టామ్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేసేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టామ్స్ అధ్యక్షుడు నేలటూరి విజయకుమార్, టామ్స్ ఉపాధ్యక్షుడు స్వర్ణా జయపాల్, ఊటుకూరు దేవదానం ట్రెజరర్ బి.బాలాజి, సౌత్‌జోన్ ప్రెసిడెంట్ రోడ్డా జయరాజ్, తిరుమలరావు, పాల్ కొండయ్య, పెంచలయ్య పెద్ద సంఖ్యలో టామ్స్ సభ్యులు పాల్గొన్నారు.

రథయాత్ర ఫెస్టివల్

ఇస్కాన్ నార్త్ చెన్నై ఆధ్వర్యంలో చెన్నై పెరంబూరులో 9వ వార్షిక గౌర్ నితై రథయాత్ర ఫెస్టివల్ శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. హైకోర్టు జడ్జి రాజారాం పాల్గొని ఫెస్టివల్‌ను ప్రారంభించారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగి తరించారు.

-కొరుక్కుపేట





అవగాహన

ఆటిజంతో బాధపడుతున్న పిల్లలకు వైద్య చికిత్సలు, సేవల గురించి అవగాహన కార్యక్రమం సీమాట్స్‌లో శుక్రవారం జరిగింది. డాక్టర్ లాల్ నేతృత్వంలోని బృందం పిల్లల తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు అందజేశారు. పిల్లలతో ఎలా మెలగాలి, ఎలా ప్రవర్తించాలి, వారికి కావాల్సిన ఉపకరణాలను సమకూర్చే విధంగా కార్యక్రమం జరిగింది. -సాక్షి, చెన్నై

కార్తీకి జంటగా కృతిశెట్టి


కృతిశెట్టి

తమిళసినిమా: కోలీవుడ్‌లో స్టార్ హీరోలుగా రాణిస్తున్న సోదర ద్వయం సూర్య, కార్తీ. ఇద్దరూ వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. కాగా యువనటి కృతిశెట్టి విషయానికి వస్తే టాలీవుడ్‌లో క్రేజీ కథానాయకిగా రాణిస్తోంది. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా తెలుగు, తమిళం, భాషల్లో వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్న కస్టడీ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ బ్యూటీ ది వారియర్ చిత్రం ద్వారా కోలీవుడ్ ప్రేక్షకులను పలుకరించింది. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించుకోకపోవడం ఈమెను నిరాశపరిచింది. అలాంటి పరిస్థితుల్లో తమిళంలో సూర్యకు జంటగా నటించే లక్కీచాన్స్ వరించడంతో సంబరపడిపోయింది. అయితే అది గాలిలో కలిసిపోయింది. బాలా దర్శకత్వంలో షూటింగ్ ప్రారంభమైన ఈ చిత్రం కొంత భాగం చిత్రీకరణ పూర్తి చేసుకున్న తరుణంలో దర్శకుడు బాలా, సూర్య మధ్య విబేధాల కారణంగా సూర్య ఆ చిత్రం నుంచి వైదొలిగారు. దీంతో ఆ తరువాత దర్శకుడు బాలా కథలో మార్పులు చేర్పులు కారణంగా అందులో హీరోహీరోయిన్లు కూడా మారిపోయారు. అలా ఆ చిత్రం కృతిశెట్టికి మిస్ అయ్యింది. అయితే అప్పుడు సూర్య సరసన నటించే అవకాశం చేజారినా, ఆయన తమ్ముడు కార్తీతో రొమాన్స్ చేసే అవకాశం వరించింది. అవును జపాన్ చిత్రంలో నటిస్తున్న కార్తీ తర్వాత స్టూడియో గ్రీన్ పతాకంపై జ్ఞానవేల్ రాజా నిర్మించనున్న చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. నలన్ కుమారసామి దర్శకత్వం వహించనున్న ఇందులో కృతిశెట్టి హీరోయిన్‌గా నటించనున్నట్లు తాజా సమాచారం. ఈ చిత్రం త్వరలో సెట్స్ పైకి వెళ్లనుంది.

కోలీవుడ్ టాక్స్

పాకెట్ మనీ కోసమే..

తమిళసినిమా: తమిళం, తెలుగు, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో నటించిన యువ తమిళ నటి మేఘా ఆకాష్. ముఖ్యంగా తమిళంలో రజనీకాంత్‌తో కలిసి పేట చిత్రంలోనూ, ధనుష్ సరసన ఎన్నై నోక్కి పాయుమ్ తూటా చిత్రంలోనూ నటించింది. అదేవిధంగా శింబుకు జంటగా వందా రాజాదాన్ వరువేన్ చిత్రంలో నటించింది. అయితే ఇప్పటికీ ఈ భామకు అనుకున్న స్థాయిలో స్టార్ అంతస్థు రాలేదని చెప్పాలి. అందుకు కారణం సరైన సక్సెస్ పడకపోవడమే అని భావించవచ్చు. కాగా ఈమె ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన గురించి తెలుపుతూ తాను చెన్నైలో పుట్టిన పెరిగిన అచ్చ తమిళ అమ్మాయినని చెప్పింది. అమ్మ, నాన్నలకు ఒకత్తే కూతురునని, బీఎస్సీ విజువల్ కమ్యూనికేషన్ చదివినట్లు తెలిపింది. నాకు చిన్నతనంలో బిడియం ఎక్కువ అని చెప్పింది. నలుగురితో ధైర్యంగా మాట్లాడడం కూడా తెలీదని, దానిని మార్చుకోవాలని భావించినట్లు పేర్కొంది. దీంతో తాను చదువుకుంటునే పాకెట్ మనీ కోసం చిన్న చిన్న వాణిజ్య ప్రకటనల్లో నటించానని చెప్పింది. ఆ తరువాత సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చాయని తెలిపింది. తన చూట్టూ ఉన్న తన తల్లి తనతో ఉండాల్సిందేనని చెప్పింది. చిత్ర షూటింగ్‌లకు కూడా తనతో తల్లి వస్తుందని తెలిపింది. తనకు క్రికెట్ క్రీడాకారుడు ఎంఎస్ ధోని అంటే చాలా ఇష్టమని, తాను ఆయన వీరాభిమానినని చెప్పింది. ఇక నటి త్రిష అంటే చాలా ఇష్టమని పేర్కొంది. పుస్తకాలు చదవడం, పాటలు వినడం తన హాబీ అని మేఘా ఆకాష్ పేర్కొంది.


మేఘాఆకాష్

అందరివాడు అంబేడ్కర్

తమిళసినిమా: బంగారు అమ్మన్ మూవీస్ పతాకంపై రాజా గణపతి కథానాయకుడిగా నటించి నిర్మించిన చిత్రం ఏ పడం మెఘా, సుస్మిత కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి క్యాస్ట్ లెస్ శివాజీ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. డా.అంబేడ్కర్ జీవిత చరిత్రలోని కొన్ని అంశాలను ప్రధానంగా తీసుకుని తెరకెక్కించిన కథా చిత్రం ఇది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఇందులో వీసీకే పార్టీ అధ్యక్షుడు తోల్.తిరుమావళవన్, నటి, దర్శకురాలు లక్ష్మి రామకృష్ణన్ పాల్గొని చిత్ర ఆడియోను ఆవిష్కరించారు. తిరుమావళవన్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా కొన్ని చిత్రాలలో సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. అదే తప్పు అని ఆయన అందరివాడని పేర్కొన్నారు. సమానత్వం, ప్రజాస్వామ్యం ఆయన నినాదం అన్నారు. ఒక వ్యక్తి గురించి, పార్టీ గురించి కాకుండా అభిప్రాయాల గురించి చర్చిస్తే పగ, ప్రతీకారాలకు ఆస్కారం ఉండదన్నారు. బేధాభిప్రాయాలే మానవజాతి చరిత్రగా మారిందన్నారు. మానవత్వం, అవినీతికి వ్యతిరేకంగా గొంతు విప్పడం, శాంతిని కోరుకోవడం వంటివే కమ్యూనిజం అన్నారు. నిజానికి బీజేపీ శత్రుత్వ పార్టీ కాదని, జాతి మతాలపై పగలేదని ఆధిపత్యం, అక్రమాలే మానవజాతికి శత్రువులు అని పేర్కొన్నారు. కాగా చిత్రానికి సెన్సార్ సభ్యులు 42 కట్స్ ఇచ్చారని దర్శకుడు ఆవేదనను వ్యక్తం చేశారు. చిత్రాన్ని థియేటర్లో విడుదల చేయడానికి న్యాయపోరాటం చేస్తున్నామని, అది సాధ్యం కాకపోతే ఓటీటీలో విడుదల చేస్తామని చిత్ర నిర్మాత, కథానాయకుడు రాజా గణపతి తెలిపారు.


ఏ పడం చిత్ర ఆడియో ఆవిష్కరణ


విదార్థ్

విదార్థ్ హీరోగా వైపర్

తమిళసినిమా: నటుడు విదార్థ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి వైపర్ అనే టైటిల్ నిర్ణయించారు. ఇందులో మిస్ ఫెమీనా రోషిణి ప్రకాష్ నాయకిగా నటిస్తున్నారు. ఇందులో పోలీసు అధికారిగా నటిస్తున్నారీమె. కాగా నటి రోషిణి ఇప్పటికే దర్శకుడు బాలా దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నాయకిగా నటిస్తున్నారన్నది గమనార్హం. క్రియేటివ్ ఫిలిమ్స్ పతాకంపై ఆర్ ఎం.రాకేష్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీనివాసన్ సుందర్ కథ, కథనం, మాటలను అందిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా మణిమారన్ నటరాజన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. జిబ్రాన్ సంగీతాన్ని, ఎస్సార్ సతీష్ కుమార్ చాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్ర వివరాలను నిర్మాత తెలుపుతూ చిత్ర షూటింగ్ ఇప్పటికే రెండు షెడ్యూల్ పూర్తి అయ్యిందని తర్వాత షెడ్యూల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. చిత్రంలోని కథానాయకుడి పాత్ర టైటిల్ తగినట్లుగా ఉంటుందన్నారు. చిత్రంలో జనరంజకమైన కమర్షియల్ అంశాలతో పాటు, భారీ యాక్షన్ సన్నివేశాలు చోటుచేసుకుంటాయన్నారు. ఈ చిత్రం టైటిల్‌ను ఉగాది సందర్భంగా శుక్రవారం నటుడు విజయ్‌సేతుపతి తన ట్విట్టర్ ద్వారా విడుదల చేశారని తెలిపారు. మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

లాఠీ పట్టనున్న ప్రభుదేవా

తమిళసినిమా: డాన్సింగ్ స్టార్ ప్రభుదేవా మరోసారి పవర్‌ఫుల్ పోలీసు అధికారిగా ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి ముసాసి అనే టైటిల్ ఖరారు చేశారు. ఇందులో ఆయనకు హీరోయిన్ ఉండదట. నటుడు జాన్ విజయ్, వీటీవీ గణేష్, జార్జ్ మరియాన్, మలయాళం బినూపప్పు, మలయాళ నటి లియోనా లిశాయ్, అరుల్‌దాస్, మాస్టర్ మహేంద్రన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ద్వారా శ్యామ్ రోడ్ ట్రిక్స్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. జార్ ఫిలిం బాక్స్ ఎంటర్‌టెయిన్‌మెంట్ పతాకంపై జాన్ బ్రింటో నిర్మిస్తున్న భారీ చిత్రం ఇది. లియాండర్ లీ మార్టి సంగీతాన్ని, విఘ్నేష్ వాసు చాయాగ్రహణం అందిస్తున్నారు. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఇందులో ప్రభుదేవా పోలీసు అధికారిగా చాలెంజ్ పాత్రలో నటించారని చెప్పారు. షూటింగ్ పూర్తయిందని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. చిత్రాన్ని సమ్మర్‌లో త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా చిత్రంలోని గాయకుడు ఆంథోనిదాసన్ పాడిన సింగిల్ సాంగ్‌ను విడుదల చేయనున్నట్లు చెప్పారు.


ముసాసి చిత్ర యూనిట్

క్లుప్తంగా

షిరిడీ సాయి ఆలయంలో పూజలు


విశేష అలంకరణలో షిరిడీసాయి

కొరుక్కుపేట: చెన్నై పెరంబూరులో వెలసియున్న నంద నవన ఆనంద షిరిడీసాయి ఆలయంలో తమిళ నూతన సంవత్సరం సందర్భంగా వైభవంగా పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో ముందుగా మహాగణపతి హోమం, నవగ్రహ హోమం, షిరిడీ సాయి మూల మంత్ర హోమం వైభవంగా నిర్వహించారు. హోమం అనంతరం 108 శంఖాభిషేకం నేత్రపర్వంగా చేశారు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ..

- మిద్దెపై నుంచి కిందపడి డ్రైవర్ మృతి

తిరువొత్తియూరు: సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి కింద పడి డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన చెన్నై కోడంబాక్కంలో జరిగింది. కోడంబాక్కం, ఆండవర్ నగర్‌లో ఉన్న ఇంట్లో రెండవ అంతస్థులో కుంభకోణం మడుగుసాలైకు చెందిన రఘునాథ్(25) ఉంటున్నాడు. ఇతని కారు డ్రైవర్. గురువారం రాత్రి ఇతను స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. మద్యం మత్తులో ఉన్న రఘునాథ్ తెల్లవారుజామున మిద్దెపై నిలబడి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

శ్రీవారి సేవలో సంయుక్త మీనన్


ఆలయం వెలుపల సంయుక్త మీనన్

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి సంయుక్త మీనన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు టీటీడీ ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

వాహనం ఢీకొని చుక్కల జింక మృతి

అన్నానగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని చుక్కల జింక మృతిచెందింది. ఆలంగుడి సమీపంలోని వంబన్ వద్ద శుక్రవారం ఉదయం ఓ చుచ్చల జింక రోడ్డు దాటేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో అటుగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం జింకను ఢీకొంది. ఈ ప్రమాదంలో జింక మృతిచెందింది. సమాచారం అందుకున్న ఆలంగుడి ఎస్పీ దీపక్ రజని, ఎస్‌ఐ కదిరేశన్, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన అటవీశాఖ అధికారులు చుక్కల జింకను శవ పరీక్షల నిమిత్తం పుదుకోట్టై మచ్చువాడికి తరలించారు.

రోడ్డుపైకొచ్చిన ఒంటరి ఏనుగు

- గుడియాత్తం రోడ్డులో గంటపాటు రాకపోకలకు అంతరాయం


ముసలిమడుగు వద్ద రోడ్డుపై ఒంటరి ఏనుగు

పలమనేరు: మండలంలోని మొసలిమడుగు వద్ద పలమనేరు–గుడియాత్తం రహదారిపై శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఓ ఒంటరి ఏనుగు రోడ్డుపైకి వచ్చేసింది. దీంతో ఏనుగును చూసి రోడ్డుపై వాహనాలను దూరంగా ఆపేశారు. కొందరు ఆకతాయిలు ఏనుగు సెల్ఫీ కోసం ఎగబడ్డారు. గురువారం ఏటిగడ్డ గ్రామ సమీపంలో హల్‌చల్ చేసిన ఒంటరి ఏనుగు కౌండిన్య నదిని దాటి శుక్రవారం మెయిన్ రోడ్డుపైకి వచ్చినట్టు స్థానికులు తెలిపారు.

టీచర్ సస్పెన్షన్

తిరువొత్తియూరు: విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న టీచర్‌ను సస్పెండ్ చేశారు. శివగంగై సమీపం కట్టానిపట్టిలో ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు వినాయక చౌదరి (50). ఇతను పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు లైంగికంగా వేధిస్తున్నట్లు హెచ్‌ఎం పాఠశాల విద్యా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీని గురించి జిల్లా ముఖ్య అధికారి, విద్యాశాఖ అధికారులు విచారణ చేశారు. విచారణలో వినాయకచౌదరి విద్యార్థినులకు లైంగిక వేధింస్తునట్లు తెలిసింది. దీంతో గురువారం వినాయక చౌదిరిని సస్పెండ్ చేస్తూ జిల్లా ముఖ్య విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు.

100 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: శుక్రవారం తెల్లవారుజామున ప్రభుత్వ డాక్టర్ ఇంట్లో చొరబడిన దుండగులు 100 సవర్ల నగలు, రూ. 20లక్షల నగదు చోరీ చేశారు. దిండుగల్ జిల్లా పళని అన్నానగర్‌కు చెందిన ఉదయకుమార్ (52). పళని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. రెండు రోజుల క్రితం ఉదయంకుమార్ భార్య,కుమార్తె చెన్నైకి వెళ్లారు. ఇంట్లో ఉదయకుమార్ ఒకరే ఉన్నారు. గురువారం విధులు ముగించుకుని డాక్టర్ ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడిన ముసుగు దొంగలు డాక్టర్‌కు కత్తిని చూపించి బెదిరించి కట్టేసి ఇంట్లో ఉన్న 100 సవర్ల నగలు, రూ.20 లక్షల నగదు దోచుకెళ్లాడు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఘనంగా తమిళ సంవత్సరాది


స్వామి వారికి దీపారాధన


ధన్వంతరిలో పాల్గొన్న భక్తులు


వీరరాఘవునికి తిరుమంజనం

- కిటకిటలాడిన ఆలయాలు

వేలూరు: తమిళ సంవత్సరాదిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం వేలూరు ఉమ్మడి జిల్లాతో పాటు తిరువణ్ణామలై జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లాలో ప్రసిద్ధి చెందిన రత్నగిరి బాలమురుగన్‌స్వామి వారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక దీపారాధనలు చేశారు. అదేవిధంగా వేలూరులోని చెల్లియమ్మన్ ఆలయం, కోట మైదానంలోని జలకంఠేశ్వరాలయం, టీటీడీ సమాచారం కేంద్రంలోను స్వామివారు ప్రత్యేక పుష్పాలంకరణల మధ్య భక్తులకు దర్శనమిచ్చారు. రాణిపేట జిల్లా వాలాజలోని ధన్వంతరి ఆరోగ్యపీఠంలో పీఠాధిపతి మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో లోక క్షేమం కోసం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి స్వామివారికి ప్రత్యేక దీపారాధనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని యాగపూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

తిరువళ్లూరులో..

తిరువళ్లూరు: పట్టణంలోని వీరారఘవుని ఆలయం, శివాలయం, వేంబులీఅమ్మన్, అంకాళపరమేశ్వరీ ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తమిళ నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా వీరరాఘవునికి తిరుమంజనంతో పాటు అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చిన వారికి ఆలయ నిర్వాహకులు ప్రసాదాలను అందజేశారు.

కుమారుడు ఆత్మహత్య

- మనస్తాపంతో విషం తాగి తల్లి బలవన్మరణం

తిరువొత్తియూరు: కరూర్ జిల్లాలో కుమారుడు ఆత్మహత్య చేసుకోవడం తట్టుకోలేక తల్లి విషం తాగి బలవన్మరణానికి పాల్పడింది. కడలూరు యూనియన్ సమీపంలో ఉన్న తరగంపట్టి సమీపం వరవనై పంచాయతీ సుండుకుళిపట్టికి చెందిన గోవిందరాజ్. ఇతని భార్య సుమతి (44). వీరి కుమారుడు సెల్వరాజ్ (23) గాంగేయంలో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. 15 రోజులుగా పనికి వెళ్లకుండా ఇంట్లో ఉంటున్నాడు. దీంతో గోవిందరాజ్ కుమారుడిని మందలించాడు. మనస్తాపం చెందిన అతను కిళక్కుపురం, అటవీ ప్రాంతంలో గురువారం మధ్యాహం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసి తల్లి సుమతి బాధ తట్టుకోలేక గన్నేరు కాయలు నూరి మింగేసింది. దీంతో స్పృహతప్పిన ఆమెను మయిలంపట్టి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుమతి గురువారం రాత్రి మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న కారు ..ముగ్గురు యువకులు దుర్మరణం


మృతి చెందిన యువకులు (ఫైల్)

తిరువళ్లూరు: కారు అదుపుతప్పి వ్యాన్‌ను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన తిరువళ్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. రాణిపేట జిల్లా అరక్కోణం షోలింగర్ రోడ్డు ప్రాంతానికి చెందిన విష్ణు(26), యామనత్ (29), అశ్విన్ రాజ్(25), బాలాజిప్రశాంత్(26), మదన్(26). వీరు ఐదుగురు స్నేహితులు. వీరు అరక్కోణం నుంచి చెన్నై పులియంతోపు ప్రాంతానికి వెళ్లి బర్త్‌డే పార్టీ చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే కారులో ఐదుగురు స్నేహితులు గురువారం రాత్రి కారులో బయలుదేరారు. కారు తిరువళ్లూరు జిల్లా మప్పేడు సమీపంలోని ఇరుళంజేరి గ్రామం వద్ద వెళుతుండగా మలుపు వద్ద కారు అదుపుతప్పి శ్రీపెరంబదూరు నుంచి అరక్కోణం వైపు కార్మికులతో వెళుతున్న వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదలో కారులో ప్రయాణిస్తున్న అశ్విన్‌రాజ్, బాలాజిప్రశాంత్, మదన్ అక్కడికక్కడే మృతిచెందారు. విష్ణు, యామనత్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న మప్పేడు ఎస్‌ఐ శక్తివేల్ సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన వారిని గుర్తించి శవపరీక్ష నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని తిరువళ్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నై వైద్యశాలకు తరలించారు. మప్పేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బర్త్‌డే వేడుకల్లో భాగంగా చెన్నైలోని హోటల్‌లో బిరియానీ తినడానికి వెళ్లి ముగ్గురు మృత్యువాత పడడం స్థానికంగా విషాదాన్ని నింపింది.

గణిత పరీక్షకు భయపడి విద్యార్థిని ఆత్మాహుతి

అన్నానగర్: గణిత పరీక్షకు భయపడి 10వ తరగతి విద్యార్థిని నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మణలిలో చోటుచేసుకుంది. చెన్నై సమీపం మణలి హరికృష్ణపురానికి చెందిన రవిశంకర్ వెల్డర్. ఇతని కుమార్తె రాజశ్రీ (15). మణలిలో ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. బుధవారం విద్యార్థి తల్లిదండ్రులు తిరువొత్తియూరులోని డీడీ కార్యాలయానికి వెళ్లారు. అప్పుడు గణిత పరీక్షకు బాగా చదువుకోవాలని విద్యార్థినికి చెప్పి వెళ్లిపోయారు. గణిత పరీక్షకు భయాందోళనకు గురైన విద్యార్థిని రాజశ్రీ తల్లిదండ్రులు ఇంటి నుంచి బయటకు వెళ్లగానే వంట గదిలో కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుంది. కేకలు విన్న ఇరుగుపొరుగు తీవ్రంగా గాయపడ్డ విద్యార్థినిని కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ రాజశ్రీ చికిత్స పొందుతూ గురవారం సాయంత్రం మృతి చెందింది. మణలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

100 కిలోల గుట్కా స్వాధీనం

అన్నానగర్: బెంగళూరు నుంచి సేలంకు శుక్రవారం లారీలో అక్రమంగా తరలిస్తున్న 100 కిలోల గుట్కాను ధర్మపురి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ధర్మపురి జిల్లా నల్లంపల్లి సమీపంలోని వెల్లకల్ జాతీయ రహదారిపై తోప్పూర్ పోలీసులు శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఓ లారీని ఆపి డ్రైవర్‌ను ప్రశ్నించారు. ఆ సమయంలో ఓ కారు వచ్చింది. పోలీసులను చూడగానే కారును ఆపి అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పారిపోయారు. పోలీసులకు లారీని తనిఖీ చేయగా లారీలో 100 కిలోల గుట్కా తరలిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు లారీని, కారును స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ప్రియుడిని నరికిన ప్రియురాలు

అన్నానగర్: ప్రియురాలు ప్రియుడిని కత్తితో నరికి హత్య చేసింది. కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం పక్కన వడపాన్‌పరప్పి సమీపంలోని మనలూర్ గ్రామంలో కల్కువారి చెరువు ఉంది. ఇందులో శుక్రవారం తెల్లవారుజామున గోనె సంచి ఉంది. దానిపై రక్తపు మరకలు ఉండడంతో అనుమానం వచ్చిన స్థానికులు వడపరప్పి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తిరుకోవిలూర్ డీఎస్పీ తిరుమేణి, ఇన్‌స్పెక్టర్ పాండియన్, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఇళంగోవన్, మాణిక్యం, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గోనెసంచెను స్వాధీనం చేసుకుని చూడగా ఓ యువకుడి మృతదేహం కనిపించింది. పోలీసుల విచారణలో మనలూరికి చెందిన తంగదురై (21)గా గుర్తించారు. ఇతను అదే ఊరిలో ఉన్న రాళ్ల క్వారీలో లారీ డ్రైవర్. ఆ సమయంలో క్వారీలో పనిచేసే అదే గ్రామానికి చెందిన అయ్యనార్ భార్య విజయప్రియ (29)తో తంగదురైకి పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇద్దరూ తరచూ ఏకాంతంగా కలుసుకునేవారు. ఏడాది నుంచి విజయప్రియ తంగదురైను దూరంగా పెట్టింది. ఇది తట్టుకోలేని తంగదురై విజయప్రియను తరచూ కలుస్తూ ఎందుకు మాట్లాడడం మానేశావు అంటూ వేధించేవాడు. ఈ స్థితిలో తంగదురై రెండు రోజుల క్రితం మద్యం తాగి విజయప్రియ ఇంటికి వెళ్లాడు. దీంతో ఆగ్రహించిన విజయప్రియ కత్తితో తంగదురై మెడను కోసేసింది. అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం తంగదురై మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి చెరువులో పడేసి ఏమీ తెలియనట్లు నటించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. దీంతో విజయప్రియను పోలీసులు అరెస్టు చేశారు. విజయప్రియ భర్త మూడేళ్లుగా విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. విజయప్రియకు 12 ఏళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ఉండడం గమనార్హం.

హత్య కేసులో డ్రైవర్‌కు యావజ్జీవం

అన్నానగర్: యువతిని హత్య చేసిన కేసులో కోయంబత్తూరు మహిళా కోర్టు డ్రైవర్‌కు గురువారం యావజ్జీవ శిక్షను విధించింది. కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి సమీపంలోని ఊంజవేలంపట్టికి చెందిన శశికళ (24) కోదవాడి సమీపంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుంది. అక్కడ డ్రైవర్‌గా పనిచేస్తున్న మలుమిచ్చంపట్టికి చెందిన వినోద (38)తో పరిచయం ఏర్పడింది. ఈ స్థితిలో 2013 అక్టోబర్ 24న శశికళ స్నేహితురాలి వద్దకు వెళుతున్నానని చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించకుండా పోయింది. చాలా చోట్ల వెతికినా ఆమె ఆజూకీ తెలియరాలేదు. మహిళా పోలీసులు కేసు నమోదు చేసి ఆమె కోసం గాలించారు. విచారణలో శశికళను వినోద్ కిడ్నాప్ చేశాడు. వీరి మధ్య జరిగిన వివాదంలో వినోద్ శశికళ మెడకు తాడుతో బిగించి హత్య చేసి గుంతలో పూడ్చిపెట్టాడని తేలింది. ఈ మేరకు వినోద్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన కేసు కోయంబత్తూరు మహిళా కోర్టులో నడుస్తోంది. వినోద్ విచారణకు హాజరు కాకుండా పరారీలో ఉన్నాడు. నాలుగేళ్ల తరువాత వినోద్‌ను అరెస్టు చేసి కోయంబత్తూరు సెంట్రల్‌జైలులో ఉంచారు. విచారణ ముగియడంతో గురువారం తీర్పు వెలువడింది. కోయంబత్తూరు మహిళా కోర్టు నిందితుడికి హత్య కేసులో యావజ్జీవ శిక్ష, రూ.500 జరిమానా, కిడ్నాప్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా, రెండేళ్లు నగల చోరీకి పాల్పడినందుకు, జరిమానా రూ.500 ఏక కాలంలో జరగాలని న్యాయమూర్తి జస్టిస్ నందినిదేవి తీర్పు వెలువరించారు.

నలుగురు విద్యార్థుల సస్పెన్షన్

అన్నానగర్: కృష్ణగిరిలోని బెంగళూరు వెళ్లే రహదారిలోని బోలుపల్లిలో ప్రభుత్వ వైద్య కళాశాల ఉంది. చెన్నైకి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ కుమారుడు సాబిక్ అహ్మద్ మెడికల్ కోర్సు రెండవ సంవత్సరం చదువుతున్నాడు. కృష్ణగిరిలో ఉంటూ రోజూ కాలేజీకి వెళ్లి చదువుకుంటున్నాడు. గత 10వ తేదీన ఆయన పుట్టినరోజు. తోటి విద్యార్థులు హాస్టల్ క్యాంపస్‌లో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఆ సమయంలో విద్యార్థులు ఒకరికొకరు మిఠాయిలు పంచుకుని సాబిక్ అహ్మద్‌తో ఆడుకున్నారు. ఆ సమయంలో కింద పడిన సాబిక్ అహ్మద్‌పై ఇతర విద్యార్థులు ఒక్కొక్కరుగా పడ్డారు. ఇందులో సాబిక్ అహ్మద్ తీవ్రంగా గాయపడి స్పృహతప్పి పడిపోయాడు. ఎంతసేపటికి లేవకపోవడంతో అతడిని రక్షించి చికిత్స నిమిత్తం మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్పించారు. విద్యార్థి మెడ ప్రాంతానికి వెళ్లే నరంలో గాయం ఏర్పడి జ్ఞాపకశక్తిని కోల్పోయాడు. అతనికి శస్త్ర చికిత్సలు జరిగాయి. అతనికి ఇంకా జ్ఞాపకాలు రాలేదు. దీనిపై వైద్య కళాశాల యాజమాన్యం విచారణ చేపట్టింది. ఈ ఘటనకు పాల్పడినట్లుగా నలుగురు విద్యార్థులను మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ వైద్య కళాశాల డీన్ రాజశ్రీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య విద్యార్థి కోమాలోకి వెళ్లిన కేసును ఆరుగురితో కూడిన బృందం దర్యాప్తు చేసింది. విద్యార్థి సాబిక్ అహ్మద్ సహా మొత్తం 10 మంది ఉన్నారు. విద్యార్థి గాయపడగా మరో 9 మంది విద్యార్థులలో నలుగురు ప్రస్తుతం సస్పెండ్ అయ్యారు. మరో ఐదుగురు వైద్య విద్యార్థులు విచారణలో ఉన్నారు.

వరసిద్ధుని సేవలో తమిళనాడు న్యాయమూర్తి


జస్టిస్ పుష్ప సత్యనారాయణకు చిత్రపటం అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుష్ప సత్యనారాయణ దర్శించుకున్నారు. కాణిపాకం విచ్చేసిన ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులచే ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.కార్యక్రమంలో అలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన మినీ వ్యాను

- ఇద్దరికి తీవ్ర గాయాలు


కంచరపాళెం వద్ద తెలుగుగంగ ఉపకాలువలోకి దూసుకెళ్లిన మినీ వ్యాను

వరదయ్యపాళెం: వేగంగా వస్తున్న మినీ వ్యాను అదుపు తప్పి తెలుగుగంగ ఉపకాలువలోకి దూసుకెళ్లి ప్రమాదానికి గురైన ఘటన మండలంలోని కంచరపాళెం సమీపంలో చోటుచేసుకుంది. వాహనదారుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బీఎన్ కండ్రిగ మండలం కరకంబట్టుకు చెందిన మునిరాముడు డ్రైవర్ మునెయ్యతో కలసి తనకున్న మినీ వ్యాను ద్వారా తిరుపతి నుంచి తమిళనాడు వేలచ్చేరికి ఓ యజమానికి చెందిన ఇంటి వస్తువులను తరలిస్తున్నాడు. సత్యవేడు మార్గంలోని కంచరపాళెం సమీపంలోని మలుపు వద్ద శుక్రవారం సాయంత్రం తెలుగుగంగ మాంబట్టు ఉపకాలువలోకి వాహనం అదుపు తప్పి దూసుకెళ్లింది. దీంతో వాహనంలో ఉన్న యజమాని మునిరాముడు (45), డ్రైవర్ మునెయ్య (43)లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికుల సహకారంతో 108కు సమాచారమిచ్చి సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

శివ, కేశవుల సేవలో హైకోర్టు న్యాయమూర్తి


సురుటపల్లిలో శ్రీ పళ్ళికొండేశ్వర స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి ఎస్.సుబ్బా రెడ్డి

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీవేదనారాయణ స్వామి, సురుటపల్లి శ్రీపళ్లికొండేశ్వర స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మొదట ఆయన నాగలాపురం శ్రీవేదవల్లీ సమేత వేదనారాయణ స్వామిని దర్శించుకుని అక్కడి నుంచి సురుటపల్లిలోని శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి న్యాయమూర్తికి ఘన స్వాగతం పలికి స్వామి,అమ్మవార్ల దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమలో ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు రాధాకృష్ణారెడ్డి, బోర్డు సభ్యులు మునివేలు, ఎస్‌ఐ హనుమంతప్ప పాల్గొన్నారు.

శోభాయమానం.. చందన స్వరూపం


సిద్ధి, బుద్ధి సమేతంగా ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారు శుక్రవారం తమిళ ఉగాదిని పురస్కరించుకుని చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునే స్వామివారికి ప్రత్యేక అభిషేకం అలంకరణలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలు అన్నీ రద్దు చేశారు. ఉదయం నుంచి భక్తులకు బ్రేక్ లేకుండా దర్శనం కల్పించారు.

ఆలయంలో పుష్పసోయగం

తమిళ ఉగాదిని పురస్కరించుకుని ఆలయంలో ఉభయదారులు కాణిపాకానికి చెందిన రాజమాణిక్యం కుమారులు సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి ధ్వజస్తంభం, అన్వేటి మండపం, సుపథ మండపంలో పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామికి శాస్త్రోక్తంగా గ్రామోత్సవం నిర్వహించారు.


ఆకట్టుకుంటున్న స్వామివారి ధ్వజస్తంభం

మురుగన్‌కు 1008 బిందెలతో పాలాభిషేకం






పాలబిందెలతో ఊరేగింపు, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్లకు పాలాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తజనం

తిరుత్తణి: తమిళ సంవత్సరాది సందర్భంగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి శుక్రవారం 1,008 బిందెలతో పాలాభిషేకం పూజలు చేశారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో తమిళ సంవత్సరం పురస్కరించుకుని శుక్రవారం వేకువజామున మూలవర్లకు విశేష అభిషేక పూజలు చేపట్టి బంగారు వజ్రాభరణాలు తొడిగి నేత్రపర్వంగా అలంకరించి మహాదీపారాధన పూజలు చేశారు. ఉదయం 9 గంటలకు నందినది తీరంలోని ఆర్ముగస్వామి ఆలయం నుంచి భక్తులు 1,008 పాల బిందెలతో పట్టణంలో ఊరేగింపుగా మెట్ల మార్గంలో కొండ ఆలయం చేరుకుని ఉత్సవర్లకు కావడి మండపంలో పాలాభిషేకం పూజలు చేసి మహాదీపారాదన చేపట్టారు. భక్తులు హరోహర నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. కొత్త సంవత్సరాది రోజున స్వామిని దర్శించుకునేందుకు భక్తులు కొండ ఆలయానికి పోటెత్తడంతో క్యూలో మూడు గంటల పాటు వేచివుండి సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పుదుచ్చేరిలో సాగర్ ఉత్సవం

సాక్షి, చెన్నై: కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో సాగర్ ఉత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. సముద్రతీరంలో నాలుగు రోజుల పాటు ఉత్సవాలు కనువిందు చేయనున్నాయి. చిత్తిరై మాసం(తమిళ సంవత్సరాది) వేడుకలలో భాగంగా పుదుచ్చేరిలో ప్రతి ఏటా సాగర్ ఉత్సవం పేరిట బీచ్‌ల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. అయితే మూడేళ్లుగా ఈ వేడుకలు కరోనా పరిస్థితుల నేపథ్యంలో జరగలేదు. ఈఏడాది బ్రహ్మాండంగా వేడుకల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. వేడుకలను సీఎం రంగస్వామి ప్రారంభించారు. సముద్ర తీరాలలో పుదుచ్చేరి సంస్కృతి, తమిళ సంప్రదాయం చాటే విధంగా కార్యక్రమాలు కనుల పండువగా జరగనున్నాయి. అలాగే, సంగీత కార్యక్రమాలు వినులవిందుచేయనున్నాయి.

మండే ఎండల్లోనూ... అందంగా... ఆరోగ్యంగా

ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖ చర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్త్రాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ అందంగా ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...



మంచి నీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటి నుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.

- గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.
- నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.
- ఉప్పు, కొద్దిగా మసాలాలు జోడించి పెరుగు చిలికి చేసే మజ్జిగ శరీరంలో వేడిని చల్లారుస్తుంది. డీహైడ్రేషన్ ను నివారిస్తుంది. ఇది ఎలక్ట్రోలైట్ల భరితం. వేసవి తాపంతో పోరాడటానికి మజ్జిగ ఒక మంచి ఆప్షన్. దీనిలో క్యాలరీలు తక్కువ. కాల్షియం, పొటాషియంతో పాటు ప్రొటీన్ కూడా దీని నుంచి దొరుకుతుంది. అసిడిటీని తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అదేవిధంగా పెరుగు తీసుకోవడం కూడా మంచిదే.
- గసగసాలను ఎక్కువగా ఆహారపదార్థాల్లో వాడాలి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అంతే కాదు, వేడిని తగ్గించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.
- కొత్తిమీరను ఆహారంలో అధికంగా తీసుకోవాలి. కొత్తిమీర రసం లేదా వంటకాల్లో దీన్ని వాడినా... శరీరంలోని అధిక ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.



చర్మ సంరక్షణ ముఖ్యం

- వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్ ని రాసుకోవడం వల్ల చర్మానికి సమస్యలు తగ్గుతాయి. ఈ సన్‌స్క్రీన్ లోషన్‌ని బయటికి వెళ్లినప్పుడు మాత్రమే కాకుండా ఇంట్లో ఉన్నప్పుడు కూడా అప్లై చేసుకోండి. సన్‌స్క్రీన్ లోషన్ వాడటం వల్ల చర్మ సమస్యలు ఉండవు. అలాగే చర్మానికి రక్షణ ఉంటుంది.
- ఎండల్లో బయటకు వెళ్ళినప్పుడు చర్మాన్ని కవర్ చేసుకోవడం అవసరం. కాబట్టి మీరు బయటకు వెళ్లేటప్పుడు గొడుగుని తీసుకు వెళ్లడం మర్చిపోకండి. అలానే ఎండాకాలంలో బయటకు వెళ్ళేటప్పుడు సన్ గ్లాసెస్‌ని ధరించడం, తలకు పెద్ద టోపీ పెట్టుకోవడం పైగా ఎలాంటి సమస్యలూ రావు.
- వేసవిలో ఆయిల్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. ఇంటి వంటలలో కూడా నూనె వాడకం తగ్గించాలి.
- ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మసాలా కూరలు తగ్గించాలి.
- అల్పాహారంగా ఆవిరి కుడుములు, ఇడ్లీ వంటివి తీసుకుంటే మేలు.
- కర్బూజా, పుచ్చకాయలు, ఈత కాయలు, తాటి ముంజలు వంటి సీజనల్ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచిది.
- వేసవిలో రోజుకోసారి రాగిజావ తీసుకోవడం వల్ల కడుపులో చల్లగా ఉండటంతోపాటు మరెన్నో లాభాలు ఉన్నాయి. రాగుల్లో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి.

మీకు తెలుసా?



రోజంతా చురుకుగా, ఆరోగ్యంగా ఉండాలంటే అల్పాహారం తీసుకోవడం అవసరం. దీనిలో మొలకెత్తిన గింజలు, ఉడికించిన కోడిగుడ్లు, నూనె లేకుండా చేసిన చపాతీలు, పండ్ల రసాలే కాక... ఐదు నానబెట్టిన బాదం పప్పులు, పండ్లు, కూరగాయలతో కలగలిపిన సలాడ్ లు వంటివి తీసుకుంటుంటే అనారోగ్యాన్ని కలిగించే వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు దరిచేరవు. వీటితోపాటు.. తీసుకునే అల్పాహారంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గడమే కాకుండా, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అలాగే డైటింగ్ చేసే వారు నిర్లక్ష్యం చేయకుండా.. అల్పాహారం తీసుకోవడం మరువకూడదు.

నీళ్లు ఏ బాటిల్‌లో తాగుతున్నారు..?

అసలే ఎండాకాలం.. దాహం వేస్తుంటుంది. ఇంట్లో ఉన్నప్పుడంటే కావలసినప్పుడల్లా నీళ్లు తాగుతుంటాం. మరి బయటికి వెళ్లేటప్పుడు? అందులో ఆలోచించేదేముంది... ఒక వాటర్ బాటిల్ తీసుకెళతాం.. అంతే కదా అని సింపుల్‌గా చెప్పేస్తాం. అయితే ఆ బాటిల్ దేనితో తయారు చేసింది... అంటే నూటికి తొంబై పాళ్లు 'ప్లాస్టిక్ బాటిల్' అనే సమాధానం వస్తుంది. దాహం వేసినప్పుడు నీళ్లు తాగడం వల్ల ఎంత ఉపయోగమో, ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీళ్లు తాగడం అంత ప్రమాదం. అది ఎండాకాలం అయితే కనక ఈ ప్రమాదం ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఇంతకీ ఏమిటా నష్టాలు అంటారా? అదే చూద్దాం..

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు అని పదే పదే చెబుతున్నా కూడా ప్లాస్టిక్ ఇంకా వాడకంలోనే ఉండటానికి కారణం ఏమిటంటే, దానిని క్యారీ చేయడం చాలా సులువు. నిర్వహించడం ఇంకా సులువు. ఒకవేళ ఎక్కడైనా పెట్టి మరచిపోయినా పెద్ద ఖరీదు ఉండదు కాబట్టి దిగులు పడనక్కరలేదు. అందువల్ల పర్యావరణ ప్రేమికులు ఎంతగా నెత్తీ నోరు బాదుకుంటున్నా, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే విషయంలో వెనకబడవలసి వస్తోంది.

- ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అయినా, ఖారీ ప్లాస్టిక్ కంటైనర్లు అయినా వాటి నుంచి నీరు తాగడం ప్రమాదకరం. ముఖ్యంగా ఎండలో ఎక్కువగా ఉంచిన ప్లాస్టిక్ బాటిల్స్‌లోని నీటిని అసలు తాగకూడదు.
- పరిశోధన ప్రకారం.. ప్లాస్టిక్ బాటిల్స్ మీద ఎండ పడితే.. అవి మైక్రోప్లాస్టిక్‌లను విడుదల చేస్తాయి. అలాంటి పరిస్థితుల్లో మనం ఈ నీటిని తాగితే.. శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను కాపాడే.. ఎండోక్రైన్ వ్యవస్థ ప్రభావితం అవుతుంది. ఇలాంటి నీటిని ఎక్కువగా తీసుకుంటే.. ఆరోగ్యం దెబ్బతింటుంది. కాలేయాన్ని కూడా పాడు చేస్తుంది.
- ఎండలో ఉండే.. ప్లాస్టిక్ బాటిల్ నుంచి డయాక్సిన్ లాంటి టాక్సిన్ నీటిలోకి విడుదల అవుతుంది. ఈ డయాక్సిన్ నీటిని తాగితే.. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బాటిల్ నీళ్ల తాగితే.. వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. మగవారిలో శుక్ర కణాల సంఖ్య కూడా తగ్గవచ్చు.



బాటిల్ వాటర్‌లో మైక్రో ప్లాస్టిక్స్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

- మైక్రోప్లాస్టిక్స్ కలిసిన నీటిని తాగితే పొత్తి కడుపునకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. హార్మోన్ల అసమతుల్యం, పీసీఓఎస్, ఒవేరియన్ సమస్యలు, బ్రెస్ట్ క్యాన్సర్, కోలన్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు రావొచ్చు.
- ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిది కాదు. బయటకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లకు ఎండ తగిలితే.. అస్సలే తాగొద్దు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లను కొంతమంది అలానే ఉపయోగిస్తారు. ఇంటికి తీసుకొచ్చి ఫ్రిడ్జ్‌లో పెట్టుకుంటారు. ఇది ఇంకా అపాయకరమైనది. ఇలా అస్సలు చేయొద్దు ఎప్పుడూ.

ఏం చేయాలి మరి?

ప్లాస్టిక్ బాటిల్స్ అంతగా వాడుకలోకి రాని రోజుల్లో పెద్దవాళ్లు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు స్టీలు లేదా ఇత్తడి మరచెంబులు తీసుకు వెళ్లేవారు. ఇప్పుడు కూడా అదే మంచిది. అందుకు తగ్గట్టు ఇప్పుడు మార్కెట్‌లో రకరకాల సైజుల్లో, ఆకారాలలో రాగి, స్టీలు, ఇత్తడి బాటిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇవి కాస్తంత ఖరీదు ఎక్కువైనా, ప్లాస్టిక్ వాడకం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలతో పోల్చుకుంటే ఫరవాలేదనిపిస్తుంది.

- ప్లాంట్ బేస్డ్ బాటిల్స్, గాజుసీసాలు, అల్యూమినియం వాటర్ క్యాన్స్ కూడా అందుబాటులోకి వస్తున్నాయి. మనం వాడకం మొదలు పెడితే ధరలు కూడా అందుబాటులోనే ఉంటాయి.

గ్యాస్ ఆదా చేద్దామా?

ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు వంటకు గ్యాసే వాడుతున్నారు. దాంతో వంట గ్యాస్ ధర రోజురోజుకీ పెరిగి మంట గ్యాస్‌గా మారిపోతోంది. అందుకే దాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే ఎక్కువకాలం పాటు గ్యాస్ వచ్చే విధంగా చూసుకోవచ్చు. గ్యాస్ ఆదాకు చిట్కాలు తెలుసుకుందాం...



వంట చేసేటప్పుడు రోజులో ఒకేసారి ఎక్కువ మొత్తంలో కూర వండుకోవడం మంచిది. ఉదయం ఒకసారి, మధ్యాహ్నం ఒకసారి, రాత్రి ఒకసారి... ఇలా వండడం వల్ల గ్యాస్ ఎక్కువ మొత్తంలో పోతుంది. అదే మధ్యాహ్న భోజనం చేయడానికి ఒక గంట ముందు వండుకుంటే, అదే కూర మధ్యాహ్నానికి, రాత్రికి కూడా వస్తుంది. దీనివల్ల రెండు మూడుసార్లు గ్యాస్‌ను వాడాల్సిన అవసరం రాదు.

- ప్రెషర్ కుకర్ బెస్ట్: ప్రెషర్ కుకర్ అధిక పీడనం కింద ఆవిరి మీద ఆహారాన్ని ఉడికిస్తుంది పైగా రెండు మూడు రకాలను ఒకేసారి కుకర్‌లో పెట్టవచ్చు కాబట్టి తక్కువ సమయంలో వంట పూర్తవుతుంది. గ్యాస్ కూడా ఆదా అవుతుంది.
- చిన్నగిన్నెలో వంటలు చేస్తున్నప్పుడు పెద్ద బర్నర్ వాడకూడదు. అలా వాడటం వల్ల మంట చాలా మటుకు బయటికి పోతుంది. దాంతో ఆ మేరకు గ్యాస్ వృథా అయినట్లే కదా.. అందువల్ల సాధ్యమైనంత వరకు చిన్న బర్నర్‌నే వాడటం మంచిది.
- బర్నర్లను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల అది త్వరగా వేడెక్కి వంట త్వరగా పూర్తయ్యేలా చేస్తుంది.
- వంట పూర్తవడానికి కొంచెం ముందే స్టవ్ ఆపి వేయండి. గిన్నె మీద మూత మాత్రం తీయవద్దు. లోపల ఉన్న వేడి ఆ మిగతా వంటను పూర్తి చేస్తుంది. దీనివల్ల గ్యాస్ ఆదా అవుతుంది.
- వంట చేస్తున్నప్పుడు గిన్నె మీద మూత పెట్టే ఉంచండి. ఎందుకంటే మూత పెట్టడం వల్ల లోపల ఉన్న వేడి బయటికి పోదు. ఆ వేడి మీదే త్వరగా ఉడుకుతుంది. అదేవిధంగా స్నానానికి వేడినీళ్లను గ్యాస్ మీద పెట్టవద్దు. నీళ్లు వేడెక్కడానికి చాలా సమయం పడుతుంది. దాంతో ఎక్కువ గ్యాస్ వాడాల్సి వస్తుంది.
- పగటిపూట వంట చేస్తున్నప్పుడు వంటగదిలోని లైట్లను ఆన్ చేయవద్దు. దీనివల్ల శక్తి ఆదా అవుతుంది. అలాగే మీకు తెలియకుండానే గ్యాస్ వినియోగం కూడా తగ్గుతుంది.

ఈ చిట్కాలన్నీ పాటించడం వల్ల గ్యాస్ సిలెండర్ దాదాపు పది రోజులు అదనంగా వచ్చే అవకాశం ఉంది.

సినిమా

కేరాఫ్ ఫారిన్

సమ్మర్‌లో కూల్‌గా ఉండే లొకేషన్స్‌ని ఎంచుకుని, వెకేషన్‌కి వెళుతుంటారు కొందరు స్టార్స్. కొందరిని షూటింగే చల్లని ప్రాంతాలకు తీసుకెళుతుంది. అలా 'కేరాఫ్ ఫారిన్' అంటూ షూటింగ్స్‌కి, వెకేషన్‌కి విదేశాలు వెళ్లిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.



కమల్‌హాసన్



ప్రభాస్



అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్

- రెండు వారాలుగా ఫారిన్‌లోనే ఉంటున్నారు ఇండియన్. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల తైవాన్‌లో జరిగిన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం సౌతాఫ్రికాలో జరుగుతోంది. కమల్‌పై ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్నారు శంకర్. ఈ వారం కూడా 'ఇండియన్ 2' టీమ్ సౌతాఫ్రికాలోనే ఉంటుందని తెలిసింది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా కీలక పాత్రలు చేస్తున్నారు.
- ఇటలీలో ఫైట్స్ చేశారు ప్రభాస్. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'సలార్' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ గత నెలలో ఇటలీ లొకేషన్స్‌లో జరిగింది. ముఖ్యంగా ప్రభాస్‌పై యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా 'సలార్' సినిమా యూనిట్ మరోసారి ఫారిన్ వెళ్లనుందని సమాచారం. బుడాపెస్ట్ లొకేషన్స్‌లో 'సలార్' షూటింగ్‌ను ప్లాన్ చేశారు. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. 'సలార్' చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రీకరణలో ప్రభాస్ పాల్గొంటున్నారని తెలిసింది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి కాగానే 'సలార్' కోసం ప్రభాస్ ఫారిన్ ఫ్లైట్ ఎక్కుతారని ఫిల్మ్‌నగర్ సమాచారం.
- లండన్‌లో ప్రేమ పాఠాలు నేర్చుకుంటున్నారు శర్వానంద్. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్, కృతీ శెట్టి జంటగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల లండన్‌లో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. గత వారం శర్వానంద్, కృతీపై కీలక సన్నివేశాలు, ఓ పాట చిత్రీకరించారు.



రణ్‌బీర్ కపూర్



శర్వానంద్

- బాలీవుడ్ 'బడే మియా చోటే మియా' లండన్‌కు షిఫ్ట్ అయ్యారు. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బడే మియా చోటే మియా'. ఇటీవల ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను స్కాట్లాండ్‌లో చిత్రీకరించారు. అట్నుంచి అటు లండన్ వెళ్లారు. మరో పది రోజులపాటు లండన్ షెడ్యూల్ జరుగుతుందట. అలాగే మరో బాలీవుడ్ మూవీ 'యానిమల్' షూటింగ్ కూడా లండన్‌లో జరిగింది. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్. ఈ చిత్రాలతో పాటు మరికొన్ని చిత్రాలు ఫారిన్ లొకేషన్స్‌లో షూటింగ్స్‌ను ప్లాన్ చేశాయి.

సమ్మర్ బ్రేక్



మహేశ్‌బాబు



రామ్‌చరణ్



ఎన్టీఆర్

షూటింగ్స్‌కు సమ్మర్ బ్రేక్ ఇచ్చారు కొందరు స్టార్ హీరోలు. ప్రతి ఏడాది సమ్మర్‌కు ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లే మహేశ్‌బాబు ఈ ఏడాది కూడా ఫారిన్ టూర్ వెళ్లారు. ఫ్యామిలీతో కలిసి విదేశాల్లో వెకేషన్ టైమ్‌ను ఆస్వాదిస్తున్నారు. మహేశ్ ఫ్యామిలీ ప్రస్తుతం జర్మనీలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఫారిన్ వెకేషన్‌ను పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు మహేశ్‌బాబు. మరోవైపు 'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల మొదలైన ఈ సినిమా తొలి షెడ్యూల్ ముగిసింది. నెక్ట్స్ షెడ్యూల్ గోవాలో ప్లాన్ చేశారు. అయితే ఈ సినిమా షూటింగ్ నుంచి ఎన్టీఆర్ స్మాల్ బ్రేక్ తీసుకున్నారని తెలిసింది. గోవా షెడ్యూల్‌లో వచ్చే నెల జాయిన్ అవుతారట ఎన్టీఆర్. ఇక రామ్‌చరణ్ ఫుల్ వెకేషన్ మోడ్‌లో ఉన్నారు. ఇటీవల రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన దుబాయ్ వెళ్లొచ్చారు. ప్రస్తుతం ఈ దంపతులు మాల్దీవుల్లో ఉన్నారు. ఈ వెకేషన్‌ను పూర్తి చేసిన తర్వాత రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' షూటింగ్‌లో పాల్గొంటారు. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

నేను సింగిల్



'ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే నాకు ఇష్టం' అంటున్నారు హీరోయిన్ పూజా హెగ్డే. సల్మాన్ ఖాన్ హీరోగా ఫర్హాద్ సామ్జీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కిసీ కా భాయ్.. కిసీ కీ జాన్'. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్‌కి జోడీగా నటించారు పూజా హెగ్డే. కాగా ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పటి నుంచి సల్మాన్, పూజా హెగ్డే డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. పైగా మంగళూరులో జరిగిన పూజ సోదరుడు రిషబ్ హెగ్డే వివాహానికి సల్మాన్ ఖాన్ హాజరవడం డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఈ వార్తలపై తాజాగా పూజా హెగ్డే స్పందిస్తూ– ''నా గురించి ఎన్నో వార్తలు వస్తుంటాయి. వాటిల్లో సల్మాన్‌గారితో డేటింగ్ అనేది ఒకటి. ఇలాంటి వార్తల గురించి నేను పెద్దగా పట్టించుకోను. ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే ఇష్టం. ఇప్పుడు నా దృష్టంతా కెరీర్‌పైనే ఉంది. వేర్వేరు భాషల్లో ఎక్కువ సినిమాల్లో నటించాలన్నదే నా లక్ష్యం. సల్మాన్‌గారితో నటించడం గొప్ప అనుభూతి'' అన్నారు.

పూజా హెగ్డే

భావోద్వేగాల విమానం



ధ్రువన్, సముద్ర ఖని

నటుడు, దర్శకుడు సముద్ర ఖని లీడ్ రోల్‌లో శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విమానం'. మాస్టర్ ధ్రువన్, మీరా జాస్మిన్, అనసూయ భరద్వాజ్, రాహుల్ రామకృష్ణ, ధన్‌రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని జూన్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ ప్రోమోను విడుదల చేశారు. జీ స్టూడియోస్ సౌత్ మూవీస్ హెడ్ అక్షయ్ క్రేజీవాల్ మాట్లాడుతూ– ''తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'విమానం'. అంగ వైకల్యంతో బాధపడే మధ్య వయస్కుడిగా, భార్య లేకపోయినా తనయుణ్ని జాగ్రత్తగా చూసుకునే తండ్రి వీరయ్యగా సముద్రఖని అద్భుతంగా చేశారు. బలమైన కథాంశంతో చక్కని భావోద్వేగాలతో ఈ చిత్రం ఉంటుంది. కిరణ్ కొర్రపాటితో అసోసియేట్ కావటం హ్యాపీ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వివేక్ కాలేపు, సంగీతం: చరణ్ అర్జున్.

ఆ సమయంలో రాకీ భాయ్ ఎక్కడ?



యశ్

హీరో యశ్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'కేజీఎఫ్' తొలి, మలి భాగాలకు విశేష స్పందన లభించిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్: చాప్టర్ 2' విడుదలై శుక్రవారం (ఏప్రిల్ 14)తో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా 'కేజీఎఫ్ 2'షార్ట్ వీడియోను ఈ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ షేర్ చేసింది. '1978 నుంచి 1981వరకు రాకీ భాయ్ ఎక్కడ?, ఆ ప్రామిస్ నిలబడిందా?' అనేవి ఈ వీడియోలో కనిపించాయి. అలాగే '3'తో ఈ వీడియో పూర్తవుతుంది. దీంతో 'కేజీఎఫ్ 3' ఉంటుందని స్పష్టమవుతోంది.



గుల్షన్ దేవయ్య, గుల్జార్, రాజ్ రాచకొండ

ఇద్దరు అపరిచితుల కథ

గుల్షన్ దేవయ్య, సయామీ ఖేర్ జంటగా 'మల్లేశం' చిత్రం ఫేమ్ రాజ్ రాచకొండ దర్శకత్వం వహించిన చిత్రం '8 ఏఎమ్ మెట్రో'. శిలాదిత్య బోరా ప్లాటూన్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా మే 19న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రముఖ గేయ రచయిత, దర్శకుడు గుల్జార్ ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేసి, మాట్లాడుతూ– ''ఈ చిత్రకథ చదివినప్పుడు గొప్ప అనుభూతి కలిగింది. అందుకే నా కవితలు అందించాను'' అన్నారు. ''మెట్రో ట్రైన్‌లో కలుసుకుని, ఒకరినొకరు తెలుసుకునే ఇద్దరు అపరిచితుల కథే ఈ సినిమా'' అన్నారు రాజ్ రాచకొండ. ''ఈ చిత్రంలో నా పాత్రకి ఒక సీక్రెట్ ఉంది. అది ఇద్దర్నీ వేరు చేయడంతో పాటు నమ్మకాల్ని కూడా చీల్చుతుంది'' అన్నారు గుల్షన్.

ప్రచండ తరుణం షురూ



రితికా, అశోక్, శ్రష్టి

అశోక్ రాజ్, రితికా రాజ్, శ్రష్టి వర్మ, వినయ్ బిద్దప్ప, ఉగ్రం మంజు, రవితేజ ప్రధాన పాత్రల్లో 'ప్రచండ తరుణం కారిన్య కావ్యం' అనే సినిమా షురూ అయింది. బాల పులిబోయిన దర్శకత్వంలో పులిచర్ల నాగరాజు, రామచంద్ర, కొల్లకుంట నాగరాజు నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ప్రొడక్షన్ హెడ్ రాజ్యలక్ష్మి కెమెరా స్విచ్చాన్ చేయగా, కన్నడ హీరో సిద్ధార్థ్ మహేశ్ క్లాప్ కొట్టారు. రచయిత పరుచూరి గోపాలకృష్ణ స్క్రిప్ట్‌ని అందించారు. ''మన పురాణాలు, ఇతిహాసాలను సైన్స్ అండ్ టెక్నాలజీతో బ్యాలెన్స్ చేసి తయారు చేసిన స్క్రిప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది'' అన్నారు దర్శక-నిర్మాతలు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
38	16
60,431	17,828

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,055	▽	110
డోజోన్స్	33,811	▽	216
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,872	▲	29
డాక్స్	15,808	▲	78
షాంఘై	3,338	▲	20
నికాయ్	28,493	▲	337

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

టాటా కార్లు మరింత ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ కాస్త ప్రియం కానున్నాయి. మోడల్, వేరియంట్‌ను బట్టి ధర సగటున 0.6 శాతం పెరగనుంది. మే 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయని కంపెనీ శుక్రవారం ప్రకటించింది. 2023 ఫిబ్రవరి తర్వాత ధరలు పెంచడం ఇది రెండవసారి. నియంత్రణపర మార్పులు, ముడిసరుకు వ్యయం అధికం కావడం తాజా నిర్ణయానికి దారి తీసిందని టాటా మోటార్స్ తెలిపింది.


ఆరు లేయర్లతో ప్లాస్టో వాటర్ ట్యాంకులు



హైదరాబాద్: నీటి ట్యాంకుల తయారీ సంస్థ ప్లాస్టో ఆరు లేయర్లతో కూడిన ట్యాంక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. నాణ్యమైన ప్లాస్టిక్ మెటీరియల్‌తో తయారుచేసిన ఈ ట్యాంకు సూర్యరశ్మిని లోపలికి ప్రవేశించనీయకుండా చేసి అధిక ఉష్ణోగ్రతల్లోనూ నీటిని చల్లగా ఉంచుతుంది. ప్రమాదకర యూవీ కిరణాల నుంచి రక్షణ నిస్తుంది. సులభంగా శుభ్రం చేసుకునేలా వీటిని రూపొందించారు. ''ప్రతి ఒక్కరికి ఏడాది పాటు సురక్షితమైన, ఆరోగ్యకరమైన తాగునీటికి అందించాలనే లక్ష్యంతో వీటిని తయారు చేసాము. ప్లాస్టో డీలర్ స్టోర్లలో ఇవి లభ్యమవుతాయి'' అని కంపెనీ ప్రకటన ద్వారా తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
15-4-2023	
విశాఖ	420-00
చిత్తూరు	428-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	385-00
విజయవాడ	385-00
రిటైల్ ధర (డజను)	66.00
14-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	363-00
వరంగల్	365ద-00
రిటైల్ ధర	4.85

పరుగెడుతున్న ఈ-టూ వీలర్లు



- 2022-23లో రెండున్నర రెట్ల వృద్ధి
- అమ్మకాలు 8,46,976 యూనిట్లకు
- ఫేమ్ మరో నాలుగేళ్లు పొడిగించాలి
- డిమాండ్ చేస్తున్న ఈవీ పరిశ్రమ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు భారత రోడ్లపై దూసుకెళ్తున్నాయి. సొసైటీ ఆఫ్ మాన్యుఫ్యాక్చరర్స్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఎస్ఎంఈవీ) ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 8,46,976 యూనిట్లు అమ్ముడయ్యాయి. 2021-22 విక్రయాలతో పోలిస్తే ఏకంగా రెండున్నర రెట్లకుపైగా వృద్ధి నమోదు కావడం విశేషం. ఎలక్ట్రిక్ టూ వీలర్లు 2021-22లో భారత్‌లో 3,27,900 యూనిట్లు అమ్ముడయ్యాయి. పెట్రోల్ భారం నుంచి బయటపడేందుకు, అలాగే తక్కువ ఖర్చుతో ప్రయాణించే వెసులుబాటు ఉండడంతో ఎలక్ట్రిక్ టూ వీలర్లకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం సబ్సిడీలతో ప్రోత్సహించడం కలిసి వచ్చే అంశం.

విభాగాల వారీగా ఇలా..

గరిష్ట వేగం గంటకు 25 కిలోమీటర్ల లోపు ప్రయాణించే లో స్పీడ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 1.2 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. గంటకు 25 కిలోమీటర్ల కంటే అధిక వేగంతో ప్రయాణించే హై స్పీడ్ ఈ-టూ వీలర్లు 7,26,976 యూనిట్లు విక్రయం అయ్యాయి. 2021-22లో లో స్పీడ్ 75,457 యూనిట్లు, హై స్పీడ్ 2,52,443 యూనిట్లు రోడ్డెక్కాయి. నీతి ఆయోగ్ లక్ష్యం, ఇతర పరిశోధన సంస్థల అంచనాల కంటే 25 శాతం తక్కువ స్థాయిలో గత ఆర్థిక సంవత్సరంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి.

పరిశ్రమకు అడ్డంకులు..

దశలవారీ తయారీ కార్యక్రమం (పీఎంపీ) పథకం కింద మార్గదర్శకాలను పాటించనందుకు ఫేమ్-2 రాయితీలను నిలిపివేయడం ఈ-టూ వీలర్ల అమ్మకాలపై ప్రభావం చూపిందని ఎస్ఎంఈవీ తెలిపింది. 'స్థానికీకరణలో జాప్యం సాకుతో వినియోగదారులకు ఒరిజినల్ పరికరాల తయారీదారులు (ఓఈఎం) ఇప్పటికే బదిలీ చేసిన రూ.1,200 కోట్ల కంటే ఎక్కువ సబ్సిడీని అకస్మాత్తుగా నిలిపివేయడం హాస్యాస్పదం. అలాగే తక్కువ ఇన్వాయిస్ చేశారనే ఆరోపణ కారణంగా ఖరీదైన ఈ-టూ వీలర్లను తయారు చేస్తున్న ఓఈఎంలకు చెందిన మరో రూ.400 కోట్లు నిలిచిపోయాయి. దీని పర్యవసానంగా మూలధన నిధుల కొరతతో వారి వ్యాపార కార్యకలాపాలు కుంటుపడ్డాయి. నేడు పరిశ్రమలో 95 శాతానికి పైగా ప్రాతినిధ్యం వహిస్తున్న 16 కంపెనీలు ప్రస్తుత గందరగోళ పరిస్థితి నుంచి పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. 2023-24లో తమ వ్యాపార ప్రణాళికలు చేసుకోవడానికి వీలుగా ఫేమ్ దశలవారీ తయారీ కార్యక్రమం తాలూకా అడ్డంకులకు తొలగించాలని విన్నవిస్తున్నాయి' అని వివరించింది.

ఎండమావిలా లక్ష్యం..

ద్విచక్ర వాహన రంగంలో 2022-23లో ఈ-టూ వీలర్ల వాటా 5% మాత్రమే. స్వల్పకాలిక లక్ష్యం 30 శాతం. 2030 నాటికి ఇది 80 శాతానికి చేర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఈ లక్ష్యం మరింత ఎండమావిలా కనిపిస్తోందని ఎస్ఎంఈవీ డైరెక్టర్ జనరల్ సోహిందర్ గిల్ వ్యాఖ్యానించారు. 'పరిశ్రమ అన్నీ కోల్పోలేదు. ఈ రంగాన్ని తిరిగి గాడిలో ఉంచగలిగేది దశలవారీ తయారీ కార్యక్రమం (పీఎంపీ) అర్హత ప్రమాణాలను రెండేళ్లు పొడిగించడం. అలాగే దీనిని ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఇచ్చితంగా అమలు చేయడం. ఫేమ్ పథకం కొనసాగింపుపై ప్రభుత్వ నిర్ణయం మొత్తం పరిశ్రమ విధిని నిర్ణయించే కీలకాంశం. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత కోసం పరిశ్రమ ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థ అభివృద్ధిని ప్రోత్సహించడానికి, స్వయం-సమర్థవంతంగా చేయడానికి కనీసం 3-4 ఏళ్ల పాటు ఫేమ్ పథకాన్ని పొడిగించడం చాలా ముఖ్యం' అని తెలిపారు.

కస్టమర్లకే నేరుగా సబ్సిడీ..

ప్రస్తుతం నెలకొన్న గందరగోళం వల్ల దీర్ఘకాలిక వ్యూహాన్ని అభివృద్ధి చేయడం కంపెనీలకు కష్టతరం అవుతోందని గిల్ వివరించారు. 'సబ్సిడీలలో ఏదైనా ఆకస్మిక తగ్గింపు వృద్ధిపై గణనీయ ప్రభావాన్ని చూపుతుంది. ఈ-మొబిలిటీ కోసం ప్రభుత్వ ప్రణాళికను ప్రమాదంలో పడేస్తుంది. ప్రస్తుత విధానంలో తయారీదార్లు సబ్సిడీని కస్టమర్‌కు బదిలీ చేస్తారు. విక్రయం తర్వాత ప్రభుత్వం నుండి క్లెయిమ్ చేసుకుంటారు. ఇది మోసపూరితంగా సబ్సిడీని క్లెయిమ్ చేయడానికి ఓఈఎంలు అమ్మకాలను మార్చడానికి దారితీయవచ్చు. ప్రభుత్వం నేరుగా కస్టమర్‌కు ప్రోత్సాహకాలను చెల్లించడానికి ప్రత్యక్ష సబ్సిడీ విధానాన్ని ప్రవేశపెట్టాలి' అని వివరించారు.

ఈవీలకు సిడ్బీ ఫైనాన్సింగ్!

ముంబై: ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఉత్తమ ఫైనాన్సింగ్‌కు వీలుగా చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు(సిడ్బీ) పైలట్ పథకానికి తెరతీసింది. తద్వారా మొత్తం ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) పరిశ్రమ పటిష్టతకు మద్దతివ్వనుంది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల తోపాటు ఫోర్ వీలర్ల కొనుగోళ్లకు రుణ సౌకర్యాలు కల్పించనుంది. వెరసి ఎలక్ట్రిక్ వాహన కొనుగోళ్లకు ఎంఎస్ఎంఈలు, ఈవీ లీజింగ్ కంపెనీలకు ప్రత్యక్షంగా ఆర్థిక తోడ్పాటును అందించనుంది. అంతేకాకుండా బ్యాటరీ స్వాపింగ్‌సహా చార్జింగ్ సదుపాయాల కల్పనకు సైతం అండగా నిలవనుంది. ఈవీ ఎకోసిస్టమ్‌లో రుణాలందించేందుకు వీలుగా చిన్న ఎన్‌బీఎఫ్‌సీలకు పోటీ రేట్లకు ఫైనాన్సింగ్‌ను ఏర్పాటు చేయనుంది.

ఫండ్స్ నిర్వహణ ఆస్తుల్లో 7% వృద్ధి

- మార్చి నాటికి రూ.40.05 లక్షల కోట్లు
- యాంఫి డేటా విడుదల



ముంబై: మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) 2023 మార్చి నాటికి సగటున రూ.40.05 లక్షల కోట్లకు చేరాయి. 2022 మార్చి నాటికి ఉన్న రూ.37.70 లక్షల కోట్లతో పోలిస్తే 7 శాతం వృద్ధి చెందినట్టు మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో సెన్సెక్స్ నికరంగా 0.72 శాతమే పెరగడం గమనార్హం. అదే కాలంలో ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువ రూ.5.86 లక్షల కోట్ల మేర తగ్గిపోయింది. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల ఏయూఎంలో రిటైల్ ఇన్వెస్టర్లకు సంబంధించిన ఏయూఎం (ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఓరియెంటెడ్) 2023 మార్చి చివరికి రూ.6,83,296 కోట్లకు చేరుకుంది. ఇన్వెస్టర్ల సంఖ్య పెరుగుతూ వెళ్లడం మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఈక్విటీ మార్కెట్ల పట్ల నమ్మకాన్ని ప్రదర్శించడంగా యాంఫి సీఈవో ఎన్ఎస్ వెంకటేశ్ అన్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం తదితర అనిశ్చితుల్లోనూ మార్కెట్ పట్ల ఇన్వెస్టర్లు నమ్మకంగా ఉండడాన్ని ప్రస్తావించారు. 2022-23లో ఈక్విటీ ఫండ్స్‌లోకి నికరంగా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు యాంఫి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సిప్ రూపంలో నెలవారీ పెట్టుబడులు కూడా ఎప్పటికప్పుడు నూతన గరిష్టాలకు చేరుతున్నాయి. 2023-24 సంవత్సరంలోనూ రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడుల ప్రవాహం మెరుగ్గానే ఉంటుందన్న అంచనాను వెంకటేశ్ వ్యక్తం చేశారు. సిప్ ఖాతాల సంఖ్య మార్చి చివరికి 6.36 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో 21.65 లక్షలు మేర పెరిగింది.

ఆగస్టులో హ్యుందాయ్ ఎక్స్‌టర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ ఈ ఏడాది భారత్‌లో విడుదల చేయనున్న చిన్న ఎస్‌యూవీకి ఎక్స్‌టర్‌గా నామకరణం చేసింది. ఈ మేరకు టీజర్‌ను విడుదల చేసింది. జూలైలో ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఆగస్టు నుంచి మార్కెట్లో అడుగు పెట్టనుందని సమాచారం. దక్షిణ కొరియాతోపాటు పలు దేశాల్లో అమ్ముడవుతున్న ఏఐ3 (క్యాస్పర్) మోడల్‌కు స్వల్ప మార్పులతో ఇక్కడ ప్రవేశపెట్టనున్నారు. ఈ వాహనం భారత్ కోసం తయారు చేస్తున్నారు. భవిష్యత్‌లో పొరుగున ఉన్న దేశాలకూ ఎగుమతి చేస్తారు. గ్రాండ్ ఐ10 నియోస్ ప్లాట్‌ఫామ్‌పై దీనిని అభివృద్ధి చేస్తున్నారు. 1.0 లీటర్ టీ-జీడీఐ టర్బో పెట్రోల్ ఇంజన్, 1.2 లీటర్ పెట్రోల్ ఇంజన్ వేరియంట్లతో తయారు కానుంది.

ఎన్‌ఎస్‌ఈలో చమురు, గ్యాస్ ట్రేడింగ్

ఫ్యూచర్ కాంట్రాక్టులకు రెడీ



న్యూఢిల్లీ: నైమెక్స్ క్రూడ్, నేచురల్ గ్యాస్‌లలో ఫ్యూచర్ కాంట్రాక్టులను ప్రవేశపెట్టనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ పేర్కొంది. కమోడిటీ డెరివేటివ్స్ విభాగంలో మే 15 నుంచి వీటిని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి గత నెలలో అనుమతులు లభించడంతో రుపీ ఆధారిత నైమెక్స్ డబ్ల్యూటీఐ చమురు, నేచురల్ గ్యాస్ ఫ్యూచర్ కాంట్రాక్టులకు తెరతీసింది. దీంతో ఎన్ఎస్ఈ ఎనర్జీ బాస్కెట్‌లో మరిన్ని ప్రొడక్టులకు వీలు చిక్కనుంది. కమోడిటీ విభాగం మరింత విస్తరించనుంది. వీటి ద్వారా మార్కెట్ పార్టిసిపెంట్ల(ట్రేడర్లు)కు ధరల రిస్క్ హెడ్జింగ్‌కు ఇతర అవకాశాలు లభించనున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. డబ్ల్యూటీఐ చమురు, నేచురల్ గ్యాస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులను రుపీ ఆధారితంగా సెటిల్ చేసేందుకు ఎన్ఎస్ఈ సీఎంఈ గ్రూప్‌తో డేటా లైసెన్సింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

తొమ్మిదేళ్లలో 90 వేల స్టార్టప్‌లు: అశ్వినీ వైష్ణవ్



జైపూర్: గడిచిన తొమ్మిదేళ్లుగా దేశీయంగా స్టార్టప్‌ల సంఖ్య గణనీయంగా పెరిగిమదని, 90,000కు చేరుకుందని ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అంకుర సంస్థల సంస్కృతిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ చర్యలు ఇందుకు దోహదపడుతున్నాయని ఆయన వివరించారు. జైపూర్‌లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) సెంటర్ ఏర్పాటు సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు.



హార్దిక్‌పై రూ. 12 లక్షల జరిమానా

ఐపీఎల్ తాజా సీజన్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా మరో కెప్టెన్‌పై జరిమానా పడింది. పంజాబ్ కింగ్స్ జట్టుతో గురువారం మొహాలిలో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటాను పూర్తి చేయడంలో విఫలమైంది. దాంతో ఐపీఎల్ నిర్వాహకులు గుజరాత్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై రూ. 12 లక్షలు జరిమానాగా విధించారు. బెంగళూరు కెప్టెన్ డుప్లెసిస్‌పై, రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ సామ్సన్‌లపై కూడా స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా పడింది.

క్వార్టర్ ఫైనల్లో ఓడిన సాకేత్ జోడీ

ఫ్లోరిడాలో జరుగుతున్న సరసోటా ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లో 2-6, 4-6తో డస్టిన్ బ్రౌన్ (జమైకా)-టిమ్ సాండ్‌కౌలెన్ (జర్మనీ) జంట చేతిలో ఓడిపోయింది. సాకేత్, యూకీలకు 1,930 డాలర్ల (రూ. 1 లక్షా 57 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.


'బెట్టింగ్'కు ప్రచారం

మెకల్లమ్‌పై ఈసీబీ విచారణ



లండన్: ఇంగ్లండ్ టెస్టు టీమ్ హెడ్ కోచ్, న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ వివాదానికి కేంద్ర బిందువయ్యాడు. ఒక బెట్టింగ్ కంపెనీ '22బెట్ ఇండియా'కు అతను బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో బెట్టింగ్ చేయమంటూ అభిమానులను ప్రోత్సహిస్తూ అతను ఇచ్చిన ప్రకటనలు ఇటీవల వెల్లువెత్తాయి. సైప్రస్‌లో రిజిస్టర్ అయిన బెట్22తో గత నవంబర్‌లో మెకల్లమ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. దాంతో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) దీనిపై దృష్టి సారించింది. ఈసీబీ అవినీతి నిరోధక విభాగం నిబంధనల ప్రకారం 'ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బెట్టింగ్‌లో పాల్గొనడం, పాల్గొనేలా చేయడం లేదా అందుకు ప్రోత్సహించడం చేయరాదు'. టీమ్ హెడ్ కోచ్‌గా మెకల్లమ్‌కు ఈ నిబంధనలు వర్తిస్తాయి. ప్రస్తుతం ఈ అంశంపై విచారణ జరుపుతున్నట్లు ఈసీబీ ప్రకటించింది. న్యూజిలాండ్‌లో కూడా నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తుండటంతో '22బెట్ ఇండియా'పై ఆ దేశం నిషేధం విధించింది కూడా. ఆ దేశానికి చెందిన 'ప్రాబ్లమ్ గ్యాంబ్లింగ్ ఫౌండేషన్' సంస్థనే మెకల్లమ్ గురించి ఈసీబీకి తెలియజేసింది. మెకల్లమ్ కోచ్‌గా వచ్చాక ఆడిన 12 టెస్టుల్లో ఇంగ్లండ్ 10 టెస్టులు గెలిచింది.

జొకోవిచ్‌కు షాక్



మోంటెకార్లో: ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయాడు. ఇటలీ ప్లేయర్ లొరెంజో ముసెట్టి 2 గంటల 54 నిమిషాల్లో 4-6, 7-5, 6-4తో టాప్ సీడ్ జొకోవిచ్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2013, 2015లలో ఈ టోర్నీలో విజేతగా నిలిచిన జొకోవిచ్ ఈ మ్యాచ్‌లో ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసి, తన సర్వీస్‌ను ఎనిమిదిసార్లు కోల్పోయాడు. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ సిట్సిపాస్ (గ్రీస్), మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) కూడా ఇంటిముఖం పట్టారు. క్వార్టర్ ఫైనల్స్‌లో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6-2, 6-4తో రెండో సీడ్ సిట్సిపాస్‌పై, హోల్గర్ రూన్ (డెన్మార్క్) 6-3, 6-4తో మెద్వెదెవ్‌పై నెగ్గి సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు.

బ్రూక్ బంగారం...



హ్యారీ బ్రూక్

- సెంచరీ సాధించిన హ్యారీ బ్రూక్
- సన్‌రైజర్స్ మరో విజయం
- 23 పరుగులతో కోల్‌కతా ఓటమి
- రాణా, రింకూ మెరుపులు వృథా

13, 3, 13... తొలి మూడు మ్యాచ్‌లలో హ్యారీ బ్రూక్ స్కోర్లు ఇవి! దాంతో అన్ని వైపుల నుంచి విమర్శలు, సన్‌రైజర్స్ అభిమానుల నుంచి సోషల్ మీడియాలో కొత్త తరహా మీమ్స్! వేలంలో రూ.13.5 కోట్లకు కొన్న ప్లేయర్ ఇలాగా ఆడేది అంటూ వ్యాఖ్యలు... కానీ శుక్రవారం నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్రూక్ తన విలువేమిటో చూపించాడు. టీమ్ మేనేజ్‌మెంట్ తనపై ఉంచిన అంచనాలను అందుకుంటూ మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగాడు. 2023 ఐపీఎల్ సీజన్‌లో తొలి సెంచరీని నమోదు చేసిన ఈ ఇంగ్లండ్ బ్యాటర్ రైజర్స్‌కు ఘనమైన విజయాన్ని అందించాడు. మరోవైపు సొంత మైదానంలో కోల్‌కతా సమష్టి వైఫల్యంతో చిత్తయింది. గత రెండు మ్యాచ్‌లలో రెండు అద్భుత వ్యక్తిగత ప్రదర్శనలతో గట్టెక్కిన ఆ జట్టుకు ఈసారి ఏదీ కలిసి రాలేదు.

కోల్‌కతా: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రైజర్స్ 23 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హ్యారీ బ్రూక్ (55 బంతుల్లో 100 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఈ సీజన్‌లో తొలి సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ మార్క్‌రమ్ (26 బంతుల్లో 50; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (17 బంతుల్లో 32; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ నితీశ్ రాణా (41 బంతుల్లో 75; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), రింకూ సింగ్ (31 బంతుల్లో 58 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు.

మెరుపు భాగస్వామ్యాలు...

ఇన్నింగ్స్ మొదటి ఓవర్ నుంచే బ్రూక్ దూకుడు మొదలైంది. ఉమేశ్ వేసిన తొలి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అతను, ఉమేశ్ తర్వాతి ఓవర్లో వరుస బంతుల్లో రెండు సిక్సర్లు బాదాడు. రసెల్ ఒకే ఓవర్లో మయాంక్ (9), రాహుల్ త్రిపాఠి (9)లను అవుట్ చేసినా మరోవైపు బ్రూక్ జోరు ఆగలేదు. అతనికి జత కలిసి మార్క్‌రమ్ కూడా చెలరేగిపోయాడు. ఫలితంగా పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు



75/2కు చేరింది. మరోవైపు సుయశ్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్.. వరుణ్ వేసిన తర్వాతి ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన మార్క్‌రమ్ తర్వాతి బంతికి వెనుదిరిగాడు. ఫెర్గూసన్ వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్లో బ్రూక్ పండగ చేసుకున్నాడు. తొలి బంతిని సిక్స్‌గా మలచిన అతను మరో 4 ఫోర్లు బాదాడు. అభిషేక్ కూడా మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చడంతో 18 ఓవర్లు ముగిసేసరికి రైజర్స్ స్కోరు 200 పరుగులకు చేరింది. బ్రూక్, అభిషేక్ నాలుగో వికెట్‌కు 33 బంతుల్లోనే 72 పరుగులు జత చేశారు. చివరి ఓవర్ మూడో బంతికి సింగిల్ తీసి బ్రూక్ శతకాన్ని అందుకోగా, ఆఖర్లో క్లాసెన్ (6 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగాడు. 45 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద బ్రూక్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను సుయశ్ వదిలేయడం కూడా రైజర్స్ ఇన్నింగ్స్‌లో కీలక క్షణం. దీనిని వాడుకున్న బ్రూక్ ఆ తర్వాతి 27 బంతుల్లో మరో 55 పరుగులు చేశాడు.

ఆరంభంలోనే తడబాటు...

ఛేదనలో నైట్‌రైడర్స్‌కు శుభారంభం దక్కలేదు. భువనేశ్వర్ వేసిన తొలి ఓవర్లోనే గుర్బాజ్ (0) అవుట్ కాగా, జాన్సెన్ వరుస బంతుల్లో వెంకటేశ్ అయ్యర్ (10), నరైన్ (0)లను వెనక్కి పంపాడు. ఇలాంటి స్థితిలో ఉమ్రాన్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్ కేకేఆర్ ఇన్నింగ్స్‌కు కాస్త ఊపు తెచ్చింది. ఈ ఓవర్లో రాణా వరుస బంతుల్లో 4, 6, 4, 4, 4, 6 (మొత్తం 28 పరుగులు) బాదడం విశేషం. అయితే తన వరుస ఓవర్లలో జగదీశన్, రసెల్ (3)లను మర్కండే అవుట్ చేయడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. రాణా మాత్రం తన జోరును కొనసాగించాడు. గత మ్యాచ్ హీరో రింకూ సింగ్ మరో ఎండ్ నుంచి కెప్టెన్‌కు సహకరించాడు. వీరిద్దరి భాగస్వామ్యం (39 బంతుల్లో 69) కొంత ఆశలు రేపినా... లక్ష్యం మరీ పెద్దది కావడంతో ఈ ఇద్దరి ప్రయత్నం సరిపోలేదు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (నాటౌట్) 100; మయాంక్ (సి) వరుణ్ (బి) రసెల్ 9; రాహుల్ త్రిపాఠి (సి) గుర్బాజ్ (బి) రసెల్ 9; మార్క్‌రమ్ (సి) రసెల్ (బి) వరుణ్ 50; అభిషేక్ (సి) శార్దుల్ (బి) రసెల్ 32; క్లాసెన్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 228. వికెట్ల పతనం:** 1-46, 2-57, 3-129, 4-201. **బౌలింగ్:** ఉమేశ్ 3-0-42-0, ఫెర్గూసన్ 2-0-37-0, నరైన్ 4-0-28-0, రసెల్ 2.1-0-22-3, వరుణ్ 4-0-41-1, సుయశ్ 4-0-44-0, శార్దుల్ 0.5-0-14-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటింగ్: గుర్బాజ్ (సి) ఉమ్రాన్ (బి) భువనేశ్వర్ 0; జగదీశన్ (సి) (సబ్) ఫిలిప్స్ (బి) మర్కండే 36; వెంకటేశ్ (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 10; నరైన్ (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 0; రాణా (సి) సుందర్ (బి) నటరాజన్ 75; రసెల్ (సి) జాన్సెన్ (బి) మర్కండే 3; రింకూ (నాటౌట్) 58; శార్దుల్ (సి) సుందర్ (బి) ఉమ్రాన్ 12; ఉమేశ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 205. వికెట్ల పతనం:** 1-0, 2-20, 3-20, 4-82, 5-96, 6-165, 7-197. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-1-29-1, జాన్సెన్ 4-0-37-2, నటరాజన్ 4-0-54-1, ఉమ్రాన్ 2-0-36-1, మర్కండే 4-0-27-2, సుందర్ 2-0-20-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	4	3	1	6	1.588
లక్నో	4	3	1	6	1.048
గుజరాత్	4	3	1	6	0.341
కోల్‌కతా	4	2	2	4	0.711
చెన్నై	4	2	2	4	0.225
పంజాబ్	4	2	2	4	-0.226
హైదరాబాద్	4	2	2	4	-0.822
బెంగళూరు	3	1	2	2	-0.800
ముంబై	3	1	2	2	-0.879
ఢిల్లీ	4	0	4	0	-1.576

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x ఢిల్లీ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
లక్నో x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

కాంస్యంతో ముగింపు



అస్తానా (కజకిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను భారత జట్టు కాంస్య పతకంతో ముగించింది. టోర్నీ చివరిరోజు శుక్రవారం పురుషుల ఫ్రీస్టయిల్ 125 కేజీల విభాగంలో అనిరుధ్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించాడు. కాంస్య పతక బౌట్‌లో అనిరుధ్ 12-2తో సర్దార్‌బెక్ ఖొల్మతోవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందాడు. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో అనిరుధ్ 8-2తో తైకి యామమోటో (జపాన్)పై నెగ్గి, క్వార్టర్ ఫైనల్లో 0-2తో బతిర్‌ముర్జయెవ్ యునుప్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. బతిర్‌ముర్జయెవ్ ఫైనల్ చేరుకోవడంతో అనిరుధ్‌కు కాంస్య పతకం కోసం పోటీ పడే అవకాశం దక్కింది. భారత్‌కే చెందిన పంకజ్ (61 కేజీలు), యశ్ (74 కేజీలు), దీపక్ పూనియా (92 కేజీలు), జాంటీ కుమార్ (86 కేజీలు) పతకాల బౌట్‌లకు అర్హత పొందలేకపోయారు. ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్ ఒక స్వర్ణం, రెండు కాంస్యాలు సాధించింది.

భారత్‌కు రెండో ఓటమి



తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో ఓటమి చవిచూసింది. జపాన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 0-3తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో రుతుజా 1-6, 0-6తో హొంటామా మాయి చేతిలో... రెండో మ్యాచ్‌లో అంకితా రైనా 2-6, 7-5, 3-6తో మొయుక ఉచిజిమా చేతిలో ఓటమి పాలయ్యారు. డబుల్స్ మ్యాచ్‌లో సహజ యామలపల్లి-వైదేహి జోడీ 3-6, 4-6తో షుకో అయోయామా-ఇరి హొజుమి జంట చేతిలో ఓడిపోయింది. హైదరాబాద్‌కు చెందిన సహజ భారత సీనియర్ జట్టు తరఫున తొలిసారి బరిలోకి దిగింది.

బార్సిలోనా ఓపెన్‌కు దూరం



మాడ్రిడ్: ఎడమ తుంటి గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో... ఈనెల 17న మొదలయ్యే బార్సిలోనా ఓపెన్ టోర్నీలో స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ బరిలోకి దిగడంలేదు. 36 ఏళ్ల నాదల్ బార్సిలోనా ఓపెన్‌లో రికార్డుస్థాయిలో 12 సార్లు చాంపియన్‌గా నిలిచాడు.

క్లుప్తంగా...

జగనన్నతోనే ఆరోగ్య భద్రత

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని



చిలకలూరిపేటలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య భద్రత దక్కిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. హెల్త్ అండ్ వెల్‌నెస్ వైద్య విధానం ప్రారంభమై ఐదేళ్ల పూర్తి అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నెలకు ఒక రోజు హెల్త్ మేళా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో అధికారికంగా శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి రజిని ముఖ్యఅతిథిగా హాజరై ఆరోగ్య సిబ్బంది ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో ఏపీలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం దేశానికే దిక్సూచిగా మారబోతోందని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఏకంగా 3,255 చికిత్సలకు ఉచితంగా వైద్యం అందజేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ కిరణ్, పల్నాడు జిల్లా డీఎంఅండ్ హెచ్‌వో శోభారాణి పాల్గొన్నారు.

రవాణాశాఖ కమిషనర్‌గా మనీశ్ కుమార్ సిన్హా

సాక్షి, అమరావతి: రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్‌గా మనీశ్ కుమార్ సిన్హాను ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు డీజీ(ఇంటెలిజెన్స్) పీఎస్ఆర్ ఆంజనేయులు ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్నారు. ఆయన స్థానంలో 2000 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి మనీశ్‌కుమార్ సిన్హాను రవాణా కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మహిళా సంక్షేమ శాఖ గ్రేడ్-1 ఈఓ పోస్టుల ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: మహిళా శిశుసంక్షేమ శాఖలోని గ్రేడ్–1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) పోస్టులకు ఎంపికైన వారి ప్రాథమిక జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. అభ్యర్థుల రిజిస్టర్ నంబర్లతో జాబితాను కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరచినట్లు కార్యదర్శి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జనసేన ప్రధాన కార్యదర్శిగా నాగబాబు



సాక్షి, అమరావతి: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా తన సోదరుడు నాగబాబును ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. విదేశాలలో ఉన్న పార్టీ ప్రతినిధులు, అభిమానులను నాగబాబు సమన్వయపరుస్తారని ఆ ప్రకటనలో పేర్కొంది.

దగాకోరు డ్రామాలు!

- దళితులపై చంద్రబాబు కపట రాజకీయం
- రిజర్వుడ్ స్థానాల్లో వరుసగా టికెట్ దక్కడం గగనమే
- బాబు సామాజిక వర్గానిదే పెత్తనం అంతా
- పొత్తులు కుదిరితే ముందుగా రిజర్వుడ్ సీట్లే బలి



దళితులు పీకిందేమీ లేదు: లోకేశ్

యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం రోజు నంద్యాల జిల్లా డోన్ పరిధిలోని జక్కసానిపల్లెలో ఎస్సీలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న నారా లోకేష్ విదేశీ విద్య పథకం గురించి మాట్లాడుతూ 'దళితులు పీకిందీ లేదు... పొడిచిందీ లేదు...' అని దారుణంగా వ్యాఖ్యలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

➤ మాజీ మంత్రి జేఆర్ పుష్పరాజ్‌ను పక్కగదిలో కూర్చోబెట్టి టీజీ వెంకటేష్‌తో బేరాలు కుదుర్చుకుని రాజ్యసభ సీటు అమ్ముకున్నారు.

➤ వర్ల రామయ్యకు ఆఖరిలో బలవంతంగా తిరుపతి ఎంపీ సీటు కేటాయించి బలి పశువును చేశారు. పామర్రులో పనిగట్టుకుని తమవాళ్లతో ఓడించారు.

➤ మీకెందుకురా రాజకీయాలు, పదవులు?.. అవి మాకోసమే ఉన్నాయంటూ అనుంగు శిష్యుడు చింతమనేనితో చెప్పించిన నాడు చంద్రబాబు ఆలోచనలు ఎలా ఉంటాయో మరోసారి రుజువైంది.

➤ దళిత నాయకుల్లో ఏ ఒక్కరూ రాజకీయంగా ఎదగకుండా వెన్నుపోటు రాజకీయాలు ఆయన నైజం. 'దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అని వ్యాఖ్యానించినప్పుడే చంద్రబాబు అంతరంగం బోధపడింది. 'దళితులు పీకిందీ లేదు... పొడిచిందీ లేదు' అంటూ దురహంకారంతో మాట్లాడిన లోకేష్ తండ్రికి తగ్గ తనయుడినని రుజువు చేసుకున్నారు.

నాగా వెంకటరెడ్డి, సాక్షి, ప్రత్యేక ప్రతినిధి:

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దళిత బాంధవుడిగా ప్రచారం చేసుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు తనకు అలవాటైన డ్రామాలను రక్తి కట్టిస్తున్నారు. తమ పార్టీలోని దళిత నేతలను కరివేపాకులా వాడుకుంటున్న చంద్రబాబు దళిత సంక్షేమమంటూ మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, ఆ తరువాత కూడా దళితులను రాజకీయంగా ఎదగనివ్వకుండా చంద్రబాబు అణగదొక్కారనేందుకు ఎన్నో ఉదంతాలున్నాయి. రిజర్వుడు స్థానాలకు అభ్యర్థుల ఎంపికలోనూ బాబు కోటరీ బృందానిదే పెత్తనం. తాము మంత్రులుగా పనిచేసినా చివరిదాకా టికెట్ కోసం ఎదురు చూడాల్సిందేనని గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ దళితనేత 'సాక్షి'తో పేర్కొన్నారు. తామెంత సీనియర్లు అయినా టికెట్ దక్కాలంటే బాబు వర్గీయుల సిఫార్సులు తప్పనిసరని కృష్ణా జిల్లాకు చెందిన మరో నాయకుడు వ్యాఖ్యానించారు.

- ■ కొవ్వూరు నుంచి 2009లో టీవీ రామారావు విజయం సాధించినప్పటికీ తదుపరి ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. 2014లో అక్కడ గెలుపొంది మంత్రిగా వ్యవహరించిన కె.ఎస్.జవహర్‌కు 2019లో టికెట్ నిరాకరించి తిరువూరుకు మార్చడంతో ఓడిపోయారు. 2014లో పాయకరావుపేట నుంచి గెలుపొందిన వంగలపూడి అనితను 2019లో కొవ్వూరుకు మార్చి బరిలోకి దించటంతో ఓడిపోయారు. కొవ్వూరు ఎమ్మెల్యే ఎవరైనా పెత్తనం మాత్రం బాబు వర్గీయులదే.
- ■ చింతలపూడిలో 2009, 2014, 2019లో వరుసగా మార్పులు చేశారు. 2014లో గెలిచి మంత్రిగా పనిచేసిన పీతల సుజాతను తరువాత పక్కనపెట్టేశారు. 2009, 2019లో కె.రాజారావు పార్టీ అభ్యర్థి కావడం గమనార్హం.
- ■ ఉమ్మడి కడప జిల్లా రైల్వేకోడూరులో 1983 నుంచి ఉప ఎన్నికతో సహా పదిసార్లు ఎన్నికలు జరగ్గా తూమాటి పెంచలయ్య మాత్రమే రెండుసార్లు పోటీ చేయగలిగారు. అదీ ఎన్టీఆర్ ఉన్నప్పుడు. ఆ తరువాత ఎనిమిది ఎన్నికల్లోనూ కొత్త ముఖాలే. కె.నారాయణయ్య నాయుడు, జి.ఎన్.నాయుడు కనుసన్నల్లో నడుచుకున్న వారికే అవకాశం దక్కింది.
- ■ బద్వేలు, నందికొట్కూరు, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల అభ్యర్థులు గత మూడు ఎన్నికల్లోనూ మారిపోయారు. మిగతా చోట్లా ఇదే పరిస్థితి. టీడీపీలో రిజర్వుడు స్థానం నుంచి రెండు, మూడు పర్యాయాలు వరుసగా టిక్కెట్ దక్కడమంటే పెద్ద విశేషమే.

- ■ రాజమహేంద్రవరంలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి వరుసగా రెండు పర్యాయాలు ఓడినా ఆయనకు మాత్రం సీటు గ్యారంటీనే. ఇదే జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల జాబితాను పరిశీలిస్తే టీడీపీ అధినేత తీరు తేటతెల్లమవుతుంది.
- ■ దేవినేని ఉమాకు అనుకూలంగా ఉన్నందున ఎన్టీఆర్ జిల్లా నందిగామలో తంగిరాల సౌమ్య, అంతకుముందు ఆమె తండ్రి తంగిరాల ప్రభాకరరావుకు అవకాశం కల్పించారు.
- ■ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సహకారంతో బాపట్ల జిల్లా వేమూరులో నక్కా ఆనందబాబు కొనసాగుతుండటం గమనార్హం. గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో మాకినేని పెదరత్తయ్యది పెత్తనమైనా 2009లో కందుకూరి వీరయ్య, 2014లో రావెల కిషోర్‌బాబు, 2019లో డొక్కా మాణిక్య వరప్రసాద్ పోటీ చేశారు.
- ■ పొత్తు కుదిరిందంటే చాలు.. రిజర్వుడు స్థానాలను కేటాయించేందుకు చంద్రబాబు ఏమాత్రం సంకోచించరు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు వామపక్షాల కోటాలో చేరేది. కర్నూలు జిల్లా కోడుమూరును గతంలో బీజేపీకి కేటాయించడం విశేషం.

విద్యార్థిని వేధించిన బ్యాంకుపై హైకోర్టు ఆగ్రహం

- ఒరిజినల్ డాక్యుమెంట్లు వెనక్కి ఇవ్వని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై మండిపాటు
- విద్యార్థికి ఖర్చుల కింద రూ.25 వేలు చెల్లించాలని తీర్పు



సాక్షి, అమరావతి: విద్యారుణం కోసం దరఖాస్తు చేసే సమయంలో ఓ విద్యార్థి సమర్పించిన ఆస్తి ఒరిజినల్ డాక్యుమెంట్లను అతడికి తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. ఇది ఆ విద్యార్థిని వేధించడమేనన్న హైకోర్టు.. ఇందుకు బ్యాంకు మూల్యం చెల్లించుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఆ విద్యార్థికి ఖర్చుల కింద రూ.25 వేలు చెల్లించాలని బ్యాంకును ఆదేశించింది. ఆ మొత్తాన్ని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో 15 రోజుల్లో హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడిషియల్) వద్ద డిపాజిట్ చేయాలని ఆదేశించింది. లేనిపక్షంలో తమ ఆదేశాల అమలుకు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌కు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఇటీవల తీర్పు చెప్పారు.

ఇదీ పిటిషన్..

మచిలీపట్నానికి చెందిన విద్యార్థి నిశ్చల్.. విద్యారుణం కోసం ఆంధ్రాబ్యాంకుకు (తరువాత ఇది యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనమైంది) దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుతో అవసరమైన డాక్యుమెంట్లను, అతడి తల్లి ఇచ్చిన ఆస్తి ఒరిజినల్ గిఫ్ట్ డీడ్‌ను బ్యాంకు అధికారులకు సమర్పించారు. అయితే కొల్లేటరల్ సెక్యూరిటీకి సంబంధించిన ఒరిజినల్ డీడ్‌ను సమర్పించలేదంటూ నిశ్చల్‌కు రుణం మంజూరు చేసేందుకు బ్యాంకు అధికారులు నిరాకరించారు. దీంతో నిశ్చల్ తాను సమర్పించిన ఒరిజినల్ గిఫ్ట్ డీడ్‌ను తిరిగి ఇచ్చేయాలని బ్యాంకు అధికారులను కోరారు. దీనికి బ్యాంకు అధికారులు సానుకూలంగా స్పందించలేదు. తమకు ఒరిజినల్ డాక్యుమెంట్ ఇవ్వలేదని చెప్పారు. దీంతో నిశ్చల్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ తిల్హరీ విచారించారు.

ఒరిజినల్ డీడ్‌ను ఇచ్చేస్తాం..

నిశ్చల్ న్యాయవాది శిఖరం కృష్ణమోహన్ వాదనలు వినిపిస్తూ.. దరఖాస్తుతో పాటు ఒరిజినల్ గిఫ్ట్ డీడ్‌ను సమర్పించినప్పటికీ బ్యాంకు అధికారులు ఇవ్వలేదంటూ చెప్పడం దారుణమన్నారు. దరఖాస్తుతో పాటు ఒరిజినల్ డీడ్‌ను సమర్పించామంటూ అందుకు సంబంధించిన ఆధారాలను ఆయన కోర్టు ముందుంచారు. ఈ సమయంలో బ్యాంకు న్యాయవాది వి.ద్యుమని పూర్తివివరాలను తెలుసుకుని కోర్టు ముందుంచేందుకు గడువు కోరారు. ఇందుకు అంగీకరించిన న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు. తిరిగి ఇటీవల ఈ వ్యాజ్యం విచారణకు రాగా.. ద్యుమని స్పందిస్తూ దరఖాస్తుతో పాటు పిటిషనర్ ఒరిజినల్ డీడ్‌ను సమర్పించారని తెలిపారు. వాటిని తిరిగి ఇచ్చేందుకు బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. ఆ డీడ్ ద్వారా తన ఖాపెట్టిన ఆస్తిని 15 రోజుల్లో విడిపిస్తామని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బ్యాంకు తీరును తప్పుపట్టారు. ఇది పిటిషనర్‌ను వేధించడమేనన్నారు. అందుకే పిటిషనర్ మరో గత్యంతరం లేక న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. ఇందుకుగానూ రూ.25 వేలను ఖర్చుల కింద పిటిషనర్‌కు చెల్లించాలని బ్యాంకును ఆదేశించారు.

ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

- గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబం సొంతింటి కలను నెరవేర్చేలా ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకాన్ని అమలు చేస్తున్నదని గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా అన్నారు. శుక్రవారం విజయవాడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీషా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ..పేదల ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నదే అంబేడ్కర్ ఆశయమని తెలిపారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చీఫ్ ఇంజనీర్ జి.వి.ప్రసాద్, ఎస్ఈ జయరామాచారి, ప్రత్యేకాధికారి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మే రెండోవారంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా

నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలో వేట నిషేధం

- వైఎస్సార్ మత్స్యకార భరోసా అర్హుల ఎంపికకు ఆర్బీకే స్థాయిలో బృందాలు
- 17న క్షేత్రస్థాయిలో బోట్ల పరిశీలన
- బోటు యజమానులతో పాటు కలాసీల గుర్తింపు
- సోషల్ ఆడిట్ కోసం నెలాఖరులో ఆర్బీకేల్లో ప్రదర్శన



సాక్షి, అమరావతి: రెండునెలల విరామం కోసం బోట్లు తీరానికి చేరుకుంటున్నాయి. చేపల పునరుత్పత్తి కోసం సముద్రంలో 61 రోజుల పాటు అమలు చేయనున్న వేట నిషేధం శనివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తుంది. వేట నిషేధాన్ని పక్కాగా అమలు చేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం వచ్చేనెల రెండోవారంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా (వేటనిషేధ భృతి) పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. వేట విరామాన్ని ఉల్లంఘించిన వారి బోట్లను సీజ్ చేయడమేగాక సంక్షేమ పథకాలు కట్ చేస్తామని స్పష్టం చేసింది. రాష్ట్రంలో తడ మొదలు ఇచ్ఛాపురం వరకు 974 కిలోమీటర్ల మేర విస్తరించిన సముద్రతీరంలో 555 మత్స్యకార గ్రామాల్లో 8.50 లక్షల మత్స్యకార కుటుంబాలున్నాయి. వీటిలో 1.60 లక్షల కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి.

ఏటా పెరుగుతున్న బోట్లు

డీజిల్ సబ్సిడీని రూ.6.03 నుంచి రూ.9కి పెంచడంతో ఏటా వేటకు వెళ్లే బోట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. మొత్తం బోట్ల సంఖ్య 2019–20లో 14,229 బోట్లు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య ఏకంగా 29,964కు చేరింది. వీటిలో 1,610 మెకనైజ్డ్, 22,011 మోటరైజ్డ్, 6,343 సంప్రదాయ బోట్లున్నాయి. వీటిపై వేట సాగించే మత్స్యకార కుటుంబాలకు వేట విరామ సమయంలో రూ.4 వేల చొప్పున ఇచ్చే వేటనిషేధ భృతిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.10 వేలకు పెంచింది. పైగా ఈ మొత్తాన్ని నిషేధకాలం ముగియకుండానే బ్యాంకు ఖాతాలకు నేరుగా జమచేస్తూ గంగపుత్రులకు అండగా నిలుస్తోంది. టీడీపీ ఐదేళ్లలో 3 లక్షల మందికి రూ.104.62 కోట్ల భృతిని అందించగా, గడిచిన 4 ఏళ్లలో ఈ ప్రభుత్వం 4.14 లక్షల మందికి రూ.414.49 కోట్ల భృతిని అందించింది. అదేరీతిలో ఈ ఏడాది కూడా మే రెండో వారంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

అర్హుల గుర్తింపునకు బృందాలు

ఆర్బీకేల్లో పనిచేసే గ్రామ మత్స్య సహాయకునితో పాటు వలంటీర్, సాగరమిత్రలతో ఏర్పాటు చేసిన బృందాలతో ఈ నెల 17వ తేదీన లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టనుంది. ఆరోజు తీరంలో లంగరేసిన బోట్లను ఈ బృందాలు పరిశీలించి వివరాలు నమోదు చేస్తాయి. గుర్తింపు సమయంలో బోటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఫిషింగ్ లైసెన్సు, ఆధార్, రైస్‌కార్డుతోపాటు బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. 18వ తేదీ గ్రామ సచివాలయ డిపార్టుమెంట్ రూపొందించే సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ డేటా ఆధారంగా ఆరుదశల వెరిఫికేషన్ తర్వాత అర్హుల జాబితాలను సామాజిక తనిఖీకి ఆర్బీకేల్లో ప్రదర్శిస్తారు. అనర్హత పొందిన వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హత ఉంటే జాబితాల్లో చేర్చి తుది జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ మొత్తం ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తిచేసేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేసింది.

అర్హులు వీరే..

- ■ 18 మీటర్లకుపైన పొడవు ఉండే మెకనైజ్డ్ బోట్లకు యజమాని కాకుండా 10 మంది, 18 మీటర్ల లోపులో ఉండే మోటరైజ్డ్ బోట్లకు యజమాని కాకుండా ఎనిమిదిమంది, ఇతర మోటరైజ్డ్ బోట్లకు యజమానితో కలిపి ఆరుగురు, సంప్రదాయ, నాన్ మోటరైజ్డ్ బోట్లకు యజమానితో సహా ముగ్గురు చొప్పున అర్హులు.
- ■ వయసు 18–60 ఏళ్ల మధ్య ఉండాలి.
- ■ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, అర్బన్ ప్రాంతాల్లో 1.44 లక్షలలోపు ఉండాలి.
- ■ సంక్షేమ పథకాలు పొందినవారు, మత్స్యకార పింఛన్ పొందుతున్నవారు, కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ, ప్రభుత్వరంగ ఉద్యోగాలు చేస్తున్నవారు. 3 ఎకరాల మాగాణి లేదా 10 ఎకరాల మెట్ట, లేదా రెండు కలిపి 10 ఎకరాలకు మించి భూమి ఉండకూడదు.
- ■ అర్బన్ ప్రాంతాల్లో కనీసం వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణానికి మించి ఇల్లు ఉండకూడదు. ఆదాయపన్ను చెల్లింపుదారులై ఉండకూడదు.

విపక్షాల గొంతు నొక్కేందుకే సీబీఐ, ఈడీల ప్రయోగం

ఉభయ కమ్యూనిస్టు పార్టీల 'ప్రచార భేరీ' యాత్రను ప్రారంభించిన సీపీఎం జాతీయ నేత ప్రకాశ్ కారత్



ప్రచార భేరీ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రకాశ్ కారత్

సాక్షి, అమరావతి: పార్లమెంట్‌లో విపక్షాల గొంతును అధికార బీజేపీ నొక్కేస్తున్నదని, విమర్శలు చేసేవారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నదని సీపీఎం జాతీయ నేత ప్రకాశ్ కారత్ మండిపడ్డారు. 'మోదీని గద్దె దింపండి–దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు చేపట్టిన ప్రచార భేరీ కార్యక్రమాన్ని ప్రకాశ్ కారత్ శుక్రవారం ప్రారంభించారు. తొలుత తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఉభయ కమ్యూనిస్టు పార్టీ నేతలు.. అనంతరం మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో ప్రచార భేరీ యాత్ర ప్రారంభ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ కారత్ మాట్లాడుతూ విపక్షాలపై సీబీఐ, ఈడీ దాడులు చేయిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలకు దిగుతున్నదన్నారు. మోదీ ప్రభుత్వ తీరుతో ప్రజల్లో అసమానతలు పెరిగిపోయాయని, వ్యవసాయ సంక్షోభం ఏర్పడడానికి బీజేపీ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో లేకపోయినా వైసీపీ ప్రభుత్వం బీజేపీ విధానాలనే అమలు చేస్తున్నదని ఆరోపించారు. సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు బినయ్ విశ్వం మాట్లాడుతూ ప్రచారభేరీ కార్యక్రమాన్ని ఈ నెల 30వ తేదీ వరకు రాష్ట్రంలోని 26 జిల్లాల్లోను నిర్వహిస్తామన్నారు. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, సీపీఎం సీనియర్ నేత పి.మధు, సీహెచ్ బాబూరావు మాట్లాడారు. ఈ సందర్భంగా విజయవాడ నగరంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఊహలకు రూపం.. కదిలే నిర్మాణం!

విస్తరిస్తున్న రెడీమేడ్ క్యాబిన్లు

- అతి తక్కువ ఖర్చుతో నిర్మాణం
- సులువుగా తరలించే అవకాశం
- ఆలోచనలకు తగినట్లుగా వాతావరణం
- ఆర్డర్ ఇస్తే చాలు రోజుల్లో ఇల్లు సిద్ధం

నా ఆలోచనకు తగినట్లుగా..

ఏదైనా వ్యాపారం మొదలుపెట్టాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. బిజినెస్ జరగకపోతే పెట్టిన డబ్బంతా మట్టిలో పోసినట్లే. ఈ పరిస్థితుల్లో ఏంచేస్తే బాగుంటుందని ఆలోచిస్తుండగా క్యాబిన్స్ తయారీ గురించి తెలుసుకున్నా. వారిని సంప్రదించి నా ఆలోచనలకు తగినట్లుగా కాఫీ షాపును రూ.1.30లక్షలతో తయారుచేయించుకున్నా. ఒకవేళ వ్యాపారం జరగకపోతే ఈ దుకాణాన్ని మరోచోటుకు మార్చుకోవచ్చు.

– అనిల్, కాఫీ షాపు యజమాని, కర్నూలు



అనిల్ నిర్వహిస్తున్న కాఫీ షాపు

సాక్షి, కర్నూలు డెస్క్

ఇల్లు కట్టి చూడు.. పెళ్లిచేసి చూడు అంటారు పెద్దలు. ఈ రెండింటిలో ఏది మొదలుపెట్టినా పూర్తయ్యే వరకు కంటి మీద కునుకు ఉండదు. ఎంత డబ్బు చేతిలో ఉన్నా రోజుకో కొత్త సమస్య వస్తూనే ఉంటుంది. ఇవేకాదు.. వ్యాపారం చేయాలన్నా సవాలక్ష ప్రశ్నలు. బిల్డింగ్ ఎంపిక.. పెట్టుబడి.. ఆలోచనకు అనువుగా గది వాతావరణాన్ని తీర్చిదిద్దుకోవడం.. ఇలా ఎన్నో. వందలు.. వేలు అయితే పర్వాలేదు కానీ, లక్షలతో ముడిపడిన వ్యవహారం కావడంతో ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి. ఈ కోవలోనే ఇల్లు.. దుకాణం.. వ్యాపారం.. ఏదైనా సరే ఊహలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటోంది. ఇనుప రేకులతో తయారవుతున్న 'క్యాబిన్' ఎన్నో ప్రశ్నలకు సమాధానంగా నిలుస్తోంది.

కరోనా.. వ్యాపార ముఖచిత్రాన్నే కాదు, జీవన విధానంలోనూ ఎన్నో మార్పులకు కారణమైంది. ఇల్లు కట్టుకోవాలన్నా, వ్యాపారంలోకి దిగాలన్నా తమకు తాము ఎన్నో ప్రశ్నలు వేసుకుంటున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ ఎందులోనైనా కాస్త డబ్బు మిగులుతుందేమోనని ఆలోచిస్తున్నారు. హంగూ ఆర్భాటాలకు పోకుండా ఉన్నంతలో హాయిగా జీవించేందుకు అవసరమైన సౌకర్యాలతో సరిపెట్టుకుంటున్నారు. ఈ అవసరాల నుంచి పుట్టుకొచ్చినవే రెడీమేడ్ క్యాబిన్లు. ఇవి పైకి సాదాసీదాగా కనిపించినా, లోపల కోరుకున్న విధంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఉండటంతో ఇప్పుడివి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పార్టీషన్లతో అవసరమైన విధంగా ఆర్డర్ ఇస్తే చాలు.. ఎంపిక చేసుకున్న స్థలంలో ఇట్టే అమరుస్తున్నారు. నెలల తరబడి నిరీక్షించే పనిలేకుండా, దగ్గరుంటేనే పని జరుగుతుందనే ఆలోచన అవసరంలేకుండా ఈ క్యాబిన్లు స్వాగతం పలుకుతున్నాయి. తక్కువ స్థలంలో నచ్చిన సౌకర్యాలతో ఇంటిని తలదన్నేలా ఈ క్యాబిన్లను సిద్ధంచేస్తున్నారు. వంట గది, వాష్‌రూమ్, ఇంకా ఎన్నెన్నో. మన అవసరాలు వివరిస్తే చాలు.. క్యాబిన్‌లో ఏర్పాటుచేసి అవసరమైన చోట పెట్టేస్తున్నారు. అలాగే, దుకాణం ఎలా ఉండాలో చెబితే చాలు.. ఆ విధంగా తెచ్చి పెట్టేస్తున్నారు.



పల్లెటూరులో ఆకట్టుకుంటున్న రెడీమేడ్ ఇల్లు

చదరపు అడుగును బట్టి ధర

క్యాబిన్ల తయారీని చదరపు అడుగులను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం ఒక చదరపు అడుగుకు రూ.1,150లుగా వసూలు చేస్తున్నారు. కాఫీషాప్, గెస్ట్‌హౌస్, ఫామ్ హౌస్, ఆఫీస్ క్యాబిన్లతో పాటు ఇప్పుడు ఏకంగా ఫంక్షన్ హాల్ క్యాబిన్లు సైతం అందుబాటులోకి రావడం విశేషం. ఎప్పుడుల్లోపు కావాలని చెప్పడమే తరువాయి.. అప్పట్లోగా వీటికి సిద్ధంచేస్తున్నారు. అగ్ని ప్రమాదాలను కూడా తట్టుకునేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు. ఎలాంటి సమస్య వచ్చినా సర్వీసు అందుబాటులో ఉండటంతో చాలామంది వీటి పట్ల ఆకర్షితులవుతున్నారు.

డబ్బా చక్రాల సైకిల్..

ఈజీగానే తొక్కొచ్చు!



సైకిల్ అంటే ఎలా ఉంటుంది? రెండు పెద్ద చక్రాలు.. వాటిని అటాచ్ చేస్తూ ఫ్రేమ్, చైన్ అంతేకదా! సైకిల్ అనే కాదు.. ఏ వాహనానికైనా ఉండేది గుండ్రని టైర్లు, చక్రాలే. అలా కాకుండా సైకిల్‌కు చతురస్రాకారంలో టైర్లు ఉంటే? అలా సింపుల్‌గా తొక్కేసుకుంటూ వెళ్లిపోగలిగితే? అదెలా సాధ్యమనిపిస్తోంది కదా! రష్యాకు చెందిన 'ది క్యూ'సంస్థ ఇంజనీర్ సెర్గీ గోర్డీవ్ మాత్రం దీనిని చేసి చూపించాడు. చతురస్రాకారంలో టైర్లను రూపొందించి.. సాధారణ సైకిల్ ఫ్రేమ్‌కు అమర్చి నడిపించాడు. దీనికి సంబంధించిన వీడియో యూట్యూబ్‌లో వైరల్‌గా మారింది కూడా.

➤ ఇదో వినూత్న ఆలోచన, చాలా బాగుందని కొందరు నెటిజన్లు ప్రశంసిస్తుంటే.. అంతా బాగానే ఉందిగానీ.. స్పీడ్ బ్రేకర్లు, గుంతలు వస్తే పరిస్థితి ఏమిటన్న కామెంట్లూ వస్తున్నాయి.



'స్క్వేర్'టైర్లతో నడిచేదెలా?

యుద్ధ ట్యాంకుల చక్రాల్లో వాడే టెక్నాలజీని 'స్క్వేర్ టైర్'సైకిల్‌లో వినియోగించారు. సింపుల్‌గా చెప్పాలంటే.. ఇందులో చక్రాలు మొత్తానికి మొత్తంగా తిరగవు. జస్ట్ వాటి అంచున ఏర్పాటు చేసే ప్రత్యేకమైన బెల్ట్ మాత్రమే కదులుతుంది. అలాగే 'స్క్వేర్ వీల్'సైకిల్‌లో చతురస్రాకారపు వీల్స్ కదలకుండా అలాగే ఉంటాయి. సెర్గీ గోర్డీవ్ ప్రత్యేకమైన బెల్ట్‌ను తయారు చేసి వాటి అంచులో అమర్చాడు. పెడల్స్ తొక్కినప్పుడు ఆ బెల్ట్ కదిలేలా.. గేర్లను, చైన్‌లను అమర్చి అనుసంధానించాడు. పెడల్‌ను తొక్కినప్పుడు.. బెల్ట్ కదులుతూ సైకిల్ ముందుకు వెళుతుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943